Deccan Land

Deccan

MAY | MAY 2026



PRGI Regn. No. TELTEL/2012/46784
₹30
సంపుటి : 14
సంచిక : 9

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

మే - 2026
DECCAN LAND, HYDERABAD
165
MAY - 2026



UNESCO, India Tentative List (TL) Site - 2024: ROCK ART SITES OF THE CHAMBAL VALLEY

VOL 14వ వసంతంలో
165 ISSUES నూట అరవై ఐదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్

- కెన్నెల్ ఆండర్సన్: ఆవరణ వ్యవస్థల అవగాహన
- బ్రిటిష్ ఇండియా – ఆల్ ఇండియా: రేడియో
- భూగోళానికి తగ్గుతున్న సూర్యకాంతి
- నాయక్‌పోడ్ మాస్కులకు పునర్జీవం



Sankranthi vibes to Annual Day shines ,our young stars lit up the stage with tradition, talent, and unstoppable energy!



**MAY 2026**

Dance is where discipline meets joy, and expression finds its rhythm. Students performing Maharashtra's traditional Lavani Dance.


Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad

Ph : 040 2763 6214, +91 99590 20512

www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE


| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

**Important Dates**

01 May - International Labour Day

27 May - Bakrid

NOTES :


Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph. +91 90599 50055


The only way to predict the future is to build it.




UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2024
Serial Nomination for
**ROCK ART SITES OF THE CHAMBAL VALLEY**
Madhya Pradesh and Rajasthan
Province or Region India. Category: Cultural

## చంబల్ లోయలో పాత రాతియుగం చిత్రాలు

ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో రాతి చిత్రకళా కేంద్రాలు ఉన్న ప్రాంతాలుగా చంబల్ బేసిన్, మధ్య భారత దేశం గుర్తింపు పొందాయి. పురాతన కాలంలో 'చర్మణ్వతి' అని పిలువబడే చంబల్ నది మాల్వా ట్రాప్ జోన్ నుండి జన్మిస్తుంది; దీని కుడి వైపు ఉపనదులు ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తాయి. మరోవైపు, ఎడమ వైపు ఉపనదులు ఆరావళి పర్వతాలు, వింధ్య ఇసుకరాతి, క్వార్ట్జైట్ కొండల నుండి పుడతాయి. పాతరాతియుగం, మధ్యరాతియుగం, నవీనరాతియుగం, చారిత్రక కాలాలకు చెందిన ఈ చిత్రకళా కేంద్రాలు తరచుగా తామ్ర శిలాయుగం, బృహత్ శిలాయుగం, పూర్వ చారిత్రక కాలాల అంశాలతో పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. భారతదేశ మధ్య ప్రాంతం అనేక రాతి చిత్రకళా కేంద్రాలకు నిలయంగా ఉంది.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## కాలజ్ఞానాన్ని కాపాడుకుందాం!

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు వెలసిన కందిమల్లయ్యపల్లె (బ్రహ్మంగారిమఠం) ఆధ్యాత్మిక క్షేత్రం. వారు నివసించిన గృహం గత ఏడాది తుఫానుకు కూలిపోవడాన్ని వారి భక్తులు, పర్యావరణవేత్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానం ప్రపంచానికి పరిచయమైంది ఈ మఠం నుంచే. కులమతాలకు అతీతంగా బ్రహ్మంగారి మఠం నిత్యం భక్తులతో, ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుంది. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు నివసించిన ఇల్లు, ఆయన ఆధ్యాత్మిక ప్రయాణం సాగించిన ప్రాంతం కడప జిల్లాలోని కందిమల్లాయపల్లినే. బ్రహ్మంగారు తన జీవితంలో ఎక్కువ కాలం గడిపింది, కాలజ్ఞానాన్ని రచించింది ఈ గ్రామంలోనే. కందిమల్లయ్య పల్లికి రాకముందు స్వామి వారు కర్నూలు జిల్లాలోని బనగానపల్లిలో కూడా నివసించారు. అక్కడ అచ్చమ్మ అనే మహిళ ఇంట్లో పశువుల కాపరిగా ఉంటూ అక్కడి సమీపంలోని రవ్వలకొండ గుహల్లో కూర్చుని కాలజ్ఞానం రాశారు. ఆయన భార్య గోవిందమ్మ గారు కూడా అదే ఇంట్లో ఉంటూ స్వామివారి శిష్యులకు మాతృ ప్రేమతో భోజనం వడ్డించేవారు. మఠం చుట్టూ ప్రశాంతమైన వాతావరణం, నిత్యం జరిగే భజనలు, అన్నదాన కార్యక్రమాలు, సత్సంగాలు భక్తులకు ఎంతో మనశ్శాంతిని ప్రసాదిస్తాయి. 1693వ సంవత్సరంలో వైశాఖ శుద్ధ దశమినాడు వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుల సమక్షంలో భూగర్భ సమాధిలోకి వెళ్ళి, సజీవ సమాధి పొందారు. భక్తులు నేటికీ ఆ సమాధిని దర్శించుకుని తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ ఉంటారు. పునరుద్ధరణకు అంచనాల రూపకల్పన కోసం, కూలిపోయిన బ్రహ్మంగారి నివాసాన్ని పరిశీలించిన కేంద్ర ఇంటాక్ బృందం, సహకరించిన ఇంటాక్ కడప చాప్టర్ బృందానికి, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు స్వామి వారి భక్తులు, వారసత్వ ప్రేమికులు.

– పసల పోతులూరి, కడప

❖ ❖ ❖

## "పూటకూళ్ళవ్వ"

గత 14 మాసాలుగా (మార్చి 2025 నుండి) దక్కన్ ల్యాండ్ మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురితమవుతున్న నా రచన **"పూట కూళ్ళవ్వ"** ఏప్రిల్ (2026) మాసంతో సమాప్తం అయ్యింది. సుమారు రెండు లక్షల పైన ఆన్‌లైన్ పాఠకులు, పదివేల పైన ఆఫ్‌లైన్ సర్క్యులేషన్ ఉన్న పత్రిక దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక. ఇంతటి ప్రముఖ పత్రికలో నేను రచించిన మొదటి సీరియల్ "పూట కూళ్ళవ్వ" ప్రచురించబడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. పత్రిక సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి సదా కృతజ్ఞురాలిని. వారికి నా మనః పూర్వక ధన్యవాదాలు.. నమస్సులు! ముఖ్యంగా పాఠక లోకానికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు!!

ఎంతో మంది పాఠకులు 'పూట కూళ్ళవ్వ' కథ చదివి నాకు ఫోన్లు చేసి, మెసేజ్ చేసి స్పందించి.. నిజ జీవితానికి దగ్గరగా ఉందని కొందరు, ఇప్పుడు ఆ విడిది నిజంగా ఉందా! ఎక్కడ ఉంది! అని కొందరు, ఒకప్పుడు మేము పూట కూళ్ళవ్వ ఇంట్లో ఉండి చదువుకున్నామని మరి కొందరు.. ఇలా అనేక విధాలుగా స్పందించి అభినందించారు. ఇంతగా ఆదరించిన పాఠకులందరికీ మరో మారు ధన్యవాదాలు.

ఈ విధంగా నా సాహితీ యాత్రకు మరింత ప్రోత్సాహమిచ్చి, నా రచనా విజయానికి కారకులైన దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ గారికి నా నమస్సుమాంజలి!!

– మాదారపు వాణిశ్రీ, రచయిత్రి

❖ ❖ ❖

## కాలానికి అతీతంగా వారణాసి

'కాలానికి అతీతంగా వారణాసి' ప్రత్యేక వ్యాసం ఆద్యంతం ఆకట్టుకుంది. జీవనదీ తీరంలో సజీవంగా పురాతన వారసత్వాన్ని యునెస్కో గుర్తింపు పొందడం హర్షణీయం. సంబంధిత చిత్రాలు అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇంకా రచయితలు శ్రీరామోజు హరగోపాల్ 'నిడిగొండ చరిత్ర తొవ్వల్లో..', గాండ్ల లచ్చయ్య 'మహానగరాలు కుంగుతున్నాయా!' వ్యాసాలు ఆకట్టుకున్నాయి.

– బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్ ద

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురించే జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 9 పేజీలు : 60

మే - 2026

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

వాణిజ్య ప్రకటనలు
**కె. సచిన్**
86866 64949

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**

కవర్‌పేజీ
**పాత రాతియుగం చిత్రాలు**

layout - Composing & Printed @
DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020
Mobile: 90599 50055
deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.



కవర్ స్టోరీ
29వ పేజీలో

# లోపలి పేజీల్లో...

నియోబియం మూలకం యొక్క ఖనిజాలు



దేవాలయవాస్తులో అపురూపం నందికంది గుడి



జైశెట్టి రమణయ్య సార్ .................................................... దక్కన్ న్యూస్ ......................... 6
చెట్లను పెంచుదాం! భూమిని కాపాడుకుందాం!. (ఎడిటోరియల్) . వేదకుమార్. యం ..................... 7
'అద్రకే కే పంజే': బబ్బన్ ఖాన్ కన్నుమూత ............................ ఎసికె. శ్రీహరి .......................... 8
ఫిరోజా (టర్కాయిస్) ............................................... చకిలం వేణుగోపాలరావు ................ 9
'సృజన'కు తెలంగాణా తొలబడి ..................................... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ............. 12
కెన్నెల్ ఆండర్సన్ రచనలు ........................................ డా॥ ఆర్. సీతారామారావు ............ 13
బ్రిటిష్ ఇండియాలో రేడియో, ఆల్ ఇండియా రేడియో ......... డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 15
ఇంటాక్ జాతీయ కార్యవర్గానికి ఎన్నికైన వేదకుమార్ మణికొండ ..... కట్టా ప్రభాకర్ ...................... 18
ఉలవపాడు మామిడి రుచి రహస్యం .................................... సాయి పాపినేని ....................... 19
మసులీపటాం ఓడరేవు: గల్ఫ్ ఓడరేవులతో వ్యాపారం .................. మహ్మద్ సిలార్ ....................... 21
నాయకపోడ్ మాస్కులకు పునర్జీవం ............................... ద్యావనపల్లి సత్యనారాయణ ............ 25
నియోబియం మూలకం యొక్క ఖనిజాలు .......................... కమతం మహేందర్‌రెడ్డి ............... 27
చంబల్ లోయలో పాత రాతియుగం నాటి చిత్రాలు .................. ఎన్. వంశీమోహన్ ...................... 29
పిల్లలమర్రి దేవాలయం - ప్రత్యేకతలు ................................ డా॥ జి.యస్. రామయ్య ................ 35
శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో జీవవైవిధ్యం ..................... మన్నె వెంకట సుబ్బారెడ్డి ............... 37
ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ...................................... జుగాష్‌విలి ........................ 40
కొమ్మాయిపల్లి గడీ విశిష్టత ............................................ ఎం. మురళీధర్‌రెడ్డి ................. 41
దేవాలయవాస్తులో అపురూపం నందికంది గుడి ..................... శ్రీరామోజు హరగోపాల ............... 43
భూగోళానికి తగ్గుతున్న సూర్యకాంతి! ................................ డా॥ లచ్చయ్య గాండ్ల ................ 47
నవకల్పనే సాంకేతిక స్వావలంబన! .................................. కొత్వాల్ సచిన్ ........................ 50
నిర్మల్ గ్టులపై రాగాలు పలికే రాళ్లు .................................. డా॥ తుమ్మల దేవరావ్ ................. 52
సి.పి. బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన కృషి ........................... ఆమంచ లోకేష్ ........................ 54
శిథిలాల నుండి పంటకోత వరకు ...................................... డౌన్ టు ఎర్త్ ........................ 56

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిద్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# జైశెట్టి రమణయ్య సార్

చరిత్ర పుటలపై చెదిరిపోని గుర్తు డాక్టర్ జైశెట్టి రమణయ్య సార్ (87) 27 మార్చి 2026న తెల్లవారుజామున కన్ను మూశారు. కొన్నాళ్లుగా వయోభారంతో బాధపడుతున్న ఆయన, జగిత్యాలలోని తన నివాసంలోనే తుది శ్వాస విడిచారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన ఆయన, నలభై ఏండ్ల బోధనా ప్రస్థానంలో వేలాది మంది శిష్యులను సంపాదించుకున్నారు.

1971లో సిద్దిపేట జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా డా. జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన అరుదైన వ్యక్తిగా, జగిత్యాలలో మొట్టమొదట డాక్టరేట్ పొందిన పరిశోధన విద్యార్థిగా ఆయన పేరొందారు. “సౌత్ ఇండియా టెంపుల్స్” అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్‌డీ పట్టాను పొందారు.



1939లో జన్మించిన ఆయన, ప్రాథమిక విద్యను, మెట్రిక్యులేషన్ కోర్సును జగిత్యాలలోనే పూర్తి చేశారు. మెట్రిక్‌లేషన్ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పొంది 1955లో తొలిసారిగా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. ఆపైన అంచలంచెలుగా ఎదుగుతూ ఎన్నో పదోన్నతులు పొందారు. బిఏ పూర్తి చేసిన తర్వాత పాఠశాల ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆపైన జగిత్యాల మల్టీపర్పస్ హైస్కూల్‌లో సోషల్, ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేశారు. ఆపైన హిస్టరీ సబ్జెక్టులో పీజీ పూర్తి చేశారు. 1970లో లెక్చరర్‌గా పదోన్నతి పొంది సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న సమయంలోనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఇంటర్మీడియెట్‌లో హిస్టరీ సబ్జెక్టును బోధించారు. 1974లో సిద్దిపేట నుంచి జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీకి బదిలీపై వచ్చారు.

1985లో సెంట్రల్ యునివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. చాళుక్యాస్ అండ్ కాకతీయాస్ టెంపుల్స్, టెంపుల్స్ ఆఫ్ సౌత్ ఇండియా అనే రెండు పరిశోధన గ్రంథాలను వెలువ రించారు. జగిత్యాల డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న తరుణంలోనే రీడర్‌గా పదోన్నతి పొందారు. 1996లో ఉద్యోగ విరమణ పొందారు. రమణయ్య సార్ 41 ఏళ్ల సర్వీస్‌లో అనేక విజయాలను సాధించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఎన్యుమరేట్‌గా ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పరిశోధన గ్రంథాలతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర-సంస్కృతి అనే పుస్తకాన్ని రచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి పాత, కొత్తరాతి యుగం, చారిత్రక యుగం, శాతవాహనుల రాజ్యం ఇలా ఆధునిక చరిత్ర వరకు సకల వివరాలతో తన గ్రంథంలో పొందుపర్చారు. దాంతోపాటు కాలగమనంలోకి కోన సముద్రం, ఎలగందల్ పర్యాట కేంద్రం, వేములవాడ క్షేత్ర చరిత్ర తదితర పుస్తకాలు రచించారు. 1957 నుంచి ఆయన రాస్తూ వచ్చిన వ్యక్తిగత డైరీలు ఆంధ్ర ప్రదేశ్ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచాయి. వీటన్నింటిని సమీకృతం చేస్తూ ఆయన సొంత ఎదుగుదల అనే పుస్తకాన్ని సైతం వేశారు.

### వేలాది మందికి ప్రియతమ ఆచార్యుడు

రమణయ్య సార్ జగిత్యాల ప్రాంతంతో విడదీయరాని అనుబంధాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆయన సుదీర్ఘ బోధన ప్రస్తానంలో వేలాది మంది గొప్ప శిష్యులను తయారు చేసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు విశ్వవిద్యాలయాల ఛాన్సలర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, సుప్రీంకోర్టు జడ్జీలుగా వీరి శిష్యులు పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం వీసీ అనుమాండ్ల భూమయ్య, శాతవాహన వీసీ రాజారెడ్డి, ఇక్బాల్, కాకతీయ వీసీ లింగమూర్తి, సుప్రీంకోర్టు జడ్జీ జీవన్‌రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత మండలి చైర్మన్ ఆచార్య జయప్రకాశ్‌రావు ఇలా వేలాది మంది శిష్యులున్నారు. మాజీమంత్రి ఎల్ రమణ, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తదితరులు సైతం ఆయన శిష్యులే.

జైశెట్టి రమణయ్య సార్ మృతి తెలియగానే పలువురు ప్రముఖులు, ఆయన శిష్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సార్ వాళ్ల ఇంటికి వెళ్లి పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. దక్కన్‌ల్యాండ్ వారి మృతికి నివాళులర్పిస్తుంది.

– దక్కన్‌న్యూస్

m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# చెట్లను పెంచుదాం! భూమిని కాపాడుకుందాం!




"మన భవిష్యత్తు చెట్లపై ఆధారపడివుంది. వృక్షాలు మనకు ఆహారం, నీరు, గాలి, వర్షాలు అందిస్తాయి. కానీ మనం వాటిని కాపాడకపోతే మన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది". ఈ మాటలన్నది పద్మశ్రీ వనజీవి రామయ్యగారు. ఈ మాటలు సాదాసీదాగా మామూలు మాటలుగా కనిపించవచ్చు. కాని ఈ మాటల్లో కఠోర వాస్తవిక వుంది.

రోజురోజుకీ పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయి. భూసారం, ఉత్పాదక శక్తులు తగ్గిపోతున్నాయి. రసాయన ఎరువులు, పురుగుమందులు వల్ల మట్టిలోపలి ప్రయోజనకరమైన సూక్ష్మ జీవులు, శిలీంద్రాలు నశించిపోతున్నాయి. భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. అడవుల నరికివేత, గనుల తవ్వకం, పారిశ్రామిక వ్యర్థాలు, వాయు, జల కాలుష్యాలకు కారణమవుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు వివిధ రకాల కాలుష్యాల వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడుతుంది. దీనితో జీవవైవిధ్యం దెబ్బతింటున్నది.

ప్రకృతిని ప్రేమిస్తే, దానిని కాపాడుకోగలిగితే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. ప్రకృతి పరిరక్షణకోసం తమ జీవితాలను అంకితం చేసిన గొప్ప వ్యక్తులు మనకు ప్రేరణగా వున్నారు. ఒంటరి కృషితో ఎడారి భూమిని పచ్చని అడవిగా మార్చిన ఫారెస్ట్‌మ్యాన్ ఆఫ్ ఇండియా జాదవ్ పాయెంగ్ వారిలో ఒకరు. అస్సాంలోని బ్రహ్మపుత్ర నదీతీర గ్రామంలో జన్మించారు. చిన్నప్పుడే ప్రకృతితో మమేకమయ్యారు. ఎండిపోయిన ఇసుక తిన్నెలపై చెట్లు నాటడం ప్రారంభించారు. మొదట వెదురు మొక్కలు నాటి, ప్రతిరోజూ ఆ ప్రాంతానికి వెళ్లి నీళ్లు పోసి, సంరక్షించాడు. ఇప్పుడు అది అడవిగా మారింది. ఇప్పుడు దీనిని మొలాయి అడవిగా పిలుస్తున్నారు. అనుకూల వాతావరణం వల్ల పులులు, ఏనుగులు, జింకలు వంటి అనేక జీవులతో అది ఒక సహజ వన్యప్రాణుల కేంద్రంగా వుంది. వీరిని 2015లో పద్మశ్రీ పురస్కారాలతో ప్రభుత్వం గౌరవించింది.

తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం ప్రాంతానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు, వనజీవి రామయ్యగారు. ఒక సాధారణ రైతు కుంటుంబంలో పల్లెటూరిలో పుట్టి పెరగడం వల్ల చెట్లు మొక్కలు, పక్షులు, జంతువులు ఆయన కుటుంబ సభ్యులయ్యాయి. ఆయన సైకిల్‌పై గ్రామాలు, అడవులు తిరుగుతూ ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ మొక్కలు నాటాడు, నీరుపెట్టి సంరక్షించాడు. ఎప్పుడూ ఆయన చేతిలో విత్తనాలు, మొక్కలు, అవగాహన కరపత్రాలు ఉంటాయి. వీరి జీవన శైలి నిరాడంబరమైనది. వనజీవి పిలుపుకు ప్రతీక. వీరిని కూడా ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది.

వీళ్ళిద్దరూ పర్యావరణ ప్రేమికులకూ, సంరక్షకులకూ ఆదర్శ ప్రాయులు. ఇటువంటి బృహత్తర కృషి ఏ ఒక్కరి వల్లో కాదు. ఇది సమిష్టి బాధ్యత. అంటే మనందరి బాధ్యత.

మనకు ఆక్సిజన్ యిచ్చే ఒకే ఒక్క సహజ సాధనం చెట్టు.

వచ్చేది వర్షాకాలం. ప్రతి ఒక్కరూ ఒక చెట్టునైనా నాటుదాం. పిల్లల చేత పిల్లల పేరుతో ఒక్క మొక్కనైనా నాటిద్దాం. వాటి సంరక్షణ బాధ్యత సమిష్టిగా నిర్వహిద్దాం.

చెట్లను నాటుదాం! భూమిని కాపాడుదాం! మనల్ని మనం కాపాడుకుందాం!

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

# 'అద్రక్ కే పంజే' హాస్య చక్రవర్తి

# బబ్బన్ ఖాన్ కన్నుమూత

నవ్వుల రేడు.. హైదరాబాద్ ఉర్దూను ప్రపంచరంగస్థలం మీద నిలిపిన నాటకాల రాయుడు, గిన్నిస్‌బుక్ రికార్డులకెక్కిన హైదరాబాదీ చార్లీచాప్లిన్ బబ్బన్ ఖాన్ తన హాస్య నాటకాలతో నాటక ప్రియుల హృదయాలలో శాశ్వత ముద్రను వేసుకున్నారు. ఆయన ప్రదర్శించిన దక్కనీ ఉర్దూ హాస్యనాటకం 'అద్రక్ కే పంజే' నలభై ఏళ్ల పాటు 60దేశాల్లో 10,180 ప్రదర్శనలు ప్రదర్శితమై గిన్నిస్‌బుక్ రికార్డులకు సైతం ఎక్కింది.

### బాలీవుడ్ నటులకూ శిక్షణ

నగరంలోని ఆఘాపురాలో పుట్టిపెరిగిన ప్రపంచ ప్రఖ్యాత రంగస్థల నటుడు బబ్బన్ ఖాన్ టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్ నటులకు సైతం శిక్షణ ఇచ్చాడు. రేలంగి, రాజనాలకు కామెడీ టైమింగ్‌పై శిక్షణ ఇచ్చిన ఆయన హిందీలో జానీలీవర్, పరేష్ రావెల్ వంటి నటులకు అభినయంలో మెలకువలు నేర్పిన ఘనత ఖాన్ సొంతం. ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన బబ్బన్‌ఖాన్ మొదట స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్యాంకులో అటెండర్‌గా పనిచేశారు. చాలీచాలని జీతంతో రోజులు గడుపుతూ... నాటకరంగంవైపు మళ్లాడు. నాటకానికి హాస్యం జోడించి... వందుగ వర్వదినాల సమయంలో పాతనగరంలోనే ఓ అరుగు మీద ప్రదర్శిస్తూ అందరి దృష్టిలో పడ్డాడు. బబ్బన్ ప్రతిభను గుర్తించిన ఓ ఉర్దూ ప్రొఫెసర్, ఆ నాటక స్క్రిప్ట్ రచనలో మార్పులు సూచనలిచ్చారు. అక్కడి నుంచి అదొక ప్రభంజనమైంది.


Babban Khan

### రవీంద్రభారతిలో తొలి, తుది ప్రదర్శనలు...

అధిక సంతానం.. పేదరికం ఇదే 'అద్రక్ కే పంజే' నాటక ఇతివృత్తం. ఈ నాటకాన్ని రవీంద్రభారతిలో 1965, సెప్టెంబరు 22న తొలిసారిగా ప్రదర్శించగా సూపర్‌హిట్ అయింది. అక్కడి నుంచి ఆయన వెనక్కితిరిగి చూడలేదు. ముంబైలో ఈ నాటక ప్రదర్శనను దిలీప్‌కుమార్, రాజ్‌కుమార్ లాంటి సినీదిగ్గజాలు సైతం చూసి అద్భుతమంటూ ప్రశంసల జల్లు కురిపించినట్లు రంగస్థల విమర్శకులు చెబుతారు. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ సైతం 'అద్రక్ కే పంజ్' నాటకం చూసి బబ్బన్‌ఖాన్‌ను ప్రత్యేకంగా కొనియాడిన సందర్భాలున్నాయని సాహిత్య విమర్శకుడు మహమ్మద్ రఫీ చెప్పారు. మధ్యలో ఎన్నో నాటకాలు ప్రదర్శించారు. అయితే యాదృశ్చికంగా 'అద్రక్ కే పంజే" నాటకం చివరి ప్రదర్శనకు కూడా 2001, ఫిబ్రవరిలో రవీంద్రభారతి వేదికైంది. తర్వాత నాటక ప్రదర్శనకు దూర మైనా... యాక్టింగ్ అకాడమీ నెలకొల్పి... అభినయంలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చారు.

### దక్కనీ ఉర్దూ నాటకానికి ప్రపంచ స్థాయి గుర్తింపు

బబ్బన్ ఖాన్ నాటక బృందంలో పనిచేసిన వారందరికి ఆర్థిక తోడ్పాటుతో పాటు ఇళ్లు కట్టించారు. దక్కనీ ఉర్దూ నాటకరంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి బబ్బన్‌ఖాన్. తీవ్రమైన బాధలను కూడా హాస్యంలో చెప్పి ప్రేక్షకులను నవ్వించడం అతని ప్రత్యేకత. ఒకే నాటకాన్ని నలభైఏళ్లు ప్రదర్శించడం.. ప్రేక్షకులను మెప్పించడం సాధారణ విషయం కాదు.

కేవలం హాస్యాన్ని పంచడమే కాకుండా, తన నాటకం ద్వారా సామాజిక సందేశాన్ని కూడా బబ్బన్ ఖాన్ బలంగా వినిపించారు. అధిక సంతానం వల్ల మధ్యతరగతి కుటుంబాలు పడే ఆర్థిక ఇబ్బందులను తనదైన శైలిలో, వ్యంగ్యంగా ప్రస్తావించేవారు. ఆయన సంభాషణలు, హావభావాలు సామాన్యుల జీవితాలకు అద్దం పట్టాయి.

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బబ్బన్ ఖాన్ (80సం॥) ఏప్రిల్ 18, 2026న హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య షైలా ఖాన్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో దశాబ్దాల పాటు నవ్వులు పూయించిన ఒక అద్భుత నాటక శకం ముగిసినట్లయింది.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

# ఫిరోజా (టర్కాయిస్)

శ్రేష్టమైన ఫిరోజాలో బంగారు రంగులో మెరుస్తూ కనిపించే లోహపు మచ్చలు లేదా చారలు పైరైట్ అనే ఖనిజ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కోట్ల సంవత్సరాల క్రితం ఫిరోజా ఏర్పడుతున్నప్పుడు దాన్ని చుట్టుఉన్న "ఆతిథ్య శిల" యొక్క సహజ అవశేషాలు. చాలా అరుదైన సందర్భాల్లో, కొన్ని ఇరానియన్ (నిషాపురి) లేదా అరిజోనా (మొరెన్సి) రకాల టర్కాయిస్‌లో చాల్కోపైరైట్ కూడా ఉండవచ్చు.

**రత్నం విలువ:**

అమెరికా మరియు దూర ప్రాచ్య దేశాల్లో బంగారు పైరైట్ మచ్చలతో కూడిన "సాలీడు వల" మాత్రిక్స్ తో కూడిన టర్కాయిస్ అత్యంత విలువైనదిగా భావించబడుతుంది. (శజరీ ఫెరోజా) కొన్ని మధ్యప్రాచ్య సంప్రదాయాల్లో మచ్చలు లేని స్వచ్ఛమైన "పర్షియన్ టర్కాయిస్" రాయి అత్యంత విలువైనదిగా పరిగణించబడుతుంది. ఇది ఆకుపచ్చ రంగులో ఉంటే హుస్సేనీ ఫిరోజా గా వ్యవహరిస్తారు. ఈ లోహపు సమ్మేళనాల ఉనికి సహజమైన టర్కాయిస్‌ను గుర్తించటానికి ఉపయోగపడతాయి. కృత్రిమంగా తయారైన రాళ్ళలో ఈ నమూనాలను పూర్తిగా అనుకరించడం సాధ్యం కాదు.



**లాపిస్ లాజులీతో పోలిక:**

ఫిరోజా కు దగ్గరి పోలికలు ఉన్న మరో నీలిరాయి లాపిస్ లాజులీ. కానీ లాపిస్ లాజులీ దాని "నక్షత్రాలతో కూడిన రాత్రి" వంటి రూపాలకి ప్రసిద్ధి, పైగా ఇందులో బంగారు పైరైట్ మచ్చలు విరివిగా కనిపిస్తాయి.

టర్కాయిస్ (Turquoise – ఫిరోజా రాయి) సహజంగా ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పొడి (arid) ప్రాంతాలలో, రాగి (copper) నిల్వలు ఉన్న ప్రదేశాలలో లభిస్తుంది. ఇది అల్యూమినియం, రాగి మరియు భాస్వరం కలయిక వల్ల ఏర్పడే అరుదైన ఖనిజం.

**టర్కాయిస్ సహజంగా లభించే ప్రధాన ప్రాంతాలు:**

**యునైటెడ్ స్టేట్స్ (USA):** నైరుతి USA, ముఖ్యంగా ఆరిజోనా, నెవాడా, న్యూ మెక్సికో మరియు కొలరాడో రాష్ట్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద టర్కాయిస్ ఉత్పత్తి ప్రాంతాలు.

**ఇరాన్ (పర్షియా):** పురాతన కాలం నుండి ఉత్తమ నాణ్యత కలిగిన 'స్కై బ్లూ' (ఆకాశ నీలం) రంగు టర్కాయిస్‌కు ఇరాన్‌లోని నిషాపుర్ (Nishapur) జిల్లా ప్రసిద్ధి.

**చైనా:** చైనాలోని హుబే (Hubei) ప్రావిన్స్ నుండి గణనీయమైన మొత్తంలో, ముఖ్యంగా లేత నీలం నుండి నీలి–ఆకుపచ్చ రంగు టర్కాయిస్ వెలికితీస్తున్నారు.

**టిబెట్:** నాణ్యమైన టర్కాయిస్ లభిస్తుంది. ఇది టిబెట్ సంస్కృతిలో చాలా ముఖ్యమైనది.

**మెక్సికో:** వివిధ రకాల టర్కాయిస్ నిల్వలు ఉన్నాయి.

**ఇతర దేశాలు:** ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా, చిలీ, ఈజిప్ట్ (సినాయ్ ద్వీపకల్పం), కజకిస్తాన్, రష్యా (సైబీరియా), మరియు టాంజానియాలో కూడా టర్కాయిస్ దొరుకుతుంది.

భారత దేశంలో హిమాలయాల లోని కొన్ని ఎత్తైన ప్రాంతాలు మరియు కాశ్మీర్ వంటి ప్రదేశాలలో టర్కాయిస్ తక్కువ పరిమాణంలో లభిస్తాయి.

**బౌద్ధమతంలో టర్కాయిస్:**

బౌద్ధమతంలో, ముఖ్యంగా టిబెటన్ బౌద్ధమతంలో (Tibetan Buddhism), టర్కాయిస్ (Turquoise) అత్యంత పవిత్రమైనదిగా పరిగణించ బడుతుంది. ఇది కేవలం అలంకరణ వస్తువు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక శక్తికి చిహ్నం.

**ఆకాశం మరియు సముద్రం:** టర్కాయిస్ ఆకాశ నీలిరంగును మరియు సముద్రపు లోతును సూచిస్తుంది. ఇది అనంతమైన జ్ఞానాన్ని (Infinite Wisdom) మరియు స్పృహను సూచిస్తుంది.

**స్వర్గపు రాయి:** దీనిని తరచుగా "sky stone" లేదా స్వర్గపు రాయిగా పిలుస్తారు. ఇది ఆకాశ శక్తిని భూమికి తీసుకువస్తుందని నమ్ముతారు.

**రక్షణ మరియు నివారణ (Protection and Healing):**

**దుష్టశక్తుల నుండి రక్షణ:** ఇది ధరించిన వారిని ప్రతికూల శక్తులు, దుష్టశక్తులు మరియు ప్రమాదాల నుండి రక్షిస్తుందని నమ్ముతారు.

**ఆరోగ్యం:** ఇది శరీరానికి, మనస్సుకి మరియు ఆత్మకు స్వస్థత (healing) చేకూరుస్తుందని, భావోద్వేగ సమతుల్యతను ఇస్తుందని నమ్ముతారు.



**పాప నివారణ:** టర్కాయిస్ పాపాలను శోషించుకుంటుందని (absorb sin) మరియు ధరించిన వారి ఆత్మను శుద్ధి చేస్తుందని ఒక నమ్మకం.

**నిత్య జీవితంలో మరియు పూజలలో (Usage in Rituals):**

**మాలలు (Mala Beads):** టిబెటన్లు జపమాలలు (108 పూసల మాల) కోసం టర్కాయిస్ పూసలను విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది ధ్యానంలో ఏకాగ్రతను పెంచుతుంది.

**అమ్యూలెట్స్ (Amulets – యంత్రాలు/తాయెత్తులు):** టర్కాయిస్‌ను వెండిలో పొదిగి 'గావ్' (Gau - చిన్న తాయెత్తు పెట్టె) రూపంలో ధరిస్తారు. ఇది అదృష్టాన్ని ఇస్తుందని భావిస్తారు.

**విగ్రహాల అలంకరణ:** బుద్ధుడు మరియు వివిధ దేవతల విగ్రహాలను అలంకరించడానికి, ముఖ్యంగా వారి నుదిటిపై (Third Eye) టర్కాయిస్‌ను పొదుగుతారు.

**రంగు మారుట (Color Transformation):**

టిబెటన్ల నమ్మకం ప్రకారం, టర్కాయిస్ ధరించిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి రంగు మారుతుంది. యజమానికి కీడు జరిగితే రాయి రంగు మసకబారుతుందని, యజమాని ఆరోగ్యంగా ఉంటే రంగు ప్రకాశవంతంగా మారుతుందని నమ్ముతారు. అందుకే దీనిని "జీవించి ఉన్న రాయి"గా భావిస్తారు.

**రస శాస్త్రంలో ప్రస్తావనలు:**

ఖనిజాలు మరియు లోహాలను అధ్యయనం చేసే రసశాస్త్రం అనే శాఖలో, టర్కాయిస్/ ఫెరోజా రాయిని ఉపరత్నం (ద్వితీయ శ్రేణి రత్నం)గా వర్గీకరించారు.

16వ శతాబ్దంలో వచ్చిన ఆనందకందంలో ఇలా ఉంది.

"వైక్రాన్త సూర్యకాన్త చన్ద్రకాన్తో నృపో పల।
పేరోజకఖ్య స్ఫటికమ క్షుద్ర రత్న గణో హవ్యమ్॥"

**ఆయుర్వేద ప్రకాశ:** ఈ ఆధునిక గ్రంథం కూడా ఈ రాయి గురించి విశేషమైన వివరణను ఇలా అందిస్తుంది.

"పేరోజమ్ హరితాశ్మా చ భస్మాంగ హరితాం ద్విధా।"

రంగు ఆధారంగా ఫెరోజా రెండు రకాలు:

**భస్మాంగ:** ఆకాశ నీలం రంగు రకం

**హరిత:** ఆకుపచ్చ రంగు రకం

**చికిత్సా వినియోగం:** ఆయుర్వేద గ్రంథాలలో ఇది ప్రధానంగా విష నాశనం (detoxification) కోసం సూచించబడింది. శరీరంలోని వివిధ విషాలను తొలగించడానికి ఉపయోగ పడుతుందని నమ్మేవారు అని ఈ శ్లోకం ద్వారా తెలుస్తోంది.

"పేరోజకం తు తువరం మధురం దీపనం సరమ్ ।
హృద్యం విషహరం శీతం నేత్రరోగ నిషూదనమ్ ॥"

మధ్యయుగ వైద్యులు ఈ రాయి నుండి భస్మం (దహన చికిత్స ద్వారా తయారుచేసిన ఔషధ భస్మం) తయారు చేసేవారు.

**టర్కాయిస్ / ఫెరోజా**

ఆధునిక జ్యోతిష్యంలో ఇది సాధారణంగా గురు గ్రహం (బృహస్పతి)తో అనుసంధానించబడుతుంది. లేదా కొన్నిసార్లు శని గ్రహ దోష నివారణ రాయిగా ఉపయోగిస్తారు.

**తఖ్తె ఫిరోజా**

కాకతీయుల తర్వాత ఓరుగల్లును ఏలిన కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌తో శాంతి సంధి కోసం ప్రయత్నం చేశారు. ఆ సంధిలో కుదిరిన ఒప్పందం ప్రకారం గోల్కొండను రెండు రాజ్యాల సరిహద్దుగా నిర్ణయించారు. ఈ సంధికి గుర్తుగా, కాపయ నాయకుడు ఒక అద్భుతమైన సింహాసనాన్ని సుల్తాన్ మహమ్మద్ షా–I కి బహుమతిగా ఇచ్చారు.

ఆ సింహాసనం దాదాపు మూడు అడుగుల వెడల్పు, తొమ్మిది అడుగుల పొడవు మాను (ebony) కలపతో నిర్మించబడింది. అంతా స్వచ్ఛమైన బంగారు పలకలతో పొదగబడి, విలువైన రత్నాలతో అలంకరించబడింది. దాని మీద ఉన్న మినాకారీ (enamel) పని వల్ల అది నీలిమ రంగులో మెరిసేది. అందుకే "తఖ్తె ఫిరోజా" అనే పేరు వచ్చింది. నిజంగా ఫిరోజాను దీని తయారికి వాడారా లేదా అనేది ఇదమిత్థంగా తెలియదు.

పర్షియన్ చరిత్రకారుడు ఫెరిష్టా దీన్ని "ప్రపంచంలో అత్యంత వైభవోపేత సింహాసనం" అని పేర్కొన్నారు.

బహమనీ సామ్రాజ్యం పతనం కావడంతో చివరి సుల్తాన్ మహమూద్ షా బహమనీ –II తన ఖర్చుల కోసం సింహాసనంలోని రత్నాలను తొలగించి, వాటిని పాత్రలు, గిన్నెలలో పొదిగించారు. ఆ విధంగా ఒక మహోన్నత చరిత్రాత్మక సింహాసనం కనుమరుగైందని చరిత్రకారులు భావిస్తున్నారు.

**కట్ & క్యారెట్ (Cut & Carat):**

టర్కాయిస్ రాయిని దాదాపు ఎల్లప్పుడూ కాబోషోన్



(ముఖాలు లేని నునుపైన పెద్ద రాయి) లేదా పూసల (bead) రూపంలో సానపడతారు. దీన్ని ముఖాలుగా (facets) సాన బట్టటానికి సానుకూలంగా ఉండదు.

ఈ రాయిలో కనిపించే నలుపు రంగు, కొన్నిసార్లు రాగి రంగులో ఉండే చారలు (veins) దాని అందానికి ప్రత్యేక కారణం అవుతాయి. కాబోషోన్ కట్ ఈ అందమైన లక్షణాలను మరింత స్పష్టంగా చూపిస్తుంది.

వ్యాపారపరంగా చెప్పాలంటే, ఈ రాళ్ళు సాధారణంగా 4 నుండి 8 క్యారెట్ల మధ్య సైజుల్లో విక్రయించబడతాయి. పెద్ద రాళ్ళు అలంకార వస్తువులుగా (ornamental pieces) చాలా బాగా ఉపయోగపడతాయి.

టర్క్వాయిస్/ఫిరోజాకు ఆభరణాలలో అలంకరణలో మరియు ఇతర వాడకానికి టర్క్వాయిస్ పట్ల పెరుగుతున్న ఆదరణ కారణంగా, దానిని కృత్రిమంగా తయారు చేసే పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందింది.

**స్థిరీకరించిన టర్క్వాయిస్ (Stabilized Turquoise):**

ఇది చాలా సచ్ఛిద్రంగా (porous) ఉంటుంది. కాబట్టి దానిని ఎపాక్సీ రెసిన్ (epoxy resin) ఉపయోగించి గట్టిపరుస్తారు. దీనివల్ల రాయిని సులభంగా ఆభరణాలలో మలచవచ్చు. అలాగే రంగు కూడా మారదు.

**మెరుగుపరచిన టర్క్వాయిస్ (Enhanced Turquoise):**

ఈ రాయిని నీరు మరియు రాగి (copper) ద్రావణంలో విద్యుత్ ప్రవాహం (electrical current) ద్వారా గట్టిపరుస్తారు. ఈ పద్ధతిని J Zachery Treatment అని అంటారు. ఇందులో ఎటువంటి రసాయనాలు కలపటం ఉండదు. కేవలం రాయి మాత్రమే గట్టిపడుతుంది.

–చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# వెంటిలెటర్ మీద తెలుగు మాధ్యమం

దక్కన్ ల్యాండ్ ఏప్రిల్ 2026 సంచికలో పరవస్తు లోకేశ్వర్ గారు “చేతిరాత నిశ్శబ్ద ఆత్మహత్య” అనే వ్యాసం రాసారు. ఈ వ్యాసం నాలో ఎంతో బాధను, ఆవేదనను రేకెత్తించింది. దక్కన్ ల్యాండ్ ఎన్నో ఆలోచనాత్మక వ్యాసాలను ప్రచురిస్తుంది. అందుకే నేను మరియు మా నాన్న గారు దక్కన ల్యాండ్ కోసం 1 వతారీఖు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తాము. ఈ సంచికలో జిలాని బానో గురించి ఎంతో చక్కటి వ్యాసం ప్రచురితమైంది.

“2000 ఏండ్ల క్రితమే తెలంగాణాలో గజలక్ష్మి ఆరాధన”, ‘కృష్ణా తీరంలో మరుగున పడిన మహానగరం, వారణాసి, హాలెండీయుల మీద వ్యాసాలు ఎంతో చరిత్రను చక్కగా అందించాయి. నిడిగోండ గురించి రామోజు హరగోపాల్ గారి వ్యాసం మంచి తేనెపాయసం.

ఈ మధ్యనే పదవతరగతి జవాబు పత్రాలు దిద్దడానికి స్పాట్ కేంద్రానికి వెళ్ళాను. గణిత పత్రాలు దిద్దుతుంటే గమనించాను. ఉండబట్టలేక ఏసీఓ గారిని అడిగాను. ఆయన 90% ఆంగ్లపత్రాలు, 9% తెలుగు పత్రాలు 1% ఉర్దు పత్రాలని చెప్పారు. నాకు నెత్తిమీద పిడుగు పడినట్లు అయింది.

పరవస్తు లోకేశ్వర్ గారు ‘చేతిరాత నిశ్శబ్ద ఆత్మహత్య’ అని రాశారు. కాని వాస్తవాలు తరచి చూస్తే తెలుగు మాధ్యమం మొత్తం తుది శ్వాసలో ఉంది అని పరిస్థితులు అర్థం అవుతున్నాయి. రాజకీయ నాయకులు మరియు కడుపు కోసం, సెల్‌ఫోన్ల కోసం బ్రతకాలనుకునే అల్పజీవులు కలసి తెలుగు మాధ్యమాన్ని చంపేస్తున్నారు.

30% కన్నా తక్కువమంది ఒక మాధ్యమాన్ని ఎంపిక చేసుకుంటే ఆ మాధ్యమం చనిపోతుంది అని ఐక్యరాజ్య సమితి చెబుతున్నది. తెలంగాణాలో పది శాతంకి లోపలే విద్యార్థులు తెలుగును ఎంపిక చేస్తున్నారు. అంటే తెలుగు మాధ్యమం వెంటిలెటర్ మీద ఉందని స్పష్టంగా అర్థమవుతున్నది. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వాలు, సాహితీవేత్తలు, పౌరసమాజం అందరూ మేల్కోవాలి.

– కందకుర్తి ఆనంద్
m : 9951 939 737
నిజామబాద్



# అది 'అంతు'చిక్కని వింతముడి

# 'సృజన'కు తెలంగాణా తొలిబడి

అవును. అది ఒకముడి. అయితే ఆ ముడి, ఎక్కడ ముడివడిందో అంతుచిక్కని వింతముడి. 'శిలాయుగంలో'నూ, సింధునాగరికతలోనూ తన ఉనికిని చాటుకొన్న ఈ ముడి, ఆదిమ మానవుని 'సృజన'కు ఓ చక్కటి ఆనవాలు. ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూస్తే ఇప్పటికి 5000 సం॥ల నాటి మొహంజోదారోలో దొరికిన 'స్టిటైటు' ముద్రికపై, ఒక రాగి బిళ్లమీద ఈ వింతముడి రూపం కనిపించింది. ఆ తరువాత చారిత్రక తొలియుగం, అంటే సా.శ.1వ శతాబ్ది నాటికి చెంది, తక్షశిల తవ్వకాల్లో బయల్పడిన ఒక కుండమీద కూడ ప్రత్యక్షమై పురావస్తు శాస్త్రవేత్తలు అచ్చెరువొందేలా చేసింది. ఎక్కడి దాకో ఎందుకు, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా, ఓర్వకల్లు సమీపంలోని కేతవరం వద్ద గల శిలాయుగపు చిత్రకళాజాబితాలో కూడ ఈ'ముడి' అలజడి చేసింది. అయితే ఇది కూడ చారిత్రక తొలియుగం నాటిదేనని అప్పటి పురావస్తుశాఖ సంచాలకులు డా. వి.వి.కృష్ణశాస్త్రి తేల్చిపారేశారు.



మునుపటి మహబూబ్‌నగర్, ఇప్పటి జోగులాంబ-గద్వాల్ జిల్లా, అలంపూరుకు 10 కి.మీ.ల దూరంలో శ్రీశైలం జలాశయ ముంపుకు గురై, 1978 ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన చాగటూరులోని ఒక ఇనుపయుగపు సమాధిగ, ఒకగోడ రాతిపై కూడ ఈ వింత ముడి కనిపించింది. సా.శ.పూ.5వ శతాబ్దికి చెందిన ఈ ముడి గుర్తుతోపాటు, ఇంకా నిలబడి ఉండి చేతులు పైకెత్తి నమస్కరిస్తూ, ముందున్న పాదముద్రలకు మొక్కుతున్న మనిషి రేఖా చిత్రం కూడ ఉందని తవ్వకాలు చేపట్టిన ఎన్.ఆర్.వి. ప్రసాద్ తన నివేదికలో పేర్కొన్నారు.

ఈ 'అంతు'లేని 'వింత'ముడి తరువాతి కాలంలో ముగ్గుల జాబితాలో చేరినా, ఇప్పటికి 2500 సం॥ల పూర్వమే సింధు నాగరికతతో సంబంధం లేని తెలంగాణాలో బయల్పడింది. 'సృజన'కు తెలంగాణా తొలిబడి అని నిరూపించి, తెలంగాణా రేఖా చిత్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది!

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# కెన్నెల్ ఆండర్సన్ రచనలు –ఆవరణ వ్యవస్థల అవగాహన

దక్షిణభారత జిమ్‌కార్బెట్‌గా కెన్నెల్ ఆండర్సన్ ప్రసిద్ధుడు. 1910లో మార్చి 8న బొలారంలో పుట్టాడు. తరాలుగా వీరి కుటుంబం భారతదేశంలో ఉంటూ వచ్చింది. స్కాటిష్ కుటుంబానికి చెందిన వారు. తండ్రి డగ్లస్ స్టువర్ట్ ఆండర్సన్. బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో మిలిటరీ గణాంక విభాగంలో అధికారిగా పనిచేశాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో కుటుంబం బెంగళూరుకు మారింది. ఆండర్సన్ బిషప్ కాటన్ బాయ్స్ పాఠశాల, సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షలు 1926లో పాసయ్యాడు. ఎడిన్‌బర్గ్‌లో లా చదవటానికి మేనమామ సంరక్షకుడిగా పంపారు. కానీ ఆ చదువును వదిలిపెట్టి 1928లో తిరిగి ఇండియా వచ్చేశాడు. బెంగుళూరులో కన్నడం, తమిళం నేర్చుకున్నాడు. కొంత తెలుగు భాష కూడా నేర్చుకున్నాడు. పదిహేను సంవత్సరాల పాటు పోస్ట్స్ & టెలిగ్రాఫ్స్‌లో పనిచేశాడు. 1956 బ్రిటీష్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో చేరాడు. 1972లో అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకున్నాడు. ప్రొస్టేట్ క్యాన్సర్‌చికిత్సను బెంగుళూరు మార్తా ఆసుపత్రిలోనూ, కోబాల్ట్ చికిత్సను సి.ఎం.సి. వెల్లూరులో తీసుకున్నాడు. 30 ఆగస్టు 1974న మరణించాడు. ఈ మాత్రానికే అయితే కెన్నెర్ ఆండర్సన్‌ను మనం గుర్తు చేసుకోనవసరం లేదు.




నిపుణతగల వేటగాడు. 'జెంటిల్మన్ షికారి' అనే పేరు అతనికి ఉంది. మనుషులపై దాడి చేస్తున్న ఎనిమిది చిరుత పులుల్ని వేటాడిన సాహసి ఆండర్సన్. వాటిలో ఒకటి ఆడ చిరుత. అట్లాగే ఏడు పెద్ద పులులను సంహరించాడు. వాటిల్లో రెండు ఆడపులున్నాయి. 1939 నుండి 1966 మధ్యకాలంలో ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారమే ఈ లెక్కలున్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందంటారు. మనిషి మాంసానికి అలవాటు పడిన పులుల్ని, చిరుతలను మాత్రమే ఆండర్సన్ వేటాడాడు. వేట అతనికి వినోద క్రీడగానే మిగలలేదు. వేటను వినోదించే ఆటగా స్వీకరించబోయే భవిష్యత్ క్రీడాకారులకు ఆయన ఒక సూచన కూడా చేశాడు. 'మీ చేతుల్లో రైఫిల్ కంటే కెమెరా ఉండటం వల్లనే అధికంగా సంతోషం పొందుతారు' అని చెప్పాడు.

ప్రకృతి రచనలు చేసిన వారిలో ఆండర్సన్‌ని ప్రముఖంగానే పేర్కొంటారు. అట్లాగే ప్రకృతి సంరక్షకుడని కూడా చెప్పవచ్చు. జిమ్ కార్బెట్‌లాగా జాతీయ స్థాయిలో కెన్నెల్ ఆండర్సన్‌కి అధికారికమైన గుర్తింపు రాలేదన్నమాట వాస్తవమే. జిమ్‌కార్బెట్ కంటే ఎక్కువగానే చిరుతల్ని, పులుల్ని సంహరించి ప్రజలను కాపాడాడు. ప్రకృతి రచనలకు సంబంధించి ఎన్నో భిన్నమైన వ్యాసాలు రాశాడు. జంగిల్ టేల్స్ ఫర్ చిల్డ్రన్, ది బ్లాక్ పాంథర్ ఆఫ్ శివాని పల్లి, జంగిల్స్ లాంగ్ ఎగో, టేల్స్ ఆఫ్ మాన్ సింగ్ కింగ్ ఆఫ్ ఇండియన్ టెకాయిట్స్ టేల్స్ ఫ్రం ది ఇండియన్ జంగిల్ ది కాల్ ఆఫ్ ది మ్యాన్ ఈటర్, నైన్ మ్యాన్ ఈటర్స్ అండ్ వన్ రోగ్, ది టేక్ ఆఫ్ ది మ్యాన్ ఈ టక్ ఆఫ్ సెగూర్ మొదలైన విశిష్ట విభిన్నమైన రచనలు చేశాడు.

ఆండర్సన్ ప్రకృతి రచనలు అన్నీ కల్పితాలు కావు. స్వీయ అనుభవాలు. అవి సునిశిత పరిశీలనలు వన్యప్రాణుల పట్ల అత్యంత ప్రేమగల రచనలు. దశాబ్దాల కొద్దీ ఆయన దక్షిణ భారతదేశపు అటవీ సంపదను దర్శించాడు. జీవవైవిధ్యాన్ని అర్థం చేసుకున్నాడు. ఒక్కటే జంతువుల జాడలను కనిపెట్టడం, గిరిజన గూడేలు గ్రామాలలో వారితో కలిసి తిరగటం చేశాడు. మనిషి మీద దాడి చేయబోయిన మ్యాన్ ఈటర్ కోసం నిరీక్షణలో ఎంత నిశ్శబ్దం, ఉత్కంఠ ఉంటాయో ఆండర్సన్ రచనలూ అంతే. మనిషి, జంతువు ఒకే స్థలంలో సహజీవనం చేయవలసి వచ్చిన సందర్భాలు ఎలా ఉంటాయో వివరిస్తాడు. అలా ఉండటంలోని ప్రమాదం ఏమిటో వివరిస్తాడు.

ఒక సునిశిత ప్రకృతి పరిశీలకుడిగా ఆండర్సన్ కనిపిస్తాడు. కేవలం పులులు, చిరుత పులులే కాదు ఆయన తన రచనల్లో





ఏనుగులు, అడవి దున్నలు, దుప్పులు, ఎలుగుబంట్లు, హైనాలు, సాలెపురుగులు, సర్పాలు ఆ మాటకొస్తే కీటకాలు వీటన్నిటి గురించి వివరంగా నమోదుచేస్తాడు. ఒక సాలె పురుగు తన గూడు ఎలా నిర్మించుకుంటుందో వివరిస్తాడు. తోటి జంతువులతో సమాగమం కోసం ఆయా జంతువులు చేసే అరుపులు, ధ్వనులను కూడా వివరిస్తాడు.

ఆండర్సన్ మ్యాన్ ఈటర్లను మట్టుబెట్టడంలో నిపుణుడే అయినా ఆయన రచనలు ప్రకృతి పట్ల బాధ్యతను గుర్తించమని సూచిస్తాయి. ఆయన రచన ప్రకృతి పుష్కలత్వాన్ని సమృద్ధతను గుర్తుకు తెస్తాయి. ఆండర్సన్ కేవలం జంతువుల గురించి మాత్రమే రాయలేదు. తన కాలం నాటి అటవీ సమీప గ్రామాల ప్రజల జీవన విధానం, సంస్కృతి, విలువలు, ఆచార వ్యవహారాలు, మనుగడ నైపుణ్యాలు తదితరమైనవి పూసగుచ్చినట్లు తెలుస్తాయి.

ఒక ఆవరణ వ్యవస్థ మొత్తాన్ని ఆ రచనలు ఆవిష్కరించి చూపుతాయి. ఆండర్సన్ రచనల్లో హాస్యదృష్టికూడా ఎక్కువే. ఆయన గ్రంథాలు సాహసాలను గురించి చెప్తున్నట్లుగా అనిపించినా క్షేత్రస్థాయి పర్యటనకు మార్గదర్శకాలుగా కూడా కనిపిస్తాయి. వన్యప్రాణుల గురించి జ్ఞానం ఎంతగా పెంచుకుంటే అంతగా ప్రకృతిని సరైన పద్ధతిలో అర్థం చేసుకోగలమనిపిస్తుంది. అటవీ జ్ఞానాన్ని ఆండర్సన్ రచనలు అమితంగా అందిస్తాయి. 1950-70ల మధ్య దక్షిణ భారత అటవీ గాథలను, బాధలను రికార్డు చేసిన వాటిగా చెప్పవచ్చు.

నియమబద్ధుడైన వేటగాడిగా ఆయన అద్వితీయుడు. ఈనాడు వైల్డ్ లైఫ్ టూరిజం అని మనం ఏది చెప్పుకుంటున్నామో ఆనాడే దానిని ఆచరణాత్మకంగా రుజువు చేసి చూపిన వాడు. ఆండర్సన్ లాంటి వారు ఎంతో మందికి ప్రకృతి విలువను తెలియజెప్పి ప్రకృతి సంరక్షులుగా మార్చారు.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# బ్రిటిష్ ఇండియాలో రేడియో, ఆల్ ఇండియా రేడియో...

బ్రిటీష్ పాలకుల కాలంలో రేడియోకు 1936 జూన్ 8న 'ఆలిండియా రేడియో' అని నామకరణం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1958లో ఆలిండియా రేడియోకు 'ఆకాశవాణి' అనే పేరును కూడా స్వీకరించారు. ఇటీవల ఆలిండియా రేడియో అనే మాట వాడకం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రపంచంలో ఏ దేశంలో తారసపడని గొప్ప అవకాశం భారతీయ పత్రికారంగానికి కలిసి వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా ఏర్పడిన ఆసక్తితో ప్రపంచ వ్యాప్తంగా జర్నలిజం వేగం పుంజుకుంది. అంతకు ముందే అచ్చు యంత్రాలు, కాగితం తయారీ, రవాణాకు పోస్టల్ శాఖ వంటి వ్యవస్థల తోడ్పాటుతో పాటు సైకిల్ రాకతో రవాణా సౌకర్యం పత్రికల వ్యాప్తికి దోహదమైంది. అంతకు మించి భారతదేశంలో గాంధీజీ రాజకీయాల్లో ప్రవేశించిన తర్వాత పత్రికల ప్రభావం, వ్యాప్తి విపరీతంగా పెరిగింది. భారత స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడ్డ నాయకులందరూ – లోకమాన్య బాలగంగాధర తిలక్ నుంచి గాంధీజీ, అంబేద్కర్ దాకా ప్రతి ఒక్కరూ తమ కృషికి చేదోడుగా పత్రికలను వినియోగించుకున్నారు. అమృత్ బజార్ పత్రికైనా, ఆంధ్ర పత్రికైనా స్వాతంత్ర్య స్ఫూర్తిని ఆయా భాషల ప్రాంతాలలో మోసుకు వెళ్ళాయి. మరి భారత స్వాతంత్ర్య ఉద్యమంలో రేడియో ప్రసారాల పాత్ర ఏమిటి? భారతీయ పత్రికల స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని చిత్రించే రచనలు గానీ, పరిశోధనలు గానీ చాలానే అందుబాటులో ఉన్నాయి. అయితే రేడియో ప్రసారాలకు సంబంధించి అందుబాటులో ఉన్న విషయ సామగ్రి గానీ, పరిశోధనా కృషిగానీ పెద్దగా కనబడవు. ఐనా స్వాతంత్ర్యోద్యమంలో వీడని ఛాయగా భారతీయ రేడియో ప్రసారాలని గమనిస్తే ద్యోతకమవుతాయి.

1902లో మార్కొనీ రేడియోకి సంబంధించిన పేటెంట్ పొందినా ఆ మాధ్యమం అంత త్వరగా వ్యాప్తిలోకి రాలేదు. నిజానికి సినిమా, రేడియో, టెలివిజన్ కొంత వ్యత్యాసంతో దాదాపు ఒకే కాలంలో ఆవిష్కరించబడ్డాయి. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత పత్రికల గురించే కాకుండా రేడియో ప్రసారాల పట్ల ఆసక్తి మొదలైంది. ఇటలీ, సోవియట్ యూనియన్, బ్రిటన్ దేశాలతో బాటు భారత దేశంలో కూడా దాదాపు సమాంతరంగా రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. బ్రిటన్‌లో 1920లో రేడియో ప్రసారాలు ప్రారంభమై మార్కొనీ వ్యాపార చాతుర్యం వల్ల బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ప్రసారాలు ప్రారంభించింది. అయితే బ్రిటను పాలించే రాచరిక వ్యవస్థ రేడియోను పెద్దగా లెక్కించలేదు. అయితే 1926 మే నెలలో బ్రిటన్ లో జరిగిన 9 రోజుల సమ్మె రేడియో ప్రాధాన్యతను అక్కడి రాజరిక వ్యవస్థ గుర్తించేలా చేసింది. ఫలితంగా బి.బి.సి.గా పిలువబడే 'బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్' 1927 జనవరి 1వ తేదీ నుంచి మొదలైంది. అంతవరకు భారతదేశంలో కూడా బ్రిటీష్





రాజప్రతినిధులైన పాలకులు కూడా రేడియోను పెద్దగా పట్టించుకోలేదు.

1921 ఆగస్టులో టైమ్స్ ఆఫ్ ఇండియా బొంబాయి రేడియో క్లబ్ మొదలైంది. 1923 జూన్ నుంచి ప్రసారాలను ప్రారంభించింది. అదే సం. నవంబర్‌లో కలకత్తా రేడియో క్లబ్, 1926 మే 16న మదరాసు ప్రెసిడెన్సీ రేడియో క్లబ్ ప్రసారాలు మొదలయ్యాయి. 1927 తరువాత రేడియో ప్రసారాలు ఒక పద్ధతిగా సాగేందుకు చర్యలు మొదలయ్యాయి. కానీ అప్పటికే ట్రాన్స్ మీటర్ పరికరాల దిగుమతి, వైర్ లెస్ సెట్ల దిగుమతి, రేడియో లైసెన్సుల వంటి వ్యవస్థలను భారతదేశంలో ఏర్పరిచారు. కానీ బ్రిటన్ లో జరిగిన సమ్మె కారణంగా ఆసక్తి పెరిగి ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఏర్పరచిన బొంబాయి కేంద్రాన్ని అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్వింగ్ ప్రారంభించారు. కనుకనే జూలై 23వ తేదీని 'భారతీయ ప్రసార దినోత్సవం' (ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ డే)గా జరుపుకుంటున్నాం.



రేడియో ప్రసారాలు ప్రారంభం కావడానికి ముందు నుంచే భారత రాజకీయ వాతావరణంలో గాంధీజీ ప్రభావం పెరగడం మొదలైంది. ఆయన చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు దేశవ్యాప్తంగా విజయవంతమై బ్రిటీష్ పాలకులకు గుబులు పుట్టించాయి. వ్యవస్థీకృతమైన ప్రసారాలు మొదలైన 1927లోనే సైమన్ కమీషన్ ను ఏర్పరచడం, అందులో భారతీయ సభ్యులెవరూ లేకపోవడంతో భారతదేశమంతా అట్టుడికి పోయింది. 1927 నుంచి భారతీయ ప్రసారాల తీరును చూస్తే మూడు పాయలుగా కనబడుతాయి. బ్రిటీష్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే రేడియో ప్రసారాలు; బ్రిటీషు అధికారుల కనుసన్నలలో మెలిగే సంస్థానాధీసుల రేడియో కేంద్రాలు... నిజానికి ఈ రేడియో కేంద్రాలన్నీ బ్రిటీష్ పాలకులకు అనుకూలంగానే పనిచేశాయి. ఇవి ప్రజల అభీష్టాల ప్రతిఫలనానికి మాత్రం కానే కాదు. సరిగ్గా ఈ కోణంలో పనిచేసినవి ఆజాద్ హింద్ రేడియో, ఆజాద్ రేడియో, భాగ్యనగర్ రేడియో, ది వాయిస్ ఆఫ్ ఫ్రీడం వంటి రేడియో ఛానళ్ళు. ప్రజలకు అనుకూలంగా బ్రిటీష్ పాలకుల కన్నుగప్పి ప్రసారాలు నిర్వహించి చివరకు అధికార జ్వాలలకు కనుమరుగయ్యాయి మూడో కోవకు చెందిన రేడియో కేంద్రాలు.



రేడియో ప్రసారాల అజమాయిషీ చేయడానికి బి.బి.సి.లో పనిచేసిన లెనల్ ఫీల్డన్ (Lionel Fielden)1935 ఆగస్టు 30న నియమితులయ్యారు. అప్పటికీ బొంబాయి, కలకత్తా, మద్రాసులలో మాత్రమే రేడియో ప్రసారాలుండేవి. 1936 జనవరి 1న ఢిల్లీ నుంచి రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. మరుసటి సంవత్సరం పెషావర్, లాహటరీర్లలో; అటు తర్వాత 1938లో లక్నో: 1939లో ఢాకా, తిరుచురాపల్లిలో రేడియో కేంద్రాలు మొదలయ్యాయి. అంటే 1939లో బ్రిటీష్ ప్రభుత్వ నిర్వహణలో మొత్తం 9 రేడియో కేంద్రాలు ఉన్నాయి. అదే సంఖ్య మనకు స్వాతంత్ర్యం వచ్చేదాకా కొనసాగింది. రేడియో అవసరాన్ని గుర్తించిన బ్రిటీష్ పాలకులు 1939 అక్టోబర్ 1 నుంచి గుజరాతీ, మరాఠీ, ప్రుష్తో, తమిళం, తెలుగు భాషలలో వార్తా ప్రసారాన్ని ఢిల్లీ కేంద్రంగా మొదలుపెట్టారు. అప్పటికి ఇంగ్లీషు, హిందుస్థానీ, బెంగాలీ భాషలలో మాత్రమే రేడియో ప్రసారాలుండేవి.

ఇక సంస్థానాల రేడియో గురించి చెప్పాలంటే కేవలం హైదరాబాదు, మైసూరు, బరోడా, తిరువాన్కూరు సంస్థానాలలో మాత్రమే రేడియో ప్రసారాలుండేవి. ఈ సంస్థానాల రేడియో ప్రసారాలకు సంబంధించి హైదరాబాదు కొంచెం విభిన్నంగా కనబడుతోంది. నిజాం స్వాధీనం చేసుకున్న 'డెక్కన్ రేడియో' 1935 ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 411 మీటర్లపై పనిచేయడం మొదలు పెట్టింది. మరే సంస్థానానికి లేని రీతిన నిజాం రేడియోకు రెండవ ట్రాన్స్ మీటరు ఔరంగాబాదు నుంచి అదే సంవత్సరంలో కొంత కాలానికి మొదలైంది. తర్వాత మైసూరులో సైకాలజీ ప్రొఫెసర్ డా. ఎమ్.వి. గోపాలస్వామి 30 వాట్ల ట్రాన్స్ మీటర్‌తో రేడియో కేంద్రాన్ని ప్రారంభించారు. అది 1935 సెప్టెంబర్ 10 నుంచీ 1942 దాకా వీరి నిర్వహణలోనే నడిచి పిమ్మట మైసూరు సంస్థానం చెప్పు చేతల్లోకి వెళ్లింది. మైసూరు సంస్థానం రేడియో కేంద్రాన్ని 'ఆకాశవాణి' అని వ్యవహరించేవారు. సాహితీ విమర్శకులు, సంగీతజ్ఞులు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ అని ప్రచారంలో వుంది. కానీ ఆ పేరును సూచించింది అనంత కృష్ణ శర్మ అన్న రాళ్ళపల్లి గోపాలకృష్ణాచార్యులు. వీరే 'వదరుబోతు' రచన ముగ్గురు కర్తలలో ఒకరు కూడాను!

హైదరాబాదు, ఔరంగాబాదు, మైసూరులలో రేడియో ప్రసారాలు ప్రారంభమైన పిదప 1943 మార్చి 12న తిరువాన్కూరు సంస్థానంలో (తిరువనంతపురంలో) రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. బరోడా బ్రాడ్ కాస్టింగ్ స్టేషన్ పేరున రేడియో కేంద్రానికి 1939 మే 1వ తేదీన బరోడా సంస్థానంలో పునాదిరాయి వేశారు. ఈ ప్రసారాలు ఎప్పుడు మొదలయ్యాయో సమాచారం పూర్తిగా అందుబాటులో లేదు గానీ, బి.బి.సి.లో పనిచేసిన నారాయణ మీనన్ 1947లో ఈ రేడియో స్టేషనులో పనిచేశారు.

వీరే తరువాతి కాలంలో ఆలిండియా రేడియో డైరెక్టర్ జనరల్ గా కూడా 1965-68 మధ్య కాలంలో పనిచేశారు. హైదరాబాదు, ఔరంగాబాదు, మైసూరు, తిరువాన్కూరు, బరోడా రేడియో కేంద్రాల ప్రసారాలు బ్రిటీష్ పాలకులకు అనువుగానే సాగాయి. ఈ నాలుగింటిలో బరోడా రేడియో కేంద్రాన్ని స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం 1948 డిసెంబరు 16న తన అజమాయిషీలోకి తీసుకున్నది. హైదరాబాదు, ఔరంగాబాదు, మైసూరు, తిరువాన్కూరు కేంద్రాలన్నీ 1950 ఏప్రిల్ 1వ తేదీన భారతదేశ ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చి 'ఆలిండియా రేడియో' కేంద్రాలుగా కొనసాగాయి. వీటితోబాటు ఔరంగాబాదు కొంతకాలం అలిండియా రేడియోగా పనిచేసి 1953లో మూతపడింది.



ఇంతవరకూ చర్చించిన రేడియో ప్రసారాలు స్వాతంత్ర్యోద్యమానికి గానీ, ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు గానీ తోడ్పడిన సందర్భాలు దాదాపు లేవు. 1932లో బొంబాయి స్టేషన్ డైరెక్టర్ ప్రకారం ఏదో ఒక రేడియో కేంద్రం స్వాతంత్ర్యోద్యమానికి అనుకూలంగా పనిచేస్తున్నట్టు వినబడిన ప్రసారాల వల్ల తెలుస్తోందని ఇంటెలిజెన్స్ నివేదికలో పేర్కొన్నారని పార్థసారధి గుప్త తన 'రేడియో అండ్ ది రాజ్ 1921-47' (1995) పుస్తకంలో పేర్కొన్నారు. 1942లో జర్మనీ నుంచి పిమ్మట సింగపూరు నుంచి నేతాజీ సుభాస్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ రేడియో'ను తన అనుయాయులతో నిర్వహింపజేశారు. ఈ రేడియో ప్రసారాలు ఇంగ్లీషు, హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, ప్రుష్టో, ఉర్దూ భాషలలో సాగేవి. బ్రిటీషు వారికి వ్యతిరేకంగానేతాజీ భారతదేశం బయట నుంచి ఈ ప్రసారాలు నిర్వహించారు.

క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో కేవలం 78 రోజులు నడిచి, గొప్పగా పనిచేసినది 'ఆజాద్ రేడియో'. కొందరు యువకుల సహాయంతో రామమనోహర్ లోహియా ఈ ఆజాద్ రేడియోను గొప్పగా నిర్వహించారు. ఈ విషయాలు 2018లో పబ్లికేషన్ డివిజన్ వెలువరించిన 'అన్ టోల్డ్ స్టోరీ ఆఫ్ బ్రాడ్ కాస్ట్ దూరింగ్ క్విట్ ఇండియా మూవ్ మెంట్' అనే పుస్తకంలో ఆసక్తి ఉన్నవాళ్ళు చదువుకోవచ్చు. ఆజాద్ రేడియో ప్రసారాలకు తీసిపోనట్టుగా నైజాం పాలనకు వ్యతిరేకంగా 'భాగ్యనగర్ రేడియో' మన ప్రాంతంలో పనిచేసింది. నిజాం వ్యతిరేకంగా నడుస్తోంది కనుక తెలంగాణా సరిహద్దు ఆవల కర్నూలు నుంచీ ఈ 'భాగ్యనగర్ రేడియో' పనిచేసింది. 1948 జనవరి 30వ తేదీ గాంధీజీ హత్య అయిన వార్తను ప్రసారం చేసి 'భాగ్యనగర్ రేడియో' చరిత్ర పుటల్లో కలిసిపోయింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా పశ్చిమతీరంలో ఉన్న గోవా ప్రాంతం పోర్చుగీసు కాలనీగానే కొనసాగింది. బొంబాయిలో స్థిరపడిన గోవా వాస్తవ్యులు లిబియా లోబో తన సోదరితో కలిసి వామన సర్దేశాయి తోడ్పాటుతో 1955లో 'ది వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' పేరున రేడియో ప్రసారాలు ప్రారంభించారు. గోవా పాలనకు వ్యతిరేకంగా గోవా సరిహద్దు భారతీయ భూభాగంలో ప్రయాణం చేస్తూ జీపు నుండీ ఈ ప్రసారాలు చేశారు. 1961 డిసెంబర్ 19న గోవా భారత భూభాగంలో కలిసినపుడు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం నుంచీ ఈ శుభవార్తను ప్రసారం చేస్తూ గోవా అంతటా పూలు చల్లుతూ ఈ ప్రసారాలు ముగించారు. పత్రికలు అయితే ఆధారాలు సులువుగా లభ్యమవుతాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రహస్యంగా జరిగిన రేడియో ప్రసారాలకు సంబంధించిన దాఖలాలు పెద్దగా లభ్యమయ్యే అవకాశం లేదు. వీటికి సంబంధించి ఇంకా ఎంతో పరిశోధన జరగాలి.

- డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

ద

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

ఎడమ నుండి కుడికి:
*శ్రీ రవీంద్ర సింగ్ – ఐఏఎస్ (రిటైర్డ్),*
*జాతీయ మెంబర్ సెక్రటరీ ఇంటాక్*
*శ్రీ అశోక్ సింగ్ ఠాకూర్*
*– జాతీయ ఛైర్మన్ ఇంటాక్*
*శ్రీమతి మాల్విక పథానియ*
*– జాతీయ వైస్ ఛైర్మన్ ఇంటాక్*
*Er. వేదకుమార్ మణికొండ*
*– జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు ఇంటాక్*



# దక్షిణ భారతానికి గర్వకారణం

## INTACH జాతీయ కార్యవర్గానికి ఎన్నికైన Er. వేదకుమార్ మణికొండ

ఏప్రిల్ 17, 2026న న్యూ ఢిల్లీలోని INTACH ప్రధాన కార్యాలయంలో, ఇటీవల (2026–2029) మూడు సంవత్సరాల కాలానికి INTACH గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎన్నికైన Er.వేదకుమార్ మణికొండ గారు, ఇటీవల INTACH జాతీయ కార్యవర్గానికి కూడా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని INTACH ఛైర్మన్ శ్రీ అశోక్ సింగ్ ఠాకూర్ గారు, 34వ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో జాతీయ మెంబర్ సెక్రటరీ శ్రీ రవీంద్రసింగ్ సమక్షంలో ప్రకటించారు. ఈ గౌరవం ఆయన నాయకత్వం, అనుభవం, మరియు వారసత్వ పరిరక్షణపై ఉన్న అంకితభావానికి గుర్తింపుగా నిలిచింది. INTACH జాతీయ కార్యవర్గానికి దక్షిణ భారతదేశం నుండి ఎన్నికైన ఏకైక వ్యక్తిగా వేదకుమార్ గారు నిలిచారు. ఆయన సాధించిన ఈ ఉన్నత స్థానం దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, పర్యావరణ, విద్యా రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రానికే కాకుండా మొత్తం దక్షిణ భారతదేశానికి ఇది గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చింది.

Er.వేదకుమార్ మణికొండ గారు, ఛైర్మన్ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT), డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ (DoHT)తో కలిసి MoAను కుదుర్చుకొని 'ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్' స్థల పరిరక్షణతో పాటు UNESCO Tentative List-2025 గుర్తింపు సాధించడంలో ఎనలేని కృషి చేశారు. ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్ స్థల రక్షణ, శాస్త్రీయ పరిశోధన, సమగ్ర డాక్యుమెంటేషన్ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. వేదకుమార్ సారథ్యంలో ASI, GSI, OU, నారాయణపేట జిల్లా పరిపాలన యంత్రాంగం మరియు స్థానిక ప్రజా సంఘాల సహకారంతో 'ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్ సైట్స్'ను UNESCO Tentative List-2025లో స్థానం పొందడం ఆయన కృషికి నిదర్శనం. ఆయన చేసిన దీర్ఘకాలిక సేవలతో జాతీయ కార్యవర్గంలో భాగమవడం INTACH కార్యక్రమాలను మరింత బలపరచడంలో మరియు దేశవ్యాప్తంగా విస్తరించడంలో సహాయపడుతుంది.

**– కట్టా ప్రభాకర్,** m : 8106721111
e: akumarkatta@gmail.com



*ఇంటాక్ క్రాఫ్ట్ డివిజన్ 'పునియా' చీరను శ్రీమతి మాల్విక పథానియాకు బహూకరిస్తున్న శ్రీ అశోక్ సింగ్ ఠాకూర్, ఛైర్మన్ INTACH న్యూఢిల్లీ మరియు Er. వేదకుమార్ మణికొండ, జాతీయ కార్యనిర్వాహక సభ్యులు INTACH న్యూఢిల్లీ*



*34వ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్స్, INTACH న్యూఢిల్లీ*



# ఉలవపాడు మామిడి రుచి రహస్యం

అది ఎప్పుడూ ఒక అపరిష్కృత రహస్యమే... గడ్డిలో ఎంతో సున్నితంగా పేర్చిన పండ్ల గంప మా ఇంటి గుమ్మం దగ్గరకు వచ్చేది. సెలవులు ముగిసి, వర్షాలు మొదలయ్యేలోపు వచ్చే అనేక గంపల్లో అది మొదటిది. అవి ఉలవపాడు అనే ఊరి నుండి వచ్చేవి. ఆ పేరు వినగానే, నా మెదడులోని ఏదో ఒక మూల భద్రంగా దాగి ఉన్న ఆ తీపి జ్ఞాపకం నా నాలుకపై మెదులుతుంది. ఒక పక్క ఆత్రుత, మరోపక్క ఆరాటం కలగలిసిన భావం నా ఒళ్ళంతా పాకి, నన్ను ఒక రకమైన తపనకు గురి చేస్తుంది. ఎండలు నలభై డిగ్రీలు దాటి, వడగాల్పులు దహించేస్తున్న వేళ... మామిడి పండ్ల సీజన్ ఎప్పుడు మొదలవుతుందా అని నా మనసు ఎంతో ఆవేదనతో ఎదురుచూస్తుంది.

ప్రతి ఏడూ వేసవి తాపం పెరిగే కొద్దీ మామిడి పండ్ల కోసం ఆరాటం కూడా పెరుగుతూనే ఉంటుంది. సీజన్ ఆరంభంలో దొరికే రకాలు ఆ రుచిపై ఆశను పెంచుతాయే తప్ప, అసలైన పండ్ల రాజు 'బనగానపల్లె' కోసం ఎదురుచూపులను తగ్గించవు. ఒంగోలుకు దక్షిణాన నలభై కిలోమీటర్ల దూరంలో, మద్రాస్-కలకత్తా రైల్వే లైన్, గ్రాండ్ ట్రంక్ రోడ్డు (ఎన్ హెచ్-16)మధ్య ఒదిగిపోయి ఉన్న ఉలవపాడు తోటల్లో ఈ పండ్లు ఎంతో అపురూపంగా పెరుగుతాయి. ప్రతి సంవత్సరం ఆ తోటలను సందర్శించడానికి, హైవేకి ఇరువైపులా రెండు మైళ్ల పొడవునా వరుసగా పేర్చిన దుకాణాలను చూడటానికి వెళ్లే ఆ 'వార్షిక యాత్ర' సమయం రానే వస్తుంది.

చెట్టు మీదనే పండిన పండును కోసి, నైపుణ్యంతో ముక్కలు చేసి తింటే కలిగే ఆ మొదటి రుచి స్వర్గాన్ని తలపిస్తుంది. 'అసలు ఈ పండుకు ఇంతటి తియ్యదనం, ఇంత ప్రత్యేకమైన రుచి ఎక్కడి నుండి వచ్చాయి?' అన్న సందేహం నాలో మొదలవుతుంది. నా స్నేహితుడు, ఒక సముద్ర పురావస్తు శాస్త్రవేత్త ఒక చిన్న క్లూ ఇచ్చే వరకు ఈ రహస్యం అపరిష్కృతంగానే ఉండిపోయింది. మామిడి పండు రుచికి, సముద్ర పురావస్తు శాస్త్రానికి సంబంధం ఏంటని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఏదైనా విషయం గురించి తెలుసుకోవాలంటే ఆ ప్రాంత చరిత్రలో వెతకడం నాకు అలవాటు, అందుకే అతని మాటలను నేను చాలా సీరియస్‌గా తీసుకున్నాను.

సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం, టోలెమీ అనే ఈజిప్షియన్ యువరాజు 'జాగ్రఫీ' అనే పుస్తకాన్ని రాశారు. అందులో ఆయన 'మనార్బా' అనే హిందూ మహాసముద్ర ఓడరేవు గురించి ప్రస్తావించారు. ఉలవపాడు గ్రామం చుట్టూ మెలికలు తిరుగుతూ, తూర్పున రెండు మైళ్ల దూరంలో బంగాళాఖాతంలో కలిసే 'మన్నేరు' వాగు ముఖద్వారం వద్దే ఆ ఓడరేవు ఉండేదని చరిత్రకారులు నమ్ముతారు. ఉలవపాడు పరిసరాల్లో అప్పుడప్పుడు దొరికే చైనాకు చెందిన 'రౌలెటెడ్' మృణ్మయ పాత్రల ముక్కలు, రోమన్ కాలం నాటి 'యాంఫోరే' (కుండలు) ఈ ప్రాంతం చైనా, రోమ్ దేశాల మధ్య వాణిజ్య కేంద్రంగా ఉండేదనే వాదనకు బలాన్ని ఇస్తున్నాయి. పడమరన మన్నేటికోట నుండి తూర్పున కరేడు చెరువు వరకు, ఉలవపాడు చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో ఇప్పుడు విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి; కానీ ఒకప్పుడు అది సముద్ర ప్రయాణం చేసే ఓడలకు సురక్షితమైన ఆశ్రయాన్ని ఇచ్చే ఒక 'లాగూన్' (ఉప్పునీటి సరస్సు).

ఈ తీరప్రాంత లాగూన్ ఒక లేటరైట్ (ఎర్రమట్టి) తొట్టిలా ఉండేది. మన్నేరు వాగుకు ప్రతి సంవత్సరం వచ్చే వరదలు సారవంతమైన ఒండ్రు మట్టిని ఇక్కడ నిక్షేపించేవి, అది అడుగు భాగంలో పోషకాలు దట్టంగా ఉండే ఒక లోమీ పొరలా ఏర్పడింది. సా.శ. 780-920 మధ్య కాలంలో, దక్షిణ బంగాళాఖాతం తీరాలను ఒక భారీ సునామీ ముంచెత్తిందని పురాతన పర్యావరణ శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఆ ఉప్పెన కారణంగా ఈ లాగూన్ పైన దట్టమైన ఇసుక పొర పేరుకుపోయింది, కొన్ని చోట్ల ఇది ఇరవై మీటర్ల లోతు వరకు ఉంది. ఆ ఇసుక బరువుకు, లేటరైట్ రాళ్లతో చుట్టబడి ఉన్న ఆ ఒండ్రు మట్టి పొర కుంచించుకుపోయి, సహజ ఎరువుగా మారిపోయింది. ఆ నేల పోషకాల నిధి శతాబ్దాల తరబడి ఇసుక అడుగున ఎవరికీ అందకుండా భద్రంగా ఉండిపోయింది. ఉపరితలంపై కేవలం ఎడారి ముళ్ళ పొదలు

తప్ప మరే ఇతర మొక్కలు పెరగలేని విధంగా ఆ ప్రాంతం నిస్సారంగా ఉండేది. కానీ, మామిడి చెట్టు పొడవైన తల్లివేరుకు, దాని దట్టమైన ఆకులు కలిగించే శోషణ శక్తి కారణంగా అంత లోతు నుండి కూడా పోషకాలను గ్రహించడం అసాధ్యం కాలేదు. అయితే, కర్నూలు జిల్లాలోని బనగానపల్లె నుండి వంద మైళ్లకు పైగా ప్రయాణించి ఈ మామిడి పండు ఉలవపాడుకు ఎప్పుడు చేరుకుంది?

స్థానిక రైతు, కెమిస్ట్రీ లెక్చరర్ అయిన పోటు నాగేశ్వరరావు, ఆ ప్రాంతంలోని మొట్టమొదటి మామిడి తోటల గురించి తన పెద్దలు చెప్పిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 19వ శతాబ్దం ఆరంభంలో, కరువు కారణంగా వలస వచ్చిన ఒక రైతు కుటుంబం పశ్చిమాన కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నేటికోట అనే గ్రామానికి చేరుకుంది. అక్కడ ఇసుకలో సగం కూరుకుపోయిన ఒక పురాతన శివాలయం ఉండేది. 'వారు ఇక్కడే ఈ చెట్టును పరిచయం చేశారు' అని ఆయన చెప్పారు. 'ఆ కాల్వ పశ్చిమ తీరంలో ఉన్న బింగనపల్లి అనే చిన్న గ్రామం, వారి అసలు స్వస్థలం (బనగానపల్లె) జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకుంది. ఆ శతాబ్దం ఎనభై కాలంలో (1880లలో) రైల్వే మార్గం ప్రారంభమైన తర్వాత, ఈ తోటలు కొత్తగా నిర్మించిన ఉలవపాడు రైల్వే స్టేషన్‌కు దగ్గరగా విస్తరించాయి.'

అక్కడ వాటి కొత్త నివాసంలో ఆ చెట్లు ఏపుగా పెరిగాయి. నేలలోని పుష్కలమైన పోషకాలు, భూగర్భ జలమట్టం, పండ్ల దిగుబడిని, పరిమాణాన్ని పెంచడానికి దోహదపడ్డాయి. అయితే, అవి అంతటి తియ్యదనాన్ని ఎలా సంతరించుకున్నాయి?

దానికి రావు గారి వద్ద ఒక సమాధానం ఉంది. సాయంత్రం వేళల్లో వీచే చల్లని తీర ప్రాంత గాలులు, సుదీర్ఘమైన పొడి వేసవి కాలం వల్ల ఈ మామిడి పండ్లు ఆలస్యంగా పక్వానికి వస్తాయని, తద్వారా వాటిలో పిండి పదార్థం అధికంగా చేరుతుందని ఆయన వివరిస్తారు. నేలలోని లేటరైట్ రాళ్లలో ఉండే అల్యూమినియం



సమ్మేళనాలు, పిండి పదార్థాన్ని సాధారణ చక్కెరలుగా మార్చడానికి అవసరమైన 'ఇథిలీన్' ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. చివరగా, వేసవి ముగింపులో వీచే వేడి వడగాల్పులు పండులోని అదనపు తేమను ఆవిరి చేసి, దానిని తినడానికి అత్యంత రుచికరంగా మారుస్తాయి.

కాబట్టి, ఒక పురాతన లాగూన్, ఒక భయంకరమైన సునామీ, ఒక కరువు, రైల్వే మార్గం, ప్రతికూల వాతావరణం... ఇవన్నీ కొందరు ధైర్యవంతులైన రైతు తరాలతో చేతులు కలిపి ఈ అద్భుతమైన మామిడి పండ్లను మనకు అందించాయి. అందుకే అవి అంత ప్రత్యేకంగా ఉండటంలో ఆశ్చర్యమే లేదు.

అమరావతి నుండి కేవలం మూడు గంటల ప్రయాణమే కాబట్టి, ఈ సీజన్‌కు సరిపడా పండ్లను నిల్వ చేసుకోవడానికి ఇది మంచి అవకాశం. ఆ ప్రయాణం ఖచ్చితంగా విలువైనదే, అవును కదా?

– సాయి పాపినేని
m : +91 98450 34442
Convenor-INTACH, Vijayawada (AP) - Chapter





# మసులీపటాం ఓడరేవు నుండి పర్షియన్ గల్ఫ్ ఓడరేవులతో వ్యాపారం: 1590-1670

భారతదేశ తూర్పు తీరప్రాంతపు చేనేత / అద్దకం / కలంకారీ బట్టలకు అనాది కాలం నుండి పర్షియాదేశంలో మంచి గిరాకీ ఉండేది. ముఖ్యంగా 1630 ప్రాంతంలో మచిలీపట్నం మరియు చుట్టుప్రక్కల గ్రామాలలో తయారైన బట్టలు భూమార్గాన మచిలీపట్నం నుండి పెరికె బండ్లమీద, ఎడ్లమీద చేర్చబడి సూరత్, దాబూల్ ఓడరేవుల ద్వారా ఎర్రసముద్రపు పర్షియన్ రేవులకు జలమార్గాన చేర్చబడేవి. భూమార్గాన కాక, మచిలీపట్నం రేవు గుండా, సిలోన్‌ను చుట్టి గోవా / సూరత్‌ల గుండా ఓడలమీద సరుకులు పర్షియన్ రేవులు జిద్దా, మక్కా, బందర్ అబ్బాస్‌లకు చేర్చబడేవి. ఈ రెండు మార్గాలు ఖర్చుతోకూడి తమలాభాల్లో కోతపడేసరికి, మచిలీపట్నం కేంద్రంగా వ్యాపారం చేస్తున్న పర్షియన్ ముసల్మాన్ వర్తకులు 1620 నుండి మాప్రుక్‌యు, పెగూ, అఖీహ్, మరియు మేరిగాయ్ - టెనస్సేరిం రేవులతో కొత్తమార్గాన తమ వ్యాపారం విస్తరించారు. **మచిలీపట్నంలో నివాసముంటున్న పర్షియన్ వ్యాపారులు మీర్‌ఖాసిం, మీర్ మొహమ్మద్ మురాద్, మీర్ కమాలుద్దీన్ హాజీ జమాల్, ముల్లా మొహమ్మద్ తఖీ తక్రిషీల వ్యాపారం వలన మచిలీపట్నం 17వ శతాబ్దంలో ఒక వెలుగు వెలిగింది. బందరు పట్టణానికి వ్యాపారం నిమిత్తం డచ్ వారు ప్రవేశించక ముందుకాలంనుండే మీర్ కమాలుద్దీన్ అనే పర్షియన్ ముస్లిం వ్యాపారి పర్షియా దేశపు ఓడరేవులతో బందరు రేవు ద్వారా వ్యాపారం చేస్తుండేవాడు.** ఇతను వ్యాపారి మాత్రమే కాదు, గోల్కొండ దర్బారు రాజకీయాలను ప్రభావితం చేయగలిగి అనేక వ్యాపార ఓడలు కలిగిన యజమాని - మసులీపటాం పట్టణ ప్రముఖ వ్యక్తి - పర్షియన్ వ్యాపారి.

1630 ప్రాంతంలో మసులీపటాం - బందరు అబ్బాస్ జలరవాణా సరాసరి మార్గం ఆవిష్కరించబడింది. 1631 నుండి 1637 వరకు మచిలీపట్నం మరియు చుట్టుప్రక్కల ఉన్న దేశంలో ఒకసారి వర్షాభావ పరిస్థితులు, మరోసారి తుఫాన్‌వల్ల పంటల నష్టం, కరువు కాటకాలవల్ల / చీడపీడలవల్ల పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోవటం, అధిక వర్షాల వల్ల భూమార్గ రవాణా సాగకపోవటం, తిండిగింజల ధరలు 75 శాతం నుండి 150 శాతం పెరగటం వలన దొంగతనాలు - దారి దోపిడీలు సాగాయి. ఈ పరిస్థితులలో మసులీపటాం ఓడరేవు కేంద్రంగా జలరవాణా కొత్తమార్గం బందరు పర్షియన్ వ్యాపారులకు బాగా కలిసివచ్చింది. **బందరు రేవు నుండి 1630లో మీర్ కమాలుద్దీన్ మొదటి ఓడ సరుకులతో బందర్ అబ్బాస్ రేవుకు చేరింది. డచ్ వ్యాపారులు ప్రథమం నుంచీ బందరు పర్షియన్ వర్తకులతో శతృత్వం వహించారు. సూరత్ కేంద్రంగా వ్యాపారం నిర్వహిస్తున్న ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారులు బందరు ఓడరేవు నుండి 1632 జులైలో 300 బేళ్ళ చేనేత వస్త్రాలు, మరియు ఇతర సరుకులు తమ మేరీ, ఎక్ఛేంజ్ నావలద్వారా పర్షియాకు ఎగుమతి చేశారు.** ఇదే సంవత్సరం ఇంగ్లీష్ వ్యాపారులకు పోటీగా, ధీటుగా రెండు వ్యాపార ఓడలు బందరు రేవునుండి పర్షియాకు పంపగా, ఒక ఓడ మాత్రమే తిరిగి సరుకుతో బందరు రేవుకు చేరింది. మరొకటి హుర్ముజ్ రేవు సమీపాన ఓడమీద బిగించిన ఫిరంగి పేలిపోయి, ఓడలో నిల్వ ఉన్న ఫిరంగి మందు అంటుకొని 600 మంది మూరు దేశస్థులు, బానిసలతోసహా సరుకుతో నిండియున్న బందరుఓడ నడి సముద్రంలో మునిగింది. మునిగిపోయిన ఓడ 300 టన్నుల కార్గోను మోయగలదు. **మునిగిన ఓడతోపాటు బందర్ అబ్బాస్‌కు ప్రయాణించిన మరో మచిలీపట్నం ఓడలో**

**మీర్ కమాలుద్దీన్ 400 బేళ్ళ చేనేత / అద్దకం / కలంకారీ బట్టలు, 600 బేళ్ళ బెంగాల్ పంచదార, వంద బేళ్ళ చింతపండు, వేయి బేళ్ళ గమ్‌లాక్, 120 బేళ్ళ పొగాకు - ఓడ పరిమాణానికి తగ్గ సరుకు కాకపోయినా, పంపాడు. కమాలుద్దీన్ బందరులోని డేన్స్ వ్యాపారులను కలుపుకొని 'మకస్సార్'కు వ్యాపార ఓడొకటి పంపాడు.** కమాలుద్దీన్ తన జీవిత చరమాంకంలో దారిలో ఒక సూఫీ బాబా దర్గాని దర్శించి, పర్షియాకు వెళ్ళిపోవాలని 1632లో బయలుదేరగా, కమాలుద్దీన్ ప్రయాణించిన ఓడ దాబూల్ రేవులో ప్రమాదవశాత్తు మునగగా, సూరత్ ఇంగ్లీష్ కంపెనీ కిరాయి ఓడమీద కమాలుద్దీన్ బయలుదేరి, సూరత్ కష్టమ్స్ అధికారుల ఒత్తిడితో పన్నులు చెల్లించే నిమిత్తం సూరత్‌లో అద్దె ఇంట్లో దిగాడు. అక్కడ మెట్లమీద జారిపడి, బాగా గాయపడిన కమాలుద్దీన్ జాడ 1636 నవంబరు తరువాత తెలిసి రాలేదు. పర్షియాకు చాటుగా వెళ్ళిపోయుంటాడని, లేక సూరత్‌లోనే చనిపోయి ఉంటాడని అందరూ భావించారు. **1636 సెప్టెంబరు నాటి డచ్ ఫ్యాక్టరీ నివేదిక 'చాలా కాలంపాటు మనల్ని కాపాడిన మీర్ కమాల్జ్డీ పర్షియాలో ఉన్నాడు......' అని తెలియజేస్తుంది.**

కమాలుద్దీన్ నిష్క్రమణతో బందరు నుండి పర్షియాకు సరాసరిన సరుకుల వ్యాపారం చేసేవారు కనపడక పోయేసరికి, గోల్కొండ సుల్తాన్ ఓడలు బందరు ఓడరేవు నుండి మక్కాకు హజ్‌యాత్ర చేసేవారిని జిద్దా రేవుకు తీసుకెళ్ళి తిరిగి కిరాయి మీద బందరు రేవులో దింపుతున్నాయి. **1630 నాటికి కమాలుద్దీన్‌తో పాటు మసులీపటాం రేవు నుండి పర్షియాదేశపు రేవులకు సరుకుల రవాణా చేస్తున్న ఓడ యజమానులు పర్షియన్లు మీర్‌ఖాసిం, మీర్‌మురాద్, మొహమ్మద్ తఖీలు కనుమరుగయ్యారు. 1630 నాటికి, మారిన పరిస్థితుల్లో భారత పశ్చిమతీర రేవులనుండి అరబ్బు దేశాలతో వ్యాపారం చేస్తున్నవారికి ధీటుగా మసులీపటాం నుండి మీర్ మొహమ్మద్ సయీద్ అర్దస్తాని తెరపై కొచ్చాడు.** వాస్తవానికి ఇతడు ఒక కడు పేద కుటుంబంలో, ఇస్ఫాన్ పట్టణ సమీపంలోని గ్రామంలో 1590 ప్రాంతంలో జన్మించాడు. 1630లో గుఱ్ఱాల వ్యాపారిగా గోల్కొండ చేరాడు. తర్వాత వజ్రాల వ్యాపారిగా అవతారం ఎత్తి, పులిచింతల బేసిన్ కొల్లూరు వజ్రపు గనులు కౌలుకు చేశాడు. **తదుపరి రెవిన్యూశాఖలో ఖిల్లాదార్ (రెవిన్యూ ఇన్స్‌పెక్టర్)గా చేరి 1636 నాటికి మసులీపటాం 'హవల్దార్'గా నియమించ బడ్డాడు. మరుసటి సంవత్సరం కొండపల్లి గవర్నరు స్థాయి కెదిగాడు. 1637 జూన్‌లో గోల్కొండ దర్బారులో సుల్తాన్, ముఖ్యమంత్రి తరువాత మూడవ ఉన్నత పదవి సర్-ఎ-ఖైల్ (ఓడరేవు అధికారి) పదవి కెదిగాడు.** సర్‌ఖైల్ పదవిలో ఉంటూ తనదంటూ ఐదు ఫిరంగులు బిగించిన ఒక స్వంత ఓడ నిర్మాణంగావించి, ఆ ఓడపై పనిచేయటానికి డచ్ కంపెనీ నుండి 12 మంది నావికులను, స్టీరింగ్ సరంగును ఏర్పాటుచేసి ఓడనిండా సరుకులతో పర్షియాకు పంపాడు. డచ్ వారే కాక డేనిష్ మరియు ఇంగ్లీషు కంపెనీలు కూడా తమ వంతు ఆయుధాలను ఓడపైకందించారు. **ఈ ఓడ 'మసులాపటాం రాజు' అనే పేరుతో / జెండాతో ప్రయాణించింది** 1641, ఫిబ్రవరిలో పర్షియాకు పంపిన మరొక నావలో 800 బేళ్ళ బట్టలు, 500 బేళ్ళ బెంగాల్ పంచదార, 400 ప్యాకుల నీలిమందు మరియు ఇతరత్రా కార్గో ఉన్నవి. ఈ ఓడతోపాటు ప్రయాణించిన మసులీపటాం వ్యాపారి షేక్‌మాలిక్ మొహమ్మద్ తాలూకా ఓడ, మీర్ సయీద్ ఓడలో 3వ వంతు పరిమాణంలో ఉండేది. సర్‌ఖేల్ హోదాలో ఉన్న మీర్ సయీద్ స్వంత ఓడలు డచ్, ఇంగ్లీషు, డేన్స్ వారి సాయుధ రక్షణలో పోర్చుగీసు బెడద లేకుండా సముద్రం మీద ప్రయాణించేవి. సయీద్ ఓడలు పోర్చుగీసుల అధీనంలోని సిలోన్ రేవులకు బందరు ఓడరేవు నుండి బియ్యం తీసుకెళ్ళి, తిరుగు ప్రయాణంలో సిలోన్, మాల్దీవుల నుండి బందరు రేవుకు ఏనుగులను దిగుమతి చేసేవి. సయీద్ వ్యాపారం **లాభసాటిగా సాగటంతో, బందరు కేంద్రంగా వున్న మిగతా వ్యాపారులు కూడా సిలోన్, మాల్దీవులతో వ్యాపారం సాగించారు.** 1636 నాటి మసులీపటాం ఓడరేవు చిత్రంలోని చెక్కబ్రిడ్జి మీద ఏనుగులు ప్రయాణిస్తూ ఉండటం చూడవచ్చు.



1640 సెప్టెంబరు 1వ తేదీన మసులీపటాం నుండి సరుకులతో బయల్దేరి పర్షియాకెళ్ళి తిరుగు ప్రయాణంలో ఉన్న నౌక **(షేక్ మాలిక్ మొహమ్మద్ 'కు చెందిన నావ్ మౌరిస్‌కా' పేరుగల నౌక)** ముందురాత్రి వచ్చిన తుఫాన్ కారణంగా శ్రీలంక తీరంలో ఒడ్డుకుపట్టి, ఓడరేవు అధికారికి సంకేతాలు పంపింది. శ్రీలంక పోర్చుగీసు కెప్టెన్ జనరల్ డి. ఆంటోనియో మార్క్యారెన్, ఒడ్డు పట్టిన ఓడ దగ్గరకు **'లూయిస్ కొర్రియా'**ను పడవ మీద పంపగా, ఓడ డెక్‌మీద ఉన్న నావికులు **'పడవలో ఎవరున్నార'**ని వాకబు చేయగా, **'పోర్చుగీసులు'** అని జవాబు వచ్చింది. ఓడలోని వారు పోర్చుగీసుల మీద రెండుసార్లు కాల్పులు జరిపారు. **సముద్రం ఇసుకలో కూరుకుపోయిన మసులీపటాం ఓడను రాత్రిళ్ళు పోర్చుగీసు కెప్టెన్ డి. ఆంటోనియో, తన సోదరుని సాయంతో అచ్చేసిన బంగారు దిమ్మెలు, మిగతా సరుకు దోచుకొన్నాడు. పర్షియా నుండి వచ్చిన ఈ ఓడలో అచ్చువేసిన బంగారు దిమ్మెలున్నాయి.** కెప్టెన్ ఆంటోని మొత్తం





బంగారాన్ని, సరుకును దోచుకొని, దాచేసి, ఓడలోని సరుకు **'డియోగో మెన్‌డెన్ డిబ్రిట్టో' మరియు అతని అనుచరులు దోచుకుపోయారని తప్పుడు నివేదిక పోర్చుగల్‌కు పంపాడు.** ఓడలోని బంగారం ఖరీదు 1,000,000 పర్‌డుస్ (Pardus)గా అంచనా వేయబడింది. ఆ కాలంలో జరిగిన పెద్ద స్కాండల్‌గా దీన్ని భావించిన **పోర్చుగల్ ప్రభుత్వం డి. ఆంటోనీకి జీవితఖైదు వేసింది** ఇతరుల ఓడను దోచుకున్నందుకు కాదు, దోచుకున్న సొమ్మును 'దోపిడీ దొంగలు పోర్చుగల్ ప్రభుత్వ ఖజానా'కు జమ చేయనందుకు.

1650 నాటికి మీర్ సయీద్‌కు బందరులో 10 ఓడలు (ఫ్లీట్) ఉండేది. ఈ ఓడల్లో ఒకటి అతి పెద్దది, 800 టన్నుల బరువు మోయగలది. గోదావరి జిల్లా నర్సపూర్‌లో 1630 ప్రాంతంలో నిర్మించబడింది. **ఈ ఓడ తిరుగు ప్రయాణంలోనే ఫ్రెంచ్ వజ్రాల వ్యాపారి జాన్ బాప్టిస్టా టవెర్నియర్ బందరు అబ్బాస్ (పర్షియన్) రేవు నుండి, గోల్కొండ సుల్తాన్‌కు ముత్యాలు, వజ్రాలు పొదిగిన నగలు అమ్మటానికి మసులీపటాంకు 1650 మే నెలలో వచ్చాడు.** మీర్‌సయీద్ పోర్చుగీసు అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండేవాడు, అయినప్పటికీ 1647 ప్రథమార్ధంలో అరేబియా సముద్రంలో ప్రయాణిస్తున్న మీర్ సయీద్ తాలూకా మసులీపటాం నౌకను, గోవా నుండి పోర్చుగల్‌కు ప్రయాణిస్తున్న పోర్చుగల్ ఆర్మడా ఎన్‌కౌంటర్ చేసి, సరుకును దోచుకొన్నది.

ఈస్ట్ ఇండియా కంపెనీ వర్తకులే కాక, 1635 నుండి 1685 వరకు జరిగిన కాలంలో ఇంగ్లీష్ ప్రైవేట్ వర్తకులు మసులీపటాం ఓడరేవులో వర్తకం చేశారు. వీరు మసులీపటాం కేంద్రంగా ఉన్న తూర్పు ఆసియా వర్తకులను లెక్కచేయలేదు. **పర్షియన్ రేవులతో మసులీపటాం వ్యాపారం వెనుకపట్టు పట్టింది. ఏదైనా కాస్తో కూస్తో వ్యాపారం ఉంటే మసులీపటాం వ్యాపారులు తమ సరుకులను ఇంగ్లీష్ ఫ్రీ ట్రేడ్ వర్తకుడు రాబర్ట్ ఫ్రీమాన్ నౌకల్లో లేక ఇంగ్లీష్ కంపెనీ ఓడల్లో పర్షియన్ రేవులకు ఇప్పుడు పంపుతున్నారు.**

**1670 ప్రాంతంలో గోల్కొండ కుతుబ్‌షాహి దర్బారులో ముఖ్యమంత్రిగా, సైనికాధికారిగా తెలుగు బ్రాహ్మణులైన అక్కన్న మాదన్న సోదరులు చేరినతర్వాత దర్బారు రాజకీయాల్లో పర్షియన్ ముస్లిముల ప్రభావం ఏమాత్రం కనపడలేదు.** ఇది మసులీపటాం పర్షియనుల మీద కూడాపడి, క్రమేపి బందరు వ్యాపారం నుండి పర్షియనులు కనుమరుగయ్యారు. చాలామంది బందరు పర్షియన్ వ్యాపారులు బెంగాల్ రేవులకు తరలిపోగా, మీర్‌పఖ్రుద్దీన్ లాంటి ప్రముఖులు పెగూ, అఛీహ్ దేశాలతో వ్యాపారం చేశారు.

1665లో గోల్కొండ సుల్తాన్ ఓడ మసులీపటాం నుండి పర్షియాకు కార్గోతో ప్రయాణిస్తుండగా దారికాచి, పోర్చుగీసు నావ **'సావో పెట్రో డి అల్‌కాంతర'** గోల్కొండ ఓడను, గోవా తీరానికి దారి మళ్ళించి మద్రాసు **'సాంథోమ్ కోటను తమకు అప్పగింత పెడ్తేనే ఓడను వదులుతామ'**ని బేరం పెట్టారు. 1667 దాకా ఇరుపక్షాలకు రాజీ కుదరలేదు. **1665లో మసులీపటాం జోంగ్ (ఓడ) ఒకటి ఎఱ్ఱసముద్రం రేవుల్లో కార్గో దింపి, అక్కడ సరుకు ఎత్తుకొని మసులీపటాం వెళ్తుండగా 'కేప్ పాయిలిక్స్** (Cape Faelix) **దగ్గర ఇంగ్లీష్ సాయుధ ఓడ కాల్పులు జరపగా, భయపడిన వ్యాపారులు, ప్రయాణీకులు తీరానికి పారిపోయారు. ఇంగ్లీష్ ఓడలోని పిరేట్స్ (సముద్రపు దొంగలు) సరుకును దోచుకొని ఓడను ముంచేశారు.** మసులీపటాం డచ్ ఫ్యాక్టరీని **'మూరులు'** ఆక్రమించగా, పగతీర్చుకొనేందుకు - మక్కా రేవు నుండి సరుకులతో నిండుగా ప్రయాణిస్తున్న **మసులీపటాం ఓడను డచ్ వారు దోచుకొనే నిమిత్తం కాల్పులు జరుపుతూ వెంబడించగా, చివరకు ఆ ఓడ డచ్ వారి బందరు ఓడ అని తేలింది.**

పశ్చిమ తీరం జలరవాణా కూడా అడుగడుగునా పోర్చుగీసు, డచ్, ఇంగ్లీషు కంపెనీల సాయుధ ముఠాల ఆగడాలతో 17వ శతాబ్దం చివరిభాగం పర్షియాతో వ్యాపారం నడపలేని స్థితికి చేరింది. **మసులీపటాం కేంద్రంగా వ్యాపారం చేసిన కమాలుద్దీన్, సయీద్ లాంటి దక్షత, నేర్పుగల వ్యాపారులు తమ ఓడల**

**రక్షణతోపాటు, ఇతర వర్తకుల ఓడలకు కూడా రక్షణ కల్పించేవారు. మసులీపటాం నుండి వారు కనుమరుగైన పిదప, ఇతర వ్యాపారస్తుల ఓడలకు రక్షణ కల్పించే నాధుడు బందరులో కరువయ్యాడు. పర్షియా నుండి సూరత్‌కు; సూరత్ నుండి బెంగాల్‌కు (భూమార్గం), సూరత్ నుండి మద్రాస్‌లకు వ్యాపారులు పరిమితమై పోగా, మసులీపటాం ఓడరేవు ప్రభావం 1670 ప్రాంతం నుండి క్రమక్రమంగా తగ్గనారంభించింది, మరి 1864 తుఫాన్ / ఉప్పెనల తర్వాత పూర్తిగా మూలపడింది.**

**బంగాళాఖాతం (సముద్రం)లో మచిలీపట్నం తీరంలో మునిగిన ఓడలు**

గత 5వేల సంవత్సరాల నుండి వివిధ దేశాల ఓడలు, నౌకలు లెక్కకు లేనన్ని ప్రకృతి వైపరీత్యాలయిన తుఫాన్ / ఉప్పెన / సునామీలకు; సముద్ర యుద్ధాలకు, సముద్ర దొంగల బారినపడి భారత సముద్రజలాల్లో మునిగిపోయినవి. క్రీ.శ. 16వ శతాబ్దం కాలం నుండి భారత జలాల్లో మునిగి జాడ తెలియకుండా పోయిన, నౌకల, ఓడల వివరాలు మాత్రమే నమోదైనాయి. బౌద్ధ జాతకకథల్లో అక్కడక్కడా మునిగిన ఓడల ప్రస్తావన ; సముద్ర తీర ప్రాంతాల్లోని ప్రాచీన దేవాలయాల (ఉదా : కోణార్క్ – ఒరిస్సా) శిల్పాలలో; బౌద్ధ చైత్య – స్థూప అలంకరణ శిల్పాలమీద నౌకాభంగ చిత్రములు అరుదుగా కన్పడతాయి. శాసనాలలో కూడా వీటి ప్రస్తావన అక్కడక్కడా కనబడుతుంది. నవీనకాలపు ఓడల / నౌకల మునకల వివరాలు ఢిల్లీ, కోల్‌కతా, భువనేశ్వర్, పనాజి, ముంబయి, చెన్నై మరియు హైదరాబాద్ ఆర్చివ్స్‌లో లభ్యమవుతాయి.



**మచిలీపట్నం సముద్ర తీర జలాల్లో ఓడల / నౌకల మునక వివరాలు:**

1. 1719లో 'డార్ట్ మౌత్' నౌక, ప్రభుత్వ ఖజానా రవాణా చేస్తూ మచిలీపట్నం సముద్ర జలాల్లో మునిగిపోయింది.
2. స్టీమర్ షిప్ 'ఎమ్మా' మసులీపటాం జలాల్లో దివి పాయింట్ (హంసలదీవి) వద్ద 1849, జూన్ 12న మునిగింది.
3. 'మొహిద్దీన్ అబ్దుల్ ఖాదర్ నసారుల్లా తైకా' పేరుగల 'స్కూనర్ క్లాస్' నర్సపూర్ తయారీ ఓడ 1912లో మచిలీపట్నం వద్ద మునిగి పోయింది.

ఇవికాక మరెన్నో నౌకలు / ఓడలు మసులీపటాం సముద్రజలాల్లో మునిగినప్పటికీ, వాటి వివరములు పూర్తిగా తెలియటం లేదు. **వర్షపు ఋతువుల్లో పడే అధిక వర్షాల వలన బంగాళాఖాతం క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉప్పెనలు మరియు అల్పపీడనాలు తరచుగా ఏర్పడతాయి.** ఉప్పెనల వలన ఏర్పడిన సముద్ర పోటు వరద కూడా చాలానష్టాలు కలగజేస్తుంది. ఈ ఉత్పాతాల వలన సముద్రంలో మునిగిన ఓడలు, నౌకలు మునిగిన చోటునుండి దూరంగా కొట్టుకుపోవటం గాని, లేక సముద్రం లోపల భాగంలో ఏర్పడిన ఇసుకతిన్నెల క్రింద పాతుకుపోతాయి. ఒక దేశం మరొక దేశం మీద జరిపే యుద్ధాలు, రాజవంశాల్లో బలహీనులైన రాజులు ఆయా దేశపు బలహీన ఆర్థిక వ్యవస్థ, ఇవన్నీ ఇరుగుపొరుగు దేశాలమీద యుద్ధాలకు ప్రేరణ అయి ఆయాదేశపు (మారిటైం యాక్టివిటీస్) సముద్ర జలాల రవాణాను దెబ్బతీస్తుంది. క్రీ.శ. 16, 17 శతాబ్దాలలో తూర్పుతీరపు సముద్ర రవాణా దెబ్బతినటానికి కారణం ఇదే. ఈ కారణాలు కాక, ప్రకృతి పరంగా భూగర్భంలో జరిగే చర్యలవలన తీరప్రాంతం నదీపాతం జరగటం (Coastal Erosion), సముద్ర స్థాయిలో మార్పులు (Sealevel Changes), సముద్రపు లోతుపొరల్లో సంచలనం (Tectonic Activities), నదీ ముఖద్వారాల పూడిక (Sedimentation), ఇసుకతిన్నెలు ఏర్పడటం (Formation of sand bars) – కర్ణుడు చావుకు ఎన్నో కారణాలయినట్లు ఓడరేవులు పతనమవటానికి కారణ భూతాలవుతున్నాయని **గోవా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనాలజీ మెరేన్ ఆర్కియాలజిస్ట్ శిలా త్రిపాఠీ తన** "Management of Ports and Maritime Trade of Orissa and Andhra Pradesh" **పరిశోధన పత్రంలో వ్రాశారు.**

**రాతి లంగర్లు (ROCK ANCHORS) :** లంగర్లకు ఇనుము వాడకం రాక పూర్వం సముద్ర తీరంలో ఓడలు, నావలు లంగరేసేందుకు, రాతి యాంకర్లు వాడేవారు. ఈ యాంకర్లు భారతదేశం తీరాల్లో లభ్యమయినాయి. ఈ రాతి యాంకర్లు 10 టన్నుల నుండి 15 టన్నుల బరువు కలిగి ఉండేవి. **ఇటీవల కాలంలో, ఒంగోలు సమీపంలోని 'కొత్తపట్నం' రేవు ఇసుక దిబ్బల్లో ఒకటి దొరికింది.** మచిలీపట్నం తీరంలో ఇంకా లభ్యమవలేదు. వీటిని సముద్ర పురాశాస్త్ర వేత్తలు 'ఇండో – అరేబియన్ యాంకర్స్' అని పిలుస్తారు. సముద్రంలో నిలిపిన భారీ ఓడలను, కదలకుండా రాతి లంగర్లు ఆపేవి. తిరిగి ప్రయాణం కొనసాగించ దలచినప్పుడు కప్పీల సహాయంతో లంగరును ఎత్తి ఓడలో ఉంచేవారు. భారీ మోకులు కట్టటానికి లంగరులో ఒకటి లేక రెండు రంధ్రములు ఏర్పాటు చేసేవారు.

–మహమ్మద్ సిలార్
మెంబర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

# నాయకపోడ్ మాస్కులకు పునర్జీవం



పంచ పాండవులు

మునుపటి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో నాయకపోడ్ తెగ ప్రజలు జీవిస్తున్నారు. ఈ ప్రాంతాలలో వారు (నాయకులు) ధనిక రైతులుగా క్రీ.శ. 9–10 శతాబ్దాల నుంచే శాసనాలలో ప్రస్తావించబడ్డారు. అలాంటివారు క్రీ.శ. 13–14 శతాబ్దాలలో కాకతీయుల సామంత నాయకులుగా కీర్తి గడించారు. కాకతీయులను ఢిల్లీ సుల్తానులు, బహమనీ సుల్తానులు ఓడించిన తరువాత వారిని తిరిగి ఓడించి రాచకొండ రాజధానిగా క్రీ.శ. 14–15 శతాబ్దాలలో పలు తెలంగాణ ప్రాంతాలను పరిపాలించారు. కాకతీయులు ప్రధానంగా శైవులు కాగా నాయకులలో రేచర్ల గోత్రీకులైన పద్మ నాయకులు శైవంతో పాటు వైష్ణవ, శాక్తేయ, ప్రాకృతిక మత శాఖలను పోషించారు. ఈ విశేషాలు వారి దారు శిల్పకళలో ఇప్పటికీ కన్పిస్తుండటం గమనార్హం.

పద్మ నాయకులను క్రీ.శ. 20 వ శతాబ్దం మధ్య కాలం ... అంటే నిజాం కాలంలో నాయకపోళ్ళు, నాయకపోడులు అని పిలిచేవారు. ఈ నాయకపోడులు తమ ఇల్లారులలో (గుడిసె ఆలయాలలో) ఈ కింది దేవీ దేవతలను ఆరాధిస్తున్నారు.

**శైవం** – సాంబమూర్తి

**వైష్ణవం** – కిట్టమూర్తి (శ్రీ కృష్ణ), పాండవులు

**శాక్తేయం** – లచ్చిందేవర (లక్ష్మి)

**రాజులు** – పోతరాజు, సింగబోయుడు, ప్రోలయ

**ప్రకృతి** – ఎర్రగొండ రాకాసి, నల్లగొండ రాకాసి, గురాపోతు (అడవి దున్నపోతు), పందిరాజు, లేడి

పైన పేర్కొన్న దేవీ దేవతల శిరస్సులను అలకటి బూరుగు కట్టెతో చెన్నూరులోని నకాశివాళ్ళ చేత నాయకపోళ్ళు చేయించుకుంటారు. ఒక్కో శిరస్సును సుమారు అడుగు నుండి మూరెడు ఎత్తు, ఎనిమిది నుండి పది అంగుళాల వెడల్పు పరిమాణాలలో చెక్కుతారు. తరువాత వాటిపైన ఉండే చిన్న చిన్న రంధ్రాలను పూడ్చడానికి మక్కు పెడతారు. ఆ తరువాత శిరస్సుల ఉపరితలాలు నునుపుగా ఉండడానికి వాటిపై వాటర్ పేపర్ తో రుద్దుతారు. అనంతరం ఆ శిరస్సుల చుట్టూ తెల్ల బట్టి చుట్టిన తరువాత ప్రైమర్ (ప్రాథమిక తెల్ల రంగు) అద్దుతారు. తెల్ల రంగు పైన శిరస్సుల ముఖ కవళికలు స్పష్టంగా, ఆకర్షణీయంగా కనపడడానికి గాను పంచ వర్ణాలను అద్దుతారు. వెంట్రుకలు, కనుబొమలు, గడ్డం, మీసాలను నలుపు రంగుతో, పెదవులు, బొట్లను ఎరుపు రంగుతో, కంఠహారాలు, నగలను పచ్చ, పసుపు పచ్చ రంగులతో తీర్చిదిద్దుతారు.

పంచ పాండవుల శిరస్సులలో ధర్మరాజు మొదలుకొని సహదేవుని వరకు ఒక్కొక్కరి శిరస్సును ఒక్కో రంగుతో అలంకరిస్తారు. అంటే, శిరస్సు యొక్క ప్రధాన రంగును బట్టి ఫలానా శిరస్సు ఫలానా పాండవ సోదరునిదని గుర్తుపడతారు. గురాపోతుకు, లేడికి కొమ్ములుంటాయి. పందిరాజుకు కోరలుంటాయి. ఎర్రగొండ రాకాసి ఎరుపు రంగులో, నల్లగొండ రాకాసి నలుపు రంగులో ఉంటాయి. ప్రోలయ ముఖాన్ని మాత్రం ముంగిస తోలు(రంగు)తో చేసి దానికి జనప నార మీసాలు పెడుతారు. సింగబోయుని శిరస్సుపై శృంగం ఉంటుంది. సాంబమూర్తి తలపై పాము పడగ ఉంటుంది. కిట్టమూర్తి భార్య లచ్చిందేవర శిరస్సు స్త్రీ దేవత శిరస్సు కాకుండా ఒక గుర్రం తల. అందుకు సంబంధించిన పౌరాణిక కథను నాయకపోడ్ ఆశ్రిత కులం కోలకానివారు చిత్ర పటం ఆధారంగా గానం చేస్తారు.

పై దేవీ దేవతలలో నాయకపోడుల ప్రధాన దేవత (ఆడబిడ్డ) లచ్చిందేవర. సకాలంలో వర్షాలు పడి పంటలు పండాలని, కరువు కాటకాది బాధలు రాకుండా, వచ్చినా తమను బాధించకుండా తమ గూడెం సుభిక్షంగా ఉండాలని నాయకపోళ్ళు సందర్భానుసారం "లచ్చిందేవర – కిట్టమూర్తి పెండ్లి సంబరాలు" జరుపుకుంటారు. ఆ సంబరాలలో భాగంగా సన్నాయి–మేళాల శబ్దాలకు స్పందనగా దేవరబాలకు (అత్యంత పవిత్ర వ్యక్తికి) పూనకం వచ్చి లచ్చిందేవర మాస్క్ ను ధరించి లయబద్ధంగా నృత్యం చేస్తాడు. లచ్చిందేవర దేవరబాలకు ఇరు వైపులా మరి కొందరు పూనకం వచ్చిన గణబాలలు (పవిత్ర వ్యక్తులు) ఇతర మాస్క్ లను ధరించి లయబద్ధంగా నృత్యం చేస్తారు. సమయం గడుస్తున్నా కొద్ది గణబాలలలో,

భక్తులు, చూపరులలో ఉత్సాహం ఇనుమడించి మేళాల శబ్దాలు ఊపందుకోగా అందరూ ఈలలు వేస్తూ అత్యంత తన్మయత్వంతో నృత్యం చేస్తారు. దేవరబాల, గణబాలల చుట్టూ స్త్రీ బాల వృద్ధులందరూ వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేస్తారు.

లచ్చిందేవరబాల నృత్యం పశ్చిమ ఆఫ్రికా దేశాలలో ప్రసిద్ధి గాంచిన కుంపో నృత్యాన్ని పోలి ఉంటుంది. కుంపో నృత్యంలో కూడా నర్తకుడు కన్పించక ఒక గుండ్రని పిరమిడ్ ఆకారం వలయాకారంలో తన చుట్టూ ఉన్న నారలను విరజిమ్ముతూ నృత్యం చేస్తాడు – ఒక అదృశ్య శక్తి నడిపిస్తుండగా. లచ్చిందేవరబాల కూడా గుర్రం తలను ధరించి గుండ్రని పిరమిడ్ ఆకారపు వస్త్ర సహిత గంప లోపల నుంచి చూపరులకు కనిపించకుండా నృత్యం చేస్తాడు.



ఇలాంటి నృత్య సహిత లచ్చిందేవర పెండ్లి సంబరాలను నాయకపోళ్ళు మంచిర్యాల తూర్పు ప్రాంతం మొదలుకొని భద్రాచలం వరకు జరుపుకుంటారు. సంబరాలు ముగిసిన వెంటనే నాయకపోళ్ళు కోరుకున్నట్లు వర్షం పడడం బయటి వాళ్ళను, హేతువాదులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇలాంటి లచ్చిందేవరలు తెలంగాణలో సుమారు అరువై చోట్ల ఉన్నట్లు తెలుస్తున్నది.



లచ్చిందేవర మొదలైన పదహారు రకాల మాస్కులను ఇప్పటి వరకు చెన్నూరులోని నకాశివాళ్ళు తయారు చేస్తున్నారు. ఆధునీకరణ నేపథ్యంలో నిరంతరం పని లభించక నకాశివాళ్ళు మెల్లగా ఈ మాస్కులను తయారు చేయడం మానేస్తున్నారు. అది అరుదైన సంస్కృతి అస్తిత్వానికి విఘాతం కలిగిస్తుందని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ(లో పని చేస్తున్న నేను), ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం కార్యదర్శి పసుల బుచ్చయ్య ఆలోచించి ప్రత్యామ్నాయ మార్గంగా ఆయా మాస్క్‌లను నాయకపోడులే మినియేచర్ మాస్క్‌లుగా తయారు చేస్తే ఈ అరుదైన కళ – సంస్కృతి, విశ్వాసాలు బతికి బట్టకడుతాయని భావించాము. ఈ మేరకు బుచ్చయ్య 2021 నాటి గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ డా. క్రిస్టినా జెడ్ చోంగ్తుకు వినతి పత్రం ఇవ్వగా ఆమె బుచ్చయ్యకు ఆ సంవత్సరపు ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున (ఆగస్ట్ 9న) ఆనాటి గిరిజన సంక్షేమ శాఖామాత్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా నాయకపోడ్ మినియేచర్ మాస్క్‌ల యూనిట్‌ను భద్రాచలంలో నిర్వహించవలసిందిగా మంజూరు పత్రాన్ని అందజేసింది.

అక్కడి ఐ.టీ.డీ.ఏ. (సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ) కార్యాలయ సముదాయం నుండి పసుల బుచ్చయ్య కొడుకు (అంజన్ కుమార్) తో పాటు మరో అయిదారుగురు యువతీ యువకులు పలు రకాల మాస్క్‌లను తయారు చేశారు. సుమారు మూడు సంవత్సరాల తరువాత ఈ యూనిట్‌ను అంజన్‌కుమార్ తన సొంత గ్రామమైన మాదాపూర్ కు తరలించాడు. ఇప్పుడు ఆ యూనిట్‌లో సుమారు పది మంది నాయకపోడ్ హస్తకళాకారులు పని చేస్తున్నారు. ప్రస్తుతం మరో ఇరువై మందికి శిక్షణ ఇస్తున్నారు.

గిరిజన సాంస్కృతిక పరిశోధన – శిక్షణ సంస్థ వీరి మాస్క్ లను గవర్నర్లు, రాష్ట్రపతి, మంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులకు ఎందరికో స్మారక బహుమతులుగా ఇస్తూ ప్రచారం చేస్తున్నది. వీటి కీర్తిని, ప్రత్యేకతలను డాక్యుమెంటరీలుగా రూపొందించడం జరిగింది. జాదవ్ పూర్ విశ్వవిద్యాలయం, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిజిటల్ గిరిజన విశ్వవిద్యాలయం నాయకపోడ్ మినియేచర్ మాస్క్ లపై డాక్యుమెంటరీలు రూపొందించి వాటిని తమ పాఠ్యాంశాల్లో చేర్చాయి. పలువురు వ్యక్తిగత డాక్యుమెంటేరియన్లు కూడా నాయకపోడ్ మినియేచర్ మాస్క్‌లపై డాక్యుమెంటరీలు రూపొందించారు.

దేశంలో పలు చోట్ల మాస్క్ లున్నాయి. తెలంగాణలో కూడా గోండులు కోడల్, టప్పల్ అనే మాస్క్ లను వాడుతారు. అయితే ఏవి కూడా నాయకపోడ్ మాస్కులంత అందంగా ఉండవు. నాయకపోడ్ మాస్కుల అందానికి ఒక కారణం వాటిని నునుపుగా తీర్చిదిద్దడం కాగా, రెండవ కారణం వాటి ఆకర్షణీయ రంగులు. వాటిని నకాశివారు తరతరాలుగా రాజస్థాన్ నుంచి తెప్పించుకుంటున్నారు. రాజస్థాన్ రంగులు పొడుల రూపంలో ఉంటాయి. పొడులను నీటిలో పోయగానే ఆకర్షణీయమైన రంగులుగా మారతాయి. ప్రస్తుతం నాయకపు కళాకారులు మార్కెట్లలో లభించే రంగులనే వాడుతున్నారు. తెలంగాణలో నిర్మల్‌లో, చేర్యాలలో సాంప్రదాయ కళాకారులు కూడా ప్రస్తుతం మార్కెట్ రంగులనే వాడుతున్నారు.

మార్కెట్ రంగులు అంత మంచివి కావనే విషయం అందరికీ తెలుసు. అయినా తప్పక వాడుతున్నారు. కారణం, ప్రత్యామ్నాయ దేశీ రంగులు అందుబాటులో లేకపోవడం. 'మరి దేశీ రంగులను మళ్ళీ తెరపైకి తేవడం ఎలా' అని అడిగినప్పుడు పసుల బుచ్చయ్య తనకు చిన్నప్పుడు మహబూబాబాద్ జిల్లాలో పారే వాగులలో అనేక రంగురాళ్ళు కనిపించేవని, అలాంటివాటిని సేకరించి, పొడి చేసి దేశీ రంగులను తయారు చేయవచ్చని చెప్పాడు. అట్లాగే దీపం మసి నుంచి నలుపు రంగును, ఎండిన పూల నుండి పలు రంగులను, కొన్ని చెట్ల ఆకులు, పండ్ల రసాల నుంచి కూడా కొన్ని రంగులను తయారు చేయవచ్చని తెలుస్తున్నది. తుమ్మకాయల నుంచి ఎలిగారం తయారు చేసి దానినీ రంగుగా ఉపయోగించవచ్చని తెలుస్తున్నది.

నిజానికి కొన్ని దశాబ్దాల క్రితం వరకు పైన పేర్కొన్న వాటితో పాటు మరెన్నో విధాలుగా దేశీ రంగులను తయారు చేసుకొని వాడేవారు. ఇప్పటికీ ఇలాంటి విధానాలు తమిళనాడులో ఉన్నాయని రమేశ్ రామనాథం అనే నిపుణుడు తెలిపాడు. కాబట్టి తెలంగాణ గిరిజనులకు... ప్రత్యేకించి నాయకపోడ్ పెద్ద మనుషులకు తెలిసినా స్వదేశీ రంగుల పరిజ్ఞానాన్ని తెలుసుకొని, నకాశివాళ్ళ ప్రాచీన రంగుల పరిజ్ఞానాన్ని తెలుసుకొని, తమిళనాడు, రాజస్థాన్ వంటి ఇతర రాష్ట్రాల సాంప్రదాయ హస్తకళాకారుల దేశీ రాంగుల పరిజ్ఞానాన్ని తెలుసుకొని, అన్నింటి మిశ్రమంగా తెలంగాణలో స్వదేశీ రంగులను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలి. ఇందుకు పరిశోధనతో పాటు అన్ని వనరులను ఒక్క చోటికి చేర్చి కొన్ని వారాల పాటు విషయ నిపుణులతో ఆశావహ ఔత్సాహికుల కోసం ఒక వర్క్‌షాప్ పెట్టాలి. అప్పుడు మాత్రమే కనుమరుగై పోయిన దేశీ రంగుల పునరుజ్జీవనం / పునర్వైభవం సాధ్యమవుతుంది.

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com




# నియోబియం మూలకం యొక్క ఖనిజాలు

నియోబియం కేంద్రప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు మనదేశంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తించి నిర్ధారించబడ్డ నియోబియం నిక్షేపాలు మన అవసరాలకు సరిపడాలేవు. దాదాపు 90 శాతం వేరే దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము.

నియోబియం మూలకం యొక్క సింబల్ Nb మరి ఆటమిక్ నంబర్ 41 మరియు పీరియాడిక్ టేబుల్‌లో 5b గ్రూప్‌కు చెందినది. ఈ మూలకాన్ని 1801లో గుర్తించబడినది. చార్లిస్ హ్యాచెట్ ద్వారా కనెక్టికట్ నగరంతో దీనిని మొదలు కొలంబియం అని నామరణం చేసారు. తరువాత 1844లో జెర్మన్ కెమిస్ట్ హీన్‌రిచ్‌రోస్ టాంటలంతోపాటు దీనిని గురించి దీనికి నియోబియం అని నామకరణం చేశారు. ఈ ఖనిజం భూమి యొక్క క్రస్ట్‌లో టాంటలం కన్నా పదిరెట్లు ఎక్కువ ఉంటుంది. కాని కాపర్ కన్నా చాలా తక్కువగా ఉంటుంది. ఇది కొన్ని ఖనిజాలలోనే డిస్‌పర్స్ అయి ఉంటుంది. ఉదాహరణకు కొలంబైట్-టాంటలైట్ సీరిస్‌లో కొలంబైట్ ($F_eNb_2O_6$) మరియు టాంటలైట్ ($F_eTa_2O_6$)లో ఎక్కువ మొత్తంగా దొరుకుతుంది. ఇవి ఈ ఖనిజానికి ముఖ్యమైన కమర్షియల్ సోర్స్. ఇది కాకుండా దీనికి పైరోక్లోర్ (కాల్శ్యం సోడియం నియోటేబ్) కూడా ఒక ముఖ్యమైన సోర్స్. న్యాచురల్ నియోబియం చాలా వరకు స్టేబుల్ ఐసోటోప్ రూపంలో అనగా నియోబియం-93గా దొరుకుతోంది.


సైయానైట్

దీని ప్రొడక్షన్ ప్రోసీజర్స్ చాలా కాంప్లికేటెడ్‌గా ఉంటుంది. ముఖ్యంగా దీన్ని టాంటలం నుండి వేరు చేయడం. దీన్ని ఎక్స్‌ట్రాక్ట్ చేయడానికి లిక్విడ్. లిక్విడ్ ప్రాసెస్ మరియు ఎలెక్ట్రాలిసిస్ ప్రాసెస్ ద్వారా చేస్తారు.

దీని స్వచ్ఛమైన మెటల్ సాఫ్ట్‌గా మరియు డక్‌టైల్‌గా ఉంటుంది. స్టీల్ మాదిరిగా కనబడుతుంది. పాలిష్ చేసిన తరువాత ప్లాటినం లాగా అనిపిస్తుంది. ఇది కరోశన్ రెసిస్ టెన్స్ చాలా ఎక్కువ ఉన్నప్పటికి ఇది ఆక్సిడేషన్ ప్రాసెస్‌కు 400 డిగ్రీల సెంటిగ్రేడ్‌పైన ససెప్టిబుల్ అవుతుంది. దీన్ని నైట్రిక్ మరియు హైడ్రోక్లోరిక్ ఏసిడ్స్‌లో డిసాల్వ్ చేయవచ్చును.

ఇది ఇనుముతో బాగా కలిసిపోతుంది. అందుకే దీన్ని ఫెర్రోనియోబియంగా కొన్ని స్టెయిన్‌లెస్ స్టీల్స్‌లో వాడతారు. దీనిని నికల్ బేస్డ్ అల్లాయిస్‌ల్లో కూడా ఉపయోగిస్తారు. జిర్కోనియంతో



నియోబియం మెటల్

అల్లాయ్ చేసి న్యూక్లియర్ రియాక్టర్స్‌లో క్లాడింగ్స్‌గా ఉపయోగిస్తారు. కట్టింగ్ టూల్స్‌లో కూడా గట్టితనానికి, బలాని కోసం వాడతారు. నియోబియంని క్రైయోజెనిక్ (లోటెంపరేచర్) ఎలక్ట్రానిక్ డివైసెస్‌ని డెవలప్ చేయడానికి ఉపయోగిస్తారు.

నియోబియం-టైటానియం (Nb-Ti) మరియు నియోబియం-టిన్ (Nb-Sn)లని సూపర్ కండక్టింగ్ వైర్ నుండి హై ఫీల్డ్ మాగ్నెట్స్‌లలో వాడతారు. దీనిని MRI మశీన్స్‌లో స్కానర్స్‌లో ఉపయోగిస్తారు. ఇది అడ్వాన్స్‌డ్ బ్యాటరీలలో, తొందరగా చార్జింగ్ కావడానికి ఉపయోగపడుతుంది. దీనికి ఉన్న బయో కంపాటిబులిటీ ప్రాపర్టీ వలన సర్జికల్ ఇంప్లాంట్స్, టూల్స్‌లో వాడతారు.

కొలంబైట్-టాంట్‌లైట్ గ్రూప్‌కు చెందిన ఖనిజాలు నియోబియం మరియు టాంటలం పెగ్మటైట్ డిపాజిట్స్‌లో బీహార్, జార్ఖండ్, రాజస్థాన్ మరియు కర్ణాటకలలో దొరుకుతుంది. నియోబియం – టాంటలంలు చాలా వరకు కలిసి దొరుకుతవి. కావున వీటిని ఇన్సెపరాబుల్ ట్విన్స్‌గా సంబోధిస్తారు. ఈ ఖనిజం యొక్క ఎక్కువ శాతం ఉత్పత్తి బ్రెజిల్, ఆస్ట్రేలియా, కెనడాలలోనే జరుగుతుంది. కొన్ని ఆఫ్రికన్ దేశాలు కూడా వీటి నిక్షేపాలను గురించి ఉత్పత్తి చేయసాగాయి.

మన దేశంలో కూడా ఇప్పుడు వీటి గురించి విస్తృతంగా అన్వేషణ జరుపుతున్నారు. నియోబియం ఖనిజాలు దొరికే శిలలు కారబోనాటైట్స్, సైనైట్స్, పెగ్మటైట్స్, ఆల్కలిగ్రానైట్స్ ఆల్కలైన్ శిలలు, పిక్రిటిక్ బసాల్ట్స్, టిన్-టంగ్స్‌టన్ ఓర్స్‌తో కూడా దొరుకుతుంది. ఇవి కాకుండా హైడ్రో థర్మల్ వీన్ డిపాజిట్స్‌లో సామాన్యంగా నియోబియం ఖనిజాలు రేర్ ఎర్త్ మినరల్స్, టైటానియం, జిర్కోనియంతో కూడి ఉంటుంది. ప్రైమరీ ఇగ్నియస్ శిలలోనే కాకుండా ఇది సెకండరీ డిపాజిట్స్‌లో కూడా దొరుకుతుంది.

ప్రస్తుతం మన దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు క్రేటానిక్ ప్రాంతాలలో ఆల్కలైన్ ప్రావిన్స్‌లలో, సయనైట్ కాంప్లెక్స్‌లలో ఆల్కలిగ్రానైట్స్, కార్బోనైటేట్స్, పెగ్మటైట్‌రిచ్ ప్రాంతాలలో అన్వేషిస్తున్నారు.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



ఆల్కలి గ్రానైట్స్



UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2024

Serial Nomination for ROCK ART SITES OF THE CHAMBAL VALLEY
Madhya Pradesh and Rajasthan Province or Region India. Category: Cultural

# చంబల్ లోయలో పాత రాతియుగం నాటి చిత్రాలు

**దాఖలు చేసిన తేదీ:** 2024 ఫిబ్రవరి 8
**ప్రాథమ్యాలు:**
**విభాగం:** సాంస్కృతికం
**దాఖలు చేసింది:** యునెస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం
**రాష్ట్రాలు:** మధ్యప్రదేశ్, రాజస్థాన్
**రెఫరెన్స్:** 6732



చంబల్ లోయలోని రాతి చిత్రలేఖన కేంద్రాలు (Rock Art Sites) ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఉన్న పురాతన కళాఖండాల సమూహాలలో ఒకటిగా గుర్తింపు పొందాయి. ఈ ప్రాంతం మధ్యప్రదేశ్ – రాజస్థాన్ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. 2024 ఏప్రిల్‌లో, ఈ ప్రాంతంలోని రాక్ ఆర్ట్ సైట్‌లను యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు.

**క్లస్టర్ల వివరాలు:**

**క్లస్టర్ I: గ్వాలియర్ జిల్లా, (మధ్యప్రదేశ్):** ఔర్‌పురా, బాబా చాజ్, భౌ సాహెబ్ కి సమాధి, చుడేల్ చాజ్, దౌలత్‌పూర్, దేనా గావ్, గుప్తేశ్వర్ హిల్, గ్వాలియర్ వెస్ట్, మహారాజపుర, మోహనా, పారా, సియా చాజ్, టిక్లా (కనకాళి మాత)

**క్లస్టర్ II: మందసౌర్ జిల్లా (మధ్యప్రదేశ్):** ఆదర్షిలా, అంబా దియాదే, అంతరాలియా, అరియా, బాబుల్దా, బడా-రాంకుండ్,





బదలాఘట, భడకా, బర్దాదే, భన్వర్దేవి, బిజోలియా జలపాతం, బిల్లిఖో, చతుర్భుజనాథ్ నాలా, చన్వరియాదే, చిబ్బడనాలా (అంర్ఝర్), చోటా-రాంకుండ్, దదౌలీ-కా భడకా, గఫద, గోలంబనాల, హింగలాజ్‌గఢ్ (IAR 1958-59), ఇందర్‌గఢ్, జహన్‌పదేవా, జునాపాని, కన్వాల, దకన్-కా-సాధియా, గెబ్‌సాహెబ్, గాంధీ సాగర్.

క్లస్టర్ III: **మొరెనా జిల్లా (మధ్యప్రదేశ్):** అంర్ఝిర్ నాలా, భదేహ్ చాజ్, బుదేరా, చప్రేత, దుబ్‌కుండ్, హరేనా, కొలేయా, లిఖీ చాజ్, పద్ధోనల్, పహర్ గఢ్, పరేవా, రెమ్‌జాఖో, సియాకా, ధక్కరద్.

క్లస్టర్ IV: **రాజ్‌గఢ్, జిల్లా (మధ్యప్రదేశ్):** అచల్‌గఢ్ కొండ, బడా మహాదేవ్ కొండ, భైంసా తోల్, చాంపి కొండ, చిడీ ఖో కొండ, ఛోటా తలాబ్ కొండ, దేవ్ మహారాజ్ కొండ, ధింగ్‌దేవ్ కొండ, ధౌలా దాంతా కొండ, కోట కొండ-ఎ (దక్షిణం), కోట కొండ-బి (దక్షిణం), కోట కొండ (పశ్చిమం), కోట కొండ (దక్షిణం), కోట కొండ (తూర్పు), కోట కొండ (వాయువ్యం), గావా కొండ, గోల్తకరి, సూర్యవంశీ ట్యాంక్‌కు ఉత్తరాన ఉన్న కొండ, భట్‌పురా నుండి పశ్చిమాన ఉన్న కొండ, సూర్యవంశీ ట్యాంక్ నుండి తూర్పున ఉన్న కొండ, కలితోల్ నుండి దక్షిణాన ఉన్న కొండ, హింగ్లాజ్ మాతా కొండ, కక్షిల (పశ్చిమం), కక్షిల (ఉత్తరం), మలితోల్ కొండ, మాతాజీ కొండ, రాణి ఛజ్జా కొండ, రాణి ఛజ్జా కొండ కుడి భాగం, విజయగఢ్ కొండ.



క్లస్టర్ V: **శివపురి జిల్లా (మధ్యప్రదేశ్):** అభయారణ్య, అంర్ఝరి, భర్కా-ఖో, చోర్పురా, చురేలోన్ కా పహర్, ఇమాలియా, కరోత్రా, కర్సేన, లుధ్‌కువా-ఖో, మహాదేవ్, తుండా.

క్లస్టర్ VI: **ఝలావర్ జిల్లా (రాజస్థాన్):** అంర్ఝిరీనాల, చంగేరి, గాగ్రోన్, హరిశ్చంద్ర ఆనకట్ట, ఖేజడీభూప్, ఖోల్వీ, పదాఖో.

క్లస్టర్ VII: **భిల్వారా జిల్లా (రాజస్థాన్):** భడకియా, బకన్, బంగంగా, గెండీ కా ఛజ్జా, గోపీచంద్ కా ఛజ్జా, గుడియా టోల్, హాతీటోల్, ఝిరియన్, జోగ్నియా మాతా, కిషన్ నివాస్, ఖోకి, కేలీ కా నాలా, మండోల్ డ్యామ్-ఎ, మండోల్ డ్యామ్-బి, మెండ్కీ మహాదేవ్, సెమ్లా మహాదేవ్.

క్లస్టర్ VIII: **చిత్తోర్‌గఢ్ జిల్లా (రాజస్థాన్):** బాబాజీ కి మాఢి, బడీ సాద్రి, చంబ్లీ నాలా, చిత్తోర్‌గఢ్ కోట, ఘుఘుడ్బార్, మంగర్‌దేహ్, పదఝర్ జలపాతం.

క్లస్టర్ IX: **కోటా జిల్లా (రాజస్థాన్):** ఆదర్శిలా, బుక్కీ మాతా, కేబుల్ నగర్, చంద్రసెల్, చత్రేశ్వర్ (అలానియా నది), దర్రా, గరాడియా మహాదేవ్, గేపర్నాథ్, జవహర్ సాగర్ డ్యామ్, కాలాజీ-కి-కుయ్, కంధాట్, నరసింగ మాతాజీ, సోర్సన్ మాతాజీ, తిపానియా మహాదేవ్.

భారతదేశ మధ్య ప్రాంతం అనేక రాతి చిత్రకళా కేంద్రాలకు నిలయంగా ఉంది. సమాంతర శ్రేణులు, దట్టమైన ఆకురాల్చే అడవులు, శాశ్వత నీటి బుగ్గలు, సమృద్ధిగా ఉండే వన్యప్రాణులతో కూడిన వింధ్య, సాత్పురా, కైమూర్ పర్వత ప్రాంతాలలో ఈ రాతి చిత్రకళా కేంద్రాలు విలసిల్లాయి. పాతరాతియుగం, మధ్యరాతియుగం, నవీనరాతియుగం, చారిత్రక కాలాలకు చెందిన ఈ చిత్రకళా కేంద్రాలు తరచుగా తామ్ర శిలాయుగం, బృహత్ శిలాయుగం, పూర్వ చారిత్రక కాలాల అంశాలతో పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి.

ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో రాతి చిత్రకళా కేంద్రాలు ఉన్న ప్రాంతాలుగా చంబల్ బేసిన్, మధ్య భారత దేశం గుర్తింపు పొందాయి. పురాతన కాలంలో 'చర్మణ్వతి' అని పిలువబడే చంబల్ నది మాల్వా ట్రాప్ జోన్ నుండి జన్మిస్తుంది; దీని కుడి వైపు ఉపనదులు ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తాయి. మరోవైపు, ఎడమ వైపు ఉపనదులు ఆరావళి పర్వతాలు, వింధ్య ఇసుకరాతి, క్వార్ట్జైట్ కొండల నుండి పుడతాయి.

చంబల్ బేసిన్ మధ్యప్రదేశ్‌లోని (ఇండోర్, ఉజ్జయిని, మందసౌర్, రత్లాం, సెహోర్, గుణ, రాజ్‌గఢ్, గ్వాలియర్, షియోపూర్ జిల్లాలు), రాజస్థాన్‌లోని (చిత్తోర్‌గఢ్, భిల్వారా, బూందీ, సవాయ్ మాధోపూర్, టోంక్, ఝలావర్, కోట, బరన్, ధోల్పూర్ జిల్లాలు), ఉత్తరప్రదేశ్‌లోని (ఇటావా జిల్లా) భాగాలను కలిగి ఉంది. దీర్ఘ చతురస్రాకారంలో ఉండే ఈ బేసిన్ మొత్తం 1,43,219



చదరపు కిలోమీటర్ల పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది.

ఇక్కడి భౌగోళిక పరిస్థితులు వైవిధ్యంగా ఉంటాయి. చంబల్ ఎగువ ప్రాంతం వింధ్య పర్వతాలలో, ఎడమ వైపు పరీవాహక ప్రాంతం ప్రధానంగా ఆరావళి పర్వతాలలో ఉండగా, కుడి వైపు పరీవాహక ప్రాంతం మాల్వా ట్రాప్ ప్రాంతంతో పాటు వింధ్య సూపర్ గ్రూప్‌కు చెందిన ఇసుకరాతి, క్వార్ట్జైట్ ప్రాంతాలను కలిగి ఉంది. ఈ ప్రాంతంలో వింధ్య ఇసుకరాతి పొరలు, లాటరైట్ కొండలు, బసాల్టిక్ కొండలు, నదీ గరక పొరలు వంటి వివిధ రకాల భూస్వరూపాలు కనిపిస్తాయి.

చంబల్ బేసిన్ మధ్య ప్లీస్టోసీన్ కాలం నాటి ముఖ్యమైన పురావస్తు ఆధారాలను అందించింది. ఇక్కడి రాతి చిత్రకళా కేంద్రాలు దిగువ, మధ్య, ఎగువ పాతరాతియుగం, మధ్యరాతియుగం, తామ్రశిలాయుగం, ప్రారంభ చారిత్రక కాలం వంటి వివిధ దశలకు విస్తరించి ఉన్నాయి.



ఈ ప్రాంతంలో మానవ ఉనికికి సంబంధించి లభించిన తొలి ఆనవాళ్లు అషులియన్ పనిముట్లు. వీటిలో గొడ్డళ్లు, చేతి గొడ్డళ్లు, చెక్కబడిన, చెక్కబడని రాతి పొరలు, స్క్రాపర్లు, కోర్స్, వాడి వదిలేసిన రాతి ముక్కలు ఉన్నాయి. ఈ బేసిన్‌లోని రాతి చిత్రకళలో 'కప్యూల్స్' (రాతిపై గుంటలు) కూడా ఉన్నాయి; వీటిలో అత్యంత పురాతనమైనవి దర్కీ లో లభించగా, చత్రేశ్వర్, కన్యాదేహ్ వద్ద పెట్రోగ్లిఫ్స్ (రాతిపై చెక్కడాలు) కనుగొన బడ్డాయి. భాన్పురా ప్రాంతం కూడా ఇటువంటి పెట్రోగ్లిఫ్స్ భారీ సేకరణను కలిగి ఉంది. అంతేగాకుండా, కోటా జిల్లాలోని చంద్రసెల్ వద్ద లభించిన నిప్పుకోడి గుడ్డు పెంకులపై చేసిన చెక్కడాలు సుమారు 40,000 సంవత్సరాల క్రితం నాటివని గుర్తించారు.

మధ్యరాతియుగంలో, ఈ బేసిన్‌లోని రాతి చిత్రకళా ఇతివృత్తాలు తరచుగా సాధారణ వేటగాళ్లు, సేకరణ దారుల జీవన దృశ్యాలను ప్రతిబింబించేవి. ఈ కాలం నాటి చిత్రాలలో జంతువుల శరీరాలను లూప్‌లు, వర్ల్స్, త్రిభుజాలు, ట్రాపెజీలు, చిక్కుడు వంటి నైరూప్య డిజైన్లతో అలంకరించారు.

కొన్ని చిత్రాలలో జంతువుల అంతర్గత అవయవాలు కనిపించేలా ఎక్స్-రే తరహా చిత్రణలు ఉండగా, వేట, నృత్యం, పిల్లల పెంపకం వంటి దైనందిన జీవిత దృశ్యాలు చాలా హుందాగా చిత్రీకరించబడ్డాయి. ద్వివర్ణ చిత్రలేఖనాలు మధ్యరాతియుగ రాతి చిత్రకళలో ఒక ముఖ్యమైన లక్షణం. ఈ కళాఖండాలలో ఎక్కువ భాగం నదులు, వాగులు, లోయలు లేదా సరస్సుల వంటి నీటి వనరులకు సమీపంలో ఉన్న రాతి కొండల గోడలపై, పైకప్పులపై కనిపిస్తాయి.

తామ్రశిలాయుగం నాటికి, చంబల్ బేసిన్ రాతి చిత్రకళలో పశుపోషణ, పశువుల మందల నిర్వహణ ప్రధాన ఇతివృత్తాలుగా మారాయి. ఈ కాలం నాటి చిత్రాలలో దాదాపు తొంభై శాతం వరకు మోపురం ఉన్న ఎద్దులు కనిపిస్తాయి, ఇది అప్పటి ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. పశువులను కేవలం రాతి చిత్రాల్లోనే కాకుండా టెర్రకోట బొమ్మలు, ముద్రలు, ముద్రికల రూపంలో కూడా చిత్రించారు.

తొలి తామ్రశిలాయుగ దశలోని చిత్రణ శైలిపై మధ్యరాతియుగ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్రాల కోసం ఎరుపు రంగు, దాని అనుబంధ రంగులను ఎక్కువగా ఉపయోగించారు. ఈ బేసిన్‌లో ఆహార్, కాయతా, మాల్వా వంటి సంస్కృతులకు చెందిన తామ్రశిలాయుగ స్థావరాలు విస్తృతంగా ఉన్నాయి. సా.శ.పూ. 3600-1500 కాలానికి చెందిన ఆహార్ సంస్కృతి ప్రజలే ఈ బేసిన్‌లో మొట్టమొదట స్థిరపడి, నివాసాలను ఏర్పాటు చేసుకున్నారని భావిస్తారు. వివిధ జిల్లాల్లో అనేక ఆహార్ సంస్కృతి స్థావరాలు బయటపడగా, ఆహార్, బాలథల్, గిలుంద్, ఓజియానా వంటి ప్రాంతాలలో జరిపిన త్రవ్వకాలు దీనిని ధృవీకరించాయి.

చంబల్ బేసిన్‌లో బృహత్ శిలాయుగ దశకు చెందిన రాతి చిత్రాల గురించి పెద్దగా సమాచారం అందుబాటులో లేదు. బూంది జిల్లాలోని సిలోర్ ప్రాంతంలో కప్పు గుర్తులు కలిగిన కొన్ని డోల్మెన్లు (రాతి సమాధులు) కనుగొనబడ్డాయి. అదనంగా, మధ్యప్రదేశ్‌లోని



రాజ్‌గఢ్ జిల్లాలో ఉన్న కోట్రా విహార్ వద్ద, డోల్మెన్ల పైకప్పు రాళ్లపై, రాతి వలయాల లోపల ఉన్న బండరాళ్లపై కూడా కప్పు గుర్తులు కనిపించాయి. భారతదేశంలో ఇటువంటి కప్పు గుర్తులు, ముఖ్యంగా కాలువలతో అనుసంధానించబడినట్లు కనిపించేవి చాలా అరుదైనవి, ప్రత్యేకమైనవి.

ప్రారంభ చారిత్రక కాలంలో రాతి చిత్రకళ సాధారణంగా శాశ్వత నీటి వనరులకు సమీపంలో ఉన్న ఒంటరి ప్రదేశాలలో కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో, ఈ ప్రాంతాల్లో పురాతన దేవాలయాల శిథిలాలు లేదా ఆ కాలపు చారిత్రక దిబ్బలు కూడా ఉన్నాయి. నేడు వీటిలో చాలా ప్రదేశాలలో శివుడు లేదా గ్రామ దేవతలకు అంకితం చేసిన దేవాలయాలు ఉన్నాయి. ఈ కాలం రాజ్యాల స్థాపన, వ్యవస్థీకృత మతాలు, లిపి వాడకం వంటి గణనీయమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులకు సాక్ష్యంగా నిలిచింది, ఇవన్నీ ఆ కాలపు రాతి చిత్రకళలో ప్రతిబింబిస్తాయి.



ఈ కాలం నాటి రాతి చిత్రకళ యుద్ధ వీరులు, యుద్ధ శరణార్థులు, ఉన్నత శ్రేణి వేటగాళ్లు లేదా స్థానిక గిరిజన తెగల పనిగా భావిస్తారు. వీరు యుద్ధాల సమయంలో లేదా వేట యాత్రల సమయంలో ఈ రాతి ఆశ్రయాలలో తాత్కాలికంగా ఆశ్రయం పొంది ఉండవచ్చు. కొన్ని చిత్రాలు స్థానిక గిరిజన ప్రజల సృజన కూడా అయి ఉండవచ్చు, ఎందుకంటే వారు నేటికీ ముఖ్యమైన సందర్భాలలో తమ ఇళ్ల గోడలపై ఇటువంటి చిత్రాలనే వేస్తుంటారు. ఈ రాతి చిత్రకళ ప్రధానంగా మతపరమైన ప్రాముఖ్యత కలిగిన చిహ్నాలు, డిజైన్లతో కూడి ఉంటుంది. ఉదాహరణకు యజ్ఞ గుండాలు, కలశాలు, స్వస్తిక్ గుర్తులు, త్రిరత్న, అల్పన నమూనాలు వంటివి. అదనంగా, ఈ కళలో రంగోలి నమూనాలు, మానవ రూపాలతో సహా స్థానిక సంప్రదాయాల ఇతివృత్తాలు కనిపిస్తాయి. తరువాతి దశలో, ఈ రాతి చిత్రకళలో గణేశుడు, రాముడు వంటి హిందూ దేవతల చిత్రణలు కూడా చేరాయి.

**అసాధారణ సార్వత్రిక విలువ సమర్థన:**

చంబల్ బేసిన్‌లోని రాతి చిత్రకళ వివిధ చారిత్రక కాలాల్లోని భిన్నమైన నాగరికతల ద్వారా రూపుదిద్దుకుంది. ఇది తొలి హోలోసీన్ కాలం నాటిది, ప్రారంభ వేటగాళ్లు, సేకరణదారుల కృషిని కలిగి ఉంది. ఈ తొలి కళాకారులకు 'బాగోర్ దశ-II' తో సంబంధం ఉంది, ఇక్కడ సుమారు 4,715 నుండి 4,060 సంవత్సరాల క్రితం నాటి సూక్ష్మ శిలలతో పాటు రాగి పనిముట్లు, కుండలు కనుగొనబడ్డాయి. ఆ తర్వాత, తామ్రశిలా యుగం, ప్రారంభ చారిత్రక కాలాలలో, తరువాతి తరం వేటగాళ్లు పశువుల కాపరులు, స్థిరపడిన రైతులతో సమకాలీనంగా ఈ రాతి చిత్రాలను సృష్టించారు.

ఈ బేసిన్‌లోని రాతి చిత్రకళలో మధ్యరాతియుగ వేటగాళ్లు-సేకరణదారులు, పూర్వ చారిత్రక తదితర కాలాల వారు గీసిన వేట, సేకరణ దృశ్యాలు ఉన్నాయి. సంచార పశుపోషణతో ముడిపడి ఉన్న ఈ చిత్రణలతో పాటు, ఆనాటి వ్యవస్థీకృత రాజకీయ వ్యవస్థలకు సంబంధించిన ఆనవాళ్లు కూడా ఇక్కడ కనిపిస్తాయి. ఈ రాతి చిత్రకళా సృష్టికర్తలలో పూర్వ చారిత్రక, తరువాతి దశల నాటి పశువుల కాపరులే కాకుండా, ధ్యానం, ఆరాధన కోసం ఈ రాతి ఆశ్రయాలను ఉపయోగించిన సన్యాసులు, సాధువులు, మహర్షులు కూడా ఉన్నారు.

కొన్ని రాతి చిత్రాలు యుద్ధ దృశ్యాలను, చక్కగా ప్రణాళికాబద్ధంగా సాగిన వేటను వర్ణిస్తాయి. దీనిని బట్టి కొన్ని రాతి ఆశ్రయాలు యుద్ధానికి వెళ్లే సైన్యాలకు లేదా రాజవంశపు వేటగాళ్లకు తాత్కాలిక శిబిరాలుగా ఉపయోగపడ్డాయని, వారు తమ ముఖ్యమైన జ్ఞాపకాలను ఇక్కడ చిత్రించారని తెలుస్తోంది. చంబల్ బేసిన్‌లోని భీమ్లత్ మహాదేవ్, చతుర్భుజ నాథ్ నాలా, గరాడియా మహాదేవ్, బుక్కీ మాతా, చత్తేశ్వర్, కన్యాదేహ్, నర్సింగ్‌గఢ్, కోట్రా విహార్, జోగ్నియా మాతా, గేపర్నాథ్ వంటి అనేక ప్రదేశాలు మతపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అంతేగాకుండా, ప్రస్తుతం సంచార గొర్రెల కాపరులు, ఒంటెల కాపరులైన 'రబారీలు', 'మార్వారీలు' వలస వెళ్లే మార్గం కూడా ఈ చంబల్ బేసిన్ గుండానే ఉంది.

**ప్రమాణం (iii):** చంబల్ లోయ ప్రాంతానికి చెందిన పురావస్తు సాంస్కృతిక భూస్వరూపం, అషులియన్, దిగువ, మధ్య,







ఎగువ పాతరాతియుగం, మధ్యరాతియుగం, తామ్రశిలాయుగం, ప్రారంభ చారిత్రక కాలాల నాగరికతలకు ఒక అసాధారణ నిదర్శనంగా నిలుస్తుంది.

**ప్రమాణం (iv):** ఈ ప్రాంతంలోని రాతి చిత్రకళ ప్రధానంగా ఆయా కాలాల్లోని ప్రజల విశిష్ట జీవనశైలికి సంబంధించిన చిత్రణలను కలిగి ఉంది. మధ్యరాతియుగంలో చిత్రాల ఇతివృత్తం వేట, ఆహార సేకరణ, చేపల వేటకు సంబంధించి ఉంది. తామ్రశిలాయుగం ప్రధానంగా పశువుల ఇతివృత్తంపై దృష్టి సారిస్తుంది. చారిత్రక, మధ్యయుగ కాలాలలో ఒక మార్పు వచ్చింది, దీనివల్ల చిత్రాల ఇతివృత్తం మత కేంద్రంగా మారింది.

చంబల్ బేసిన్ ప్రస్తుతం రబారీలు, మార్వాడీల వంటి పాక్షిక-సంచార పశుపోషక వర్గాల వలస మార్గాలలో ఉంది. ఈ వర్గాల వారు తమ పశువులకు తగిన మేత, నీటి వనరుల కోసం ఏటా వేసవి కాలంలో ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. అంతేగాకుండా, ఈ ప్రాంతంలోని కొన్ని భాగాలు పశ్చిమ భారతానికి చెందిన పశు పోషక వర్గమైన గుజ్జర్లు, అలాగే భిల్లులు, సహారియాలు, మీనాల వంటి వివిధ తెగలకు చెందిన ఆవులు, గేదెలు, గొర్రెలు మేకలకు నిలయంగా ఉన్నాయి. దీనిని బట్టి, చంబల్ బేసిన్ రాతి చిత్రకళలో కనిపించే పశుపోషణ దృశ్యాలు బహుశా పూర్వ చారిత్రక దశకు చెందిన సంచార పశుపోషకుల పని అయి ఉండవచ్చని ఊహించవచ్చు; వీరు తమ పశువులను మేపడానికి క్రమం తప్పకుండా ఈ బేసిన్‌ను సందర్శించేవారు.



ఇటీవలి కాలంలో జనాభా విస్ఫోటనం కారణంగా రాతి చిత్రకళా కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో మానవ కార్య కలాపాలు పెరిగాయి. ఇది ఈ విలువైన ప్రదేశాలకు ముప్పుగా మారింది. రాతి ఆశ్రయాలను విపరీతంగా తవ్వడం, ఆయా ప్రాంతాల్లో అడవుల నరికివేత వంటి మానవ సంబంధిత అంశాలు ఈ ప్రదేశాలు దెబ్బ తినడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా, ఇసుకరాతి తవ్వకాల వల్ల గాంధీ సాగర్ డ్యామ్ నీటిలో అనేక చిత్రకళా పలకలు మునిగిపోయాయి; అలాగే బూందీ, బరన్, భిల్వారా, కోటాలోని కొన్ని ప్రదేశాలు విస్తృతంగా ధ్వంసమయ్యాయి. చిన్న వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం కూడా కొన్ని రాతి చిత్రకళా కేంద్రాల విధ్వంసానికి ప్రత్యక్ష కారణమైంది. ప్రస్తుతం, కేవలం చతుర్భుజనాథ్ నాలా మాత్రమే భారత పురావస్తు శాఖ ద్వారా పాక్షికంగా రక్షించబడుతోంది.

**ఇదే విధమైన ఇతర స్థలాలతో పోలికలు:**

**1. గోబుస్తాన్ రాతి చిత్రకళా సాంస్కృతిక దృశ్యం:**

గోబుస్తాన్ రాతి చిత్రకళా సాంస్కృతిక దృశ్యం, ప్రమాణం (iii)ని సంతృప్తి పరచడం ద్వారా యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఈ ప్రదేశంలో ఒకప్పుడు మనుషులు నివసించిన గుహలు, పురా తన స్థావరాల అవశేషాలు, సమాధి దిబ్బలు ఉన్నాయి. ఈ పురావస్తు ఆధారాలు ఎగువ పాత రాతియుగం నుండి మధ్యయుగం వరకు, ముఖ్యంగా చివరి మంచు యుగం తర్వాత కురిసిన భారీ వర్షాల కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన విస్తృతమైన మానవ కార్యకలాపాలను మనకు పరిచయం చేస్తాయి.

**2. భీమ్‌బేట్కా రాతి ఆశ్రయాలు:**

మధ్య భారతదేశంలోని వింధ్య పర్వత శ్రేణి అడుగుభాగంలో ఉన్న భీమ్‌బేట్కా రాతి ఆశ్రయాలు సహజసిద్ధ గుహల సమూహం. భీమ్‌బేట్కా ప్రదేశంలో మొత్తం 243 ఆశ్రయాలు ఉండగా, వాటిలో 133 రాతి చిత్రాలను కలిగి ఉన్నాయి. ప్రమాణం (iii), (iv) కింద ఈ ఆశ్రయాలకు 2003లో యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది.

**3. తద్రార్ట్ అకాకస్ రాతి చిత్రకళా కేంద్రాలు:**

తద్రార్ట్ అకాకస్ అనేది పశ్చిమ లిబియా ఎడారి ప్రాంతంలోని ఘాట్ జిల్లాలో ఉన్న ఒక పర్వత శ్రేణి. ఇక్కడి చిత్రలేఖనాలు, చెక్కడాల ప్రాముఖ్యతను గుర్తించి, 1985లో యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. సా.శ.పూ. 12,000 నుండి సా.శ. 100 కాలానికి చెందిన ఈ కళాఖండాలు ఆ ప్రాంతంలో సంభవించిన సాంస్కృతిక, సహజ మార్పుల గురించి







లోతైన అవగాహనను కల్పిస్తాయి.

### 4. కొండోవా రాతి చిత్రకళా కేంద్రాలు:

కొండోవా రాతి చిత్రకళా కేంద్రాలు మధ్య టాంజానియాలోని రాతి ఆశ్రయాల గోడలపై ఉన్న పురాతన చిత్రలేఖనాలను కలిగి ఉన్నాయి. ఈ చిత్రాలు వేటగాళ్లు-సేకరణదారులు, వ్యవసాయ-పశుపోషక వర్గాల జీవన విధానాలను వర్ణిస్తూ, గత రెండు సహస్రాబ్దాలుగా మారుతున్న జీవనశైలిని వివరిస్తాయి. ప్రమాణం (iii), (vi) కింద 2006లో ఈ ప్రదేశం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

### 5. హిమా సాంస్కృతిక ప్రాంతం:



సౌదీ అరేబియా నైరుతి ప్రాంతంలోని నజ్రాన్ ప్రావిన్స్‌లో ఉన్న హిమా సాంస్కృతిక ప్రాంతం, పెట్రోగ్లిఫ్స్ (రాతిపై చెక్కిన చిత్రాలు), పురాతన శాసనాల భారీ సేకరణను కలిగి ఉంది. నవీన శిలాయుగం నుండి ఇస్లాం పూర్వ కాలం వరకు వేల సంవత్సరాల కాలంలో ఈ రాతి చిత్రాలు సృష్టించబడ్డాయి. ప్రమాణం (iii) కింద 2021లో యునెస్కో ఈ ప్రదేశాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.

బాక్స్ ఐటమ్స్

చంబల్ లోయ ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో రాతి చిత్రాలు కలిగిన ప్రాంతాలలో ఒకటిగా పేరుగాంచింది. ఇక్కడ పాత రాతియుగం నుండి మధ్యయుగం వరకు వివిధ కాలాలకు చెందిన చిత్రాలు కనిపిస్తాయి.

### చంబల్ లోయలోని పాత రాతియుగం నాటి చిత్రాల ప్రధాన విశేషాలు:

#### 1. పురాతన ఆధారాలు, కాలం

- **కాల నిర్ణయం:** చంబల్ లోయలోని అత్యంత పాత చిత్రాలు ఎగువ పాత రాతియుగం నాటివి, ఇవి సుమారు 40,000 సంవత్సరాల క్రితం నాటివని అంచనా.
- **ముఖ్య ప్రదేశాలు:** మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దుల్లోని చతుర్భుజనాథ్ నాలా, దరకీ-చట్టాన్, పహాడ్‌గఢ్ వంటి ప్రాంతాల్లో ఈ చిత్రాలు అధికంగా ఉన్నాయి.
- **ప్రపంచ గుర్తింపు:** ఇక్కడ దొరికిన కొన్ని శిలా చిత్రాలు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనవిగా భావిస్తారు.

#### 2. చిత్రకళా శైలి, రంగులు

- **రంగులు:** ఆదిమానవులు ప్రధానంగా ముదురు ఎరుపు, ఆకుపచ్చ రంగులను ఉపయోగించేవారు. ఈ రంగులను హెమటైట్ (ఎరుపు), చాల్సెడోనీ (ఆకుపచ్చ) వంటి ఖనిజాలను పొడి చేసి, నీరు లేదా జంతువుల కొవ్వుతో కలిపి తయారుచేసేవారు.
- **రేఖీయ చిత్రాలు:** పాత రాతియుగం నాటి చిత్రాలు ఎక్కువగా సరళ రేఖలతో కూడి ఉండి, జంతువుల భారీ ఆకృతులను వర్ణిస్తాయి.

#### 3. చిత్రించిన అంశాలు

**వన్యప్రాణులు:** ఆనాటి చిత్రాల్లో ఏనుగులు, ఖడ్గమృగాలు, పులులు, అడవి పందులు, దుప్పులు వంటి పెద్ద జంతువుల చిత్రాలు ప్రముఖంగా కనిపిస్తాయి.

- **మానవ రూపాలు:** మానవులను ఎక్కువగా స్టిక్-ఫిగర్స్ లాగా గీసేవారు. వేటగాళ్లను ఎరుపు రంగులో, నృత్యం చేసేవారిని ఆకుపచ్చ రంగులో చిత్రీకరించడం ఒక ప్రత్యేకత.
- **నిప్పుకోడి గుడ్లు:** కోట (రాజస్థాన్) సమీపంలోని చంద్రాసెల్ వద్ద సుమారు 40,000 ఏళ్ల క్రితం నాటి చెక్కబడిన నిప్పుకోడి గుడ్డు పెంకులు లభించాయి, ఇవి ఆ కాలపు కళాత్మక అభివృద్ధికి నిదర్శనం.

#### 4. దరకీ-చట్టాన్ ప్రత్యేకత

మధ్యప్రదేశ్‌లోని దరకీ-చట్టాన్ గుహల్లో దాదాపు 500కు పైగా కప్యూల్స్ (గుంతల వంటి గుర్తులు) ఉన్నాయి. ఇవి రెండు మిలియన్ సంవత్సరాల నాటివి కావచ్చని పరిశోధకుల అంచనా, ఇది మానవ పరిణామ క్రమంలో అత్యంత ప్రాచీనమైన కళా రూపంగా పరిగణించబడుతుంది.

చంబల్ బేసిన్‌లోని ఈ చిత్రాలు అప్పటి మానవుల సామాజిక జీవనం, వేట నైపుణ్యాలు, వారి ఆధ్యాత్మిక విశ్వాసాలను ప్రతిబింబిస్తాయి.

- అనువాదం: ఎస్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com

# పిల్లలమఱ్ఱి దేవాలయం - ప్రత్యేకతలు



ఎరుకేశ్వర స్వామి దేవాలయం

బాదామి చాళుక్యులు కళ్యాణిని రాజధానిగా చేసుకొని పరిపాలించడం వలన వారిని కళ్యాణి చాళక్యులు అని కూడా పిలుస్తారు. చాళుక్య రాజులైన సోమేశ్వర 1 మరియు సోమేశ్వర 2 కాలంలో రాజ్యాన్ని విస్తరింపజేశారు. వారి కాలంలో ఎంతో మంది సామంత రాజులను ఏర్పాటు చేశారు. ఆ నేపథ్యంలో తెలంగాణ వరంగల్ ప్రాంతం నందు కాకతీయులను సామంత రాజులుగా ఏర్పాటు చేశారు. కాలగమనంలో కాకతీయులు స్వతంత్రులుగా వ్యవహరించి కాకతీయ సామ్రాజ్యమును ఏర్పాటు చేయడమే గాక రాజ్యాన్ని విస్తరింపజేశారు. ప్రత్యేకించి రుద్రదేవుని కాలమందు మరియు గణపతి దేవుని కాలమందు దేవాలయంలు, కోటలు మరియు చెరువులు నిర్మించారు. రాణి రుద్రమదేవి మరియు ప్రతాపరుద్రుడు వారి పూర్వీకులు వారసత్వ సంపదను కాపాడడమే గాక అభివృద్ధికి పాలుపంచుకున్నారు. రేచర్ల వంశపు నాయకులు వెలమ వంశపు నాయకులు కొప్పుల వంశపు నాయకులు మరియు స్థానిక రెడ్డి నాయకులు కాకతీయ రాజులకు ఎంతగానో సహకారం అందించారు. వీరు రాజుకు విధేయులుగా ఉండడమే గాక గ్రామాలపై అధికారం మరియు యుద్ధ సమయములో సైన్య సహాయం అందించేవారు. కాకతీయ రాజుల కాలంలో ఎన్నో దేవాలయంలో నిర్మించారు. అందులోనూ ప్రత్యేకించి త్రికూట దేవాలయంలో నిర్మించారు. ఆ నేపద్యంలో పిల్లలమఱ్ఱి గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించబడిన దేవాలయంల కొన్ని (6) ప్రత్యేకతలను గురించి తెలుసుకుందాం.

**మొదటి ప్రత్యేకత - మహిళా సాధికారత:**

కాకతీయ రాజైన గణపతి దేవుడు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. వారి కాలంలోనే ప్రథమంగా మహిళలు సైతం ఆలయాలు నిర్మించి చరిత్రలో స్థానాన్ని సంపాదించారు. పిల్లలమఱ్ఱి నందలి ఎరుకేశ్వర దేవాలయంను రేచర్ల బేతి రెడ్డి గారి భార్యయైన ఎరుకసాని నిర్మించినట్టుగా పిల్లలమఱ్ఱి శాసనం తెలుపుతున్నది. ఈ దేవాలయమును 1208c.e.లో నిర్మించినట్టుగా తెలుస్తున్నది. ఆ తర్వాత కాలంలో 1219c.e.లో కాకతీయ రాజు గణపతి దేవుని సోదరి శ్రీమతి కుందమాంబ గారు నిడికొండ నందు త్రికూట దేవాలయమును నిర్మించారు.

గణపతి దేవుని కుమార్తె రుద్రమదేవిని రాణిగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసినదే. దేవాలయ నిర్మాణాలలో సైతం మహిళా సాధికారతను ప్రప్రథమంగా పిల్లలమఱ్ఱి గ్రామంలో గమనించవచ్చు.

**పిల్లలమఱ్ఱి దేవాలయముల రెండవ ప్రత్యేకత సంస్థానాధీశుల దేవాలయ నిర్మాణం**

మూడు ఆలయాలు ఒకే వేదిక కింద నిర్మించడం వల్ల త్రికూట దేవాలయంగా పిలుస్తారు. ప్రప్రథమముగా రాజు సంబంధికుడైన రుద్ర దేవుడు హనుమకొండ నందు త్రికూట దేవాలయమును నిర్మించాడు. దీని నిర్మాణం1163-1168c.e.లో జరిగినట్టు



కక్ష్యాసనం - త్రికూట దేవాలయం



త్రికూట దేవాలయములోని నంది



ఆరు అడుగుల అధిష్టానం-ఎరుకేశ్వరాలయం

చరిత్రకారులు చెబుతారు. అయితే పిల్లలమర్రి త్రికూట దేవాలయమును కాకతీయ రాజైన రుద్ర దేవుని కాలంలో సంస్థానాధీశు డు (పాలెగాళ్లు) రేచర్ల వంశస్థుడు అయిన నామి రెడ్డి గారు త్రికుట దేవాలయమును నిర్మించి తన తండ్రి పేరున కామేశ్వరి లింగమును, తన తల్లి పేరున కాచేశ్వర లింగమును, మరియు తన పేరున నామేశ్వర లింగమును ప్రతిష్ట చేయడం జరిగినది. ఈ త్రికూట దేవాలయమును రేచర్ల నామిరెడ్డి నిర్మించినట్లు దేవాలయము నందలి శాసనంల ద్వారా తెలుస్తున్నది. రాజు కాకుండా సంస్థానాదిశు లు రాజు పేరు మీద నిర్మించడం మరొక ప్రత్యేకత. కొందరు దేవాలయంలోని మూడు లింగములను రుద్రేశ్వరుడు, పోలేశ్వరుడు మరియు పార్వతీశ్వరుడు అని కూడా పిలుస్తారు.

**మూడవ ప్రత్యేకత- త్రికూట శివాలయములు:**

కాకతీయ కాలంలో, 1195వ సంవత్సరంలో ప్రథమంగా నిర్మించబడ్డ శైవ త్రికూట ఆలయములను పిల్లలమర్రి గ్రామంలో గమనించవచ్చు. 1163-1168c.e.లో రుద్రదేవుడు ముందుగా హనుమకొండ నందు త్రికూట ఆలయంలో నిర్మించినప్పటికీ అవి సంపూర్ణంగా శివాలయములు కాదు. అవి శివ, విష్ణు మరియు సూర్య దేవాలయములకు సంబంధించినవి. వీటిని, 1163-1168లో నిర్మించారు. అయితే ప్రథమంగా, పిల్లలమర్రిలో నిర్మించబడ్డ మూడు శివాలయంల త్రికూట దేవాలయము ఇక్కడ ప్రత్యేకత.

**నాలుగవ ప్రత్యేకత - నంది:**

త్రిపుట గర్భ గృహాలు తూర్పుముఖంగాను ఉత్తర ముఖంగాను మరియు దక్షిణముఖంగాను నిర్మితమై ఉన్నాయి. అయితే ఈ మూడింటికి ఒకే ఒక నందిని ప్రతిష్ట చేయడం జరిగింది. నంది ఒక కన్ను దక్షిణ దిక్కుగా చూస్తున్నట్టుగా కనిపిస్తుంది. అదేవిధంగా మరొక కన్ను తూర్పు ఉత్తరం శివలింగాలను వైపు చూస్తున్నట్టుగాను మరియు అలంకారములతో నందిని నిర్మించడం జరిగినది. మూడు దిక్కులు చూసే నందిని త్రికుటాలయంలో నిర్మించడం ఒక ప్రత్యేకత



ఎరుకేశ్వర లింగం, గర్భగృహ ద్వారం అందాలు. ద్వారంపైన వాయిద్యములతో కాకతీయుల నాటి స్త్రీ మూర్తులు

**ఐదవ ప్రత్యేకత- అధిష్టానం:**

పునాది పైన నిర్మాణము నేలను సైతం వేరు చేస్తూ కట్టబడినటువంటి దాన్ని అధిష్టానం లేదా జేస్మెంట్ అని అంటారు. దేవాలయం నందు ఈ పీఠ నిర్మాణము ఉపపీఠం, అధిష్టానం, కుముదం మరియు కపోటంలను కలిగియుంటుంది. పిల్లలమర్రి ఎరుకేశ్వర దేవాలయం నందు అధిష్టానం యొక్క ఎత్తు రమారమి ఆరడుగులు. బహుశా ఈ అధిష్టానమే రామప్ప దేవాలయమునకు మార్గదర్శి అయింది అనుటలో ఆశ్చర్యము లేదు. ఎరుకేశ్వర దేవాలయం 1203-1208లో నిర్మించగా, రామప్ప దేవాలయం 1212-1234ceలో నిర్మించబడినట్లు చరిత్రకారులు చెబుతారు.

**ఆరవ ప్రత్యేకత-బావి:** 800 సంవత్సరాల క్రిందట నిర్మితమై ఉన్న బావిని ఎరుకేశ్వర దేవాలయంలో ఇప్పటికీ గమనించవచ్చు. జన్మస్థలమునే ఇంటి పేరుగా మార్చుకున్న మహాకవి పినవీరభద్రుడు పిల్లలమర్రి గ్రామస్తుడే. ఇతను రచించిన జెమినీ భారతం మరియు శృంగార శాకుంతలం మహాకవుల మన్ననలను పొందింది. 1480 సంవత్సరం నాటివాడైన పిల్లలమర్రి పినవీరభద్రుడు సాల్వ నరసింహారాయులకు తన రచనను అంకితం ఇచ్చినాడని తెలుస్తుంది. ఒకప్పటి సబ్బసముద్రం లేదా పిల్లలమర్రిచెరు సమీపమున ఒకే ప్రహరీలో ఉన్న త్రికూట దేవాలయం నామేశ్వర దేవాలయంను మరియు తెలంగాణలో మహిళా సాధికారత కలిగిన (ప్రథమ) ఎరుకేశ్వర దేవాలయములను పరిరక్షించాలని చరిత్రకారులు కోరుతున్నారు. అలాగే అద్భుత శిల్ప సంపదతో కళకళలాడుతున్న ఈ దేవాలయములను చారిత్రాత్మకంగానే గాక పర్యాటక రంగం నందు సైతం అభివృద్ధి చేయాలని ముక్తకంఠముతో ప్రజలందరూ కోరుకుంటున్నారు.

**- డా॥ జి.యస్.రామయ్య**
INTACH సభ్యులు -
కర్నూలు జిల్లా చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

ద



శ్రీలంక మల్లేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన ఉన్న జలపాతం



లంకమల అభయారణ్యములోని వేణుగోపాల స్వామి దేవాలయము

# శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో జీవవైవిధ్యం

**జీవవైవిధ్యం:** జీవవైవిధ్య మంటే ఈ భూగ్రహంపై జీవ మండలంలో మనతోపాటు నివసిస్తున్న అన్ని రకాల జీవులు, వివిధ రూపాల్లో ఉన్న జన్యు సంపద.

**ప్రజాతి:** నిర్దిష్ట సమూహానికి చెంది, తమలో తాము సంపర్కము పెట్టుకోగలిగి, మిగతా అన్ని జీవాలకు పునరుత్పత్తిలో భిన్నంగా ఉండే జీవ సముదాయాన్ని 'ప్రజాతి' అంటారు.

భూమి మీద నివసించే జీవకోటి సంక్షేమము కొనసాగించడానికి జీవ వైవిధ్యము అత్యంత అవసరం. ప్రజాతులు ఎంత ఎక్కువగా ఉంటే, జీవ మండలానికి జీవావరణ వ్యవస్థలకి స్థితిస్థాపకత అంత ఎక్కువ. వైవిధ్యం ఎంత ఎక్కువ ఉంటే సహజ వనరుల ఎంపికకు అంత ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

ప్రపంచ భూ ఉపరితల వైశాల్యంలో 2% మాత్రమే భారతదేశం ఆక్రమించి ఉంది. కానీ ప్రపంచ జీవ వైవిధ్యంలో 5% భారతదేశంలోనే ఉంది. ప్రపంచ స్థాయిలో జీవ వైవిధ్యానికి అతి ముఖ్యమైన నెలవులుగా పేర్కొనదగ్గ ప్రాంతాలలో రెండు భారతదేశంలో ఉన్నాయి. అవి పశ్చిమ కనుమలు, తూర్పు హిమాలయాలు.

ఆంధ్రప్రదేశ్ భారత జీవసంపదకి అద్దం పడుతుంది. ఇటు పశ్చిమ కనుమల సమూహము, అటు బంగాళాఖాత తీరము మధ్య ఉండడం ద్వారా ఆంధ్రప్రదేశ్ వివిధ రకాల వృక్ష సంపదలతో విలసిల్లుతోంది. అరుదైన వృక్షజాతులైన ఎర్రచందనం, తెల్ల రక్కాయి, మంచి మాయిది, జలరి, నల్లదమ్మర మొదలైనవి రాష్ట్రంలో ఉన్నాయి. అలాగే కలివికోటి, బంగారు బల్లి, బట్టమేక పక్షి వంటి అరుదైన జంతు జాతులు ఉన్నాయి.

విశాలమైన ఈ భూ ప్రపంచంలో కొన్ని ప్రదేశాలు, కొన్ని రకాలుగా ప్రసిద్ధి చెంది ఉంటాయి. అటువంటి వాటిలో కడప జిల్లాలోని శ్రీలంక మల్లేశ్వర అభయారణ్యము ఒకటి. ఏడుకొండల స్వామికి నెలవైన తిరుమల తిరుపతి పట్టణాలకు గడపగా నిలిచిన కడప జిల్లాలో ప్రకృతి వరప్రసాదముగా విలసిల్లుతున్న వన్యమృగ అభయారణ్యము శ్రీలంక మల్లేశ్వర అభయారణ్యం. ప్రపంచంలోనే పూర్తిగా అంతరించిపోయిందనుకున్న వన్యప్రాణి కలివికోడి ఈ అభయారణ్యములో నివసిస్తూ ఉండటం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. లంకమల అభయారణ్యములోని అడవులు సుప్రసిద్ధమైన జీవ వైవిధ్యానికి నిలయాలు. ఈ అడవులు ఎర్రచందనానికి ప్రసిద్ధి చెందినవి.

**లంకమల అభయారణ్యములోని అడవులు సుప్రసిద్ధమైన జీవవైవిధ్యానికి నిలయాలు.**

లంకమల అభయారణ్యం కడప జిల్లాలోని కడప, చెన్నూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, బద్వేలు, సిద్ధవటం, అట్లూరు అనే ఏడు మండలాల పరిధిలో విస్తరించి ఉన్నది. లంకమల అభయారణ్యం 464.42 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నది.






*శ్రీలంకమల అభయారణ్యంలో వెలసిల్లిన శ్రీలంక మల్లేశ్వర స్వామి దేవాలయము*

రాయలసీమలోనే జీవ వైవిధ్యపరంగా కడప జిల్లాలో విస్తరించి ఉన్న శ్రీలంకమల అభయారణ్యము ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది.

లంకమల అభయారణ్యంలో ఎత్తైన కొండలు, రకరకాల మహావృక్షాలు, అక్కడక్కడ ప్రవహించే సెలయేరులు, వర్షాకాలంలో కొండలపై నుండి జాలువారే జలపాతాలు చేసే సవ్వడులు, పక్షుల కిలకిల రావాలు సందర్శకులకు ఎంతో ఆహ్లాదాన్ని, కనువిందును కలిగిస్తాయి.

### జీవావరణ సంబంధమైన విలువలు

ఆవరణ వ్యవస్థలో ప్రతి జీవికి ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. అనేక ప్రజాతుల జీవులు ఒకదానిపై ఒకటి అనేక విధాలుగా ఆధారపడి జీవిస్తాయి. అందువల్ల ఏ ఒక్క ప్రజాతి అంతరించినా దాని ప్రభావము ఇతర ప్రజాతులపై పడుతుంది. కొన్ని ప్రాణులు ఇతర ప్రాణుల ఆవాసంలో నివసించడానికి అనువైన పరిస్థితులను కలగజేయడంలో సహాయపడతాయి. ఉదాహరణకు ఒక చెట్టు ఆర్థిక విలువ కలిగి ఉన్న ఉత్పత్తులను అందించడమే కాకుండా అనేక ఇతర ప్రాణులకు నివాసముగా ఉంటుంది. అంతేకాకుండా నీటిని, భూసారాన్ని పరిరక్షించడంలోనూ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇటువంటి పాత్రలకు వెలకట్టలేము. కొన్ని సమయాల్లో ఒక జాతి ఏ విధమైన పాత్ర నిర్వహిస్తుందో తెలుసుకోవడం కూడా కష్టమే.

### సాంప్రదాయక విలువ

ఆంధ్రప్రదేశ్‌లో 1996లో 800 పైగా పవిత్ర రక్షిత వనాలు నమోదు చేయబడ్డాయి. శ్రీ లంకమల అభయారణ్యములో ఉన్న శ్రీలంక మల్లేశ్వర స్వామి దేవాలయము, నిత్య పూజ స్వామి దేవాలయము, వేణుగోపాల స్వామి దేవాలయము ప్రాంతాలను ఒక ప్రత్యేకమైన ఆవాస ప్రాంతముగా ప్రజలు భావించి ఆ ప్రాంతాన్ని సంరక్షిస్తున్నారు. ఇటువంటి రక్షణ పొందడం వల్ల ఈ పవిత్ర రక్షిత వనాలలో జీవవైవిధ్యము ఎక్కువగా ఉంది.

లంకమల అభయారణ్యము వివిధ రకాలైన వృక్ష జాతులకు నిలయం.

### వృక్ష సంపద

ఎర్రచందనం, చందనం, నల్ల మద్ది, తెల్ల మద్ది, కరక, నేరేడు, అడవి మామిడి, చిరుమాను, వేప, వెదురు, ఈత, ఏగిన బండారు, జిట్రేగి, అశ్వగంధ, పొడపత్రి, ఏపి, ఉసిరి, తాండ్ర వంటి అమూల్యమైన ఔషధ మొక్కలు.

ప్రపంచంలోనే అత్యంత విలువైన కలప రాజము ఎర్ర చందనము ఈ అభయారణ్యంలో ఉండటము ఒక విశేషము.

### జంతు సంపద

అంతరించుచున్న కలివికోడి, మూషిక జింక, గడ్డి జింక, కొండ గొర్రె, చిరుత గాలి, రేసు కుక్క, పునుగు పిల్లి, నక్క, ముళ్ళ పంది, ఏనుబోతు, అడవి పంది తదితరలకు నెలవు.

### తీర్థాలు

ఈ అభయారణ్యములో శ్రీలంక మల్లేశ్వర దేవాలయంతో పాటు నిత్య పూజ స్వామి దేవాలయము, గోపాల స్వామి దేవాలయము, కైలాసకోన, వనేశ్వరము, కుంకుమ గుండము, పసుపు గుండం ఉన్నాయి. అడవులలోని పవిత్ర రక్షిత వనాలను ఒక ప్రత్యేకమైన దైవముగా ప్రజలు భావించి ఆ ప్రాంతాన్ని సంరక్షిస్తున్నారు. అందువల్ల ఈ పవిత్ర రక్షిత వనాలలో జీవవైవిధ్యము ఎక్కువగా ఉంటుంది.

కార్తీక మాసంలో ప్రతి సోమవారము మరియు శివరాత్రి పర్వదినాల రోజులలో లంకమల అభయారణ్యములోని శ్రీ లంక మల్లేశ్వర దేవాలయము, నిత్య పూజ స్వామి దేవాలయము, వేణుగోపాల స్వామి దేవాలయము పరిసర ప్రాంతాలలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అక్కడి జలపాతాలలో స్నానమాచరించి పూజలు నిర్వహించడం పరిపాటి. ఈ పర్వదినాల్లో అభయారణ్యములోని దేవాలయాలన్నీ భక్తుల శివనామస్మరణతో మారు మ్రోగుతాయి.

**జెర్డాన్ కోర్సర్ (కలివి కోడి)**

కలివి కోడిని మొదట 1848లో జెసి జెర్డాన్ కనుగొన్నారు. 1900 సంవత్సరంలో పెన్నా నది మరియు గోదావరి పరివాహక ప్రాంతాలలో చూశారు. 1985 జనవరి 15న కడప జిల్లా అట్లూరు మండలం, రెడ్డిపల్లి గ్రామ సమీపాన దబ్బుగొడ్డ చిన్న ఐతన్న కనుగొన్నాడు. 1990లో హెూవార్ట్ క్యాంప్ బెల్ అనే శాస్త్రవేత్త పెన్నా నది పరివాహక ప్రాంతాలలోని అడవిలో కలివికోడిని చివరిసారిగా చూసినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ప్రేమికుల మదిలో ఆనంద సరాగాలను మీటిన ఆ పక్షి పేరు కలివికోడి దీనిని శాస్త్రీయంగా 'జెర్డాన్ కోర్సర్' అని పిలుస్తారు. దీని శాస్త్రీయ నామము "Rhinoptilas bitorquatus" పొడుగాటి కాళ్ళతో కముజు పిట్ట కన్నా కాస్త పెద్దదిగా, దివ్యాభరణాలు ధరించినట్లు ఒంటిపై రెండు అందమైన చారలతో ఉంటుంది. 1988లో ప్రభుత్వము లంకమల అటవీ ప్రాంతాన్ని లంకమల అభయారణ్యంగా గుర్తించడం జరిగింది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కలిసి ఈ పక్షి కదలికను, ఆవాస ప్రాంతాన్ని కనుగొనేందుకు పరిశోధనలు జరుపుచున్నారు. పక్షి కదలికలను దాని ఆవాస ప్రాంతాన్ని సీసీటీవీల ద్వారా మరియు పక్షి చేసే ధ్వనులను గుర్తించే పరికరాలను అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. నేలపై ఇసుకను పరిచి ఒక ట్రాక్ తయారు చేసి పక్షి సంచరించే సమయంలో దాని కాలి అడుగులను గుర్తించే ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. కలివి కోడి ముఖ్యముగా ముళ్ల పొదలతో కూడిన పచ్చిక మైదానాలలో కనిపిస్తుంది. కానీ ఇది దట్టమైన అడవుల్లోనూ మరియు మైదానంలో కనిపించదు. కలివికోడి ముఖ్యముగా సూర్యాస్తమయం అయిన 45,50 నిమిషాల తర్వాత కూస్తుంది. ఈ కూత వ్యవధి ఒక నిమిషము నుండి సుమారు 20 నిమిషాల వరకు ఉంటుంది. ఈ కూత నిమిషానికి 2 నుండి 16 పిలుపుల వరకు ఉంటుంది.



లంకముల అభయారణ్యంలో సంచరిస్తున్న అరుదైన పక్షి కలివి కోడి

జంతువులు, పక్షులు అంతరించిపోవడం పై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతుంది.. 15589 రకాల ప్రాణులు అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నాయి. భారీ తిమింగలం నుంచి అతి చిన్న కప్ప వరకు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదానికి చేరువలో ఉన్నాయి. అడవులు అంతరించిపోవడం, కాలుష్యము, ఓజోన్ పొర పలుచబడిపోయి భూమండలం మీద వేడి పెరగడం తదితర కారణాలవల్ల కొన్ని ప్రాణులకు ప్రాణులే ప్రమాదంలో పడిపోయాయి. భూగోళము క్రమంగా అనేక మార్పులకు లోనవుతుంది. క్రమబద్ధంగా జరిగే మార్పులను ప్రాణులు తట్టుకోగలవు. కానీ ఆకస్మికంగా వచ్చే మార్పులు జీవజాలంపై తీవ్ర ప్రభావము చూపుతున్నాయి. ఈ అసహజ మార్పులకు ప్రధాన కారణము మనిషే. ఒక శతాబ్ద కాలముగా మనిషి ప్రకృతికి చేస్తున్న ద్రోహం కారణంగా ప్రాణులు అంతరించిపోతున్నాయి. మనుషులు నరికి వేసిన, కాలిపోయిన అడవులు తిరిగి యధాస్థితికి రావడానికి కొన్ని శతాబ్దాలు పట్టవచ్చు. అడవులు ఇంతే వేగంగా అంతరించిపోతే జంతుజాతులు కనుమరుగైపోతాయి. ప్రస్తుతం మనము ఎదుర్కొంటున్న అతివృష్టి, అనావృష్టి, అధిక గ్రీష్మ తాపము, పర్వత ప్రాంతాల్లో మేఘ విస్ఫోటనం లాంటి మొదలైన విపత్తులకు కారణమేమిటని పరిశీలిస్తే మనుషులు చేస్తున్న పర్యావరణ విఘాతమే అని ప్రస్ఫుటం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణ కొరకు ఒకవైపు ప్రజల్ని మరోవైపు నేటి తరం విద్యార్థుల్ని చైతన్య పరచవలసిన బాధ్యత ప్రజల్ని పాలిస్తున్న పాలకులపై ఉన్నది.

వన్యప్రాణులన్నీ, సహజ ఆవాసాలన్నీ, వనరుల్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత గురించి, ప్రజల్ని ముఖ్యంగా రక్షిత ప్రాంతాల చుట్టూ పక్కల ఉండే వారిని చైతన్యం చేయడము వన్యప్రాణుల నిర్వహణలో ముఖ్యమైన అంశము.

నేటితరం విద్యార్థులకు తరగతి గదిలో పర్యావరణ విద్యను బోధించడమే కాకుండా సమీపములోని వనాలకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగేటట్టు చేయవలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడుపై ఉన్నది. ఈ విధమైన క్షేత్రస్థాయి పర్యటనల వల్ల విద్యార్థుల్లో ప్రత్యక్ష పరిశీలన జరిగి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై జీవ వైవిధ్యాన్ని పెంపొందించడానికి పాటుపడరతారని భావిద్దాం.

మానవులుగా మనము జీవవైవిధ్యంలో భాగమే ఈ వైవిధ్యాన్ని కొనసాగించడానికి ప్రతి ఒక్కరము మన బాధ్యతని గుర్తించాలి.

-మన్నె వెంకట సుబ్బారెడ్డి
గణిత ఉపాధ్యాయులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
దొరసాని పల్లె, ప్రొద్దుటూరు,
వైయస్సార్ కడప జిల్లా
m : 9849851092
e: mannesubbareddy3@gmail.com

# ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర

మానవ మనస్సు యొక్క స్వేచ్ఛ, స్వేచ్ఛా వాక్ మరియు స్వేచ్ఛా పత్రిక హక్కుల్లో గుర్తించబడినది : కాల్విన్ కూలిడ్జ్

పత్రికా స్వేచ్ఛ అనేది ఏదేశమూ వదులుకోలేని అమూల్యమైన హక్కు : మహాత్మాగాంధీ

ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలలో పత్రికా స్వేచ్ఛ ఒకటి : నెల్సన్ మండేలా

మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. ఒక సంఘటన, కుంభకోణం వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసి ప్రజలకు వెల్లడించే ప్రయత్నంలో ప్రాణాలను పణంగా పెట్టిన జర్నలిస్టులు ఎంతోమంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పత్రికా స్వేచ్ఛను అంచనావేయడం, దాన్ని పరిరక్షించడం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు నివాళి అర్పించడం వంటివి పత్రికా స్వేచ్ఛ దినోత్సవ లక్ష్యాలు. సెన్సార్షిప్, బెదిరింపులు, వేధింపులు, జైలుశిక్ష, హింసవంటి వాటిని ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు అండగా నిలిచి దానిపట్ల అవగాహన కల్పించడం మరో ముఖ్యవిధిగా నిర్ణయించారు. సత్యాన్వేషణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల జ్ఞాపకాలను మననం చేసుకుని ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా వారికి నివాళి అర్పిస్తారు.




### భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలు కీలక పాత్ర

ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, ప్రజలు, పత్రికాస్వేచ్ఛ, జర్నలిస్టుల నిబద్ధతను గౌరవించవలసిన అవసరాన్ని యునెస్కో ప్రముఖంగా చెబుతుంది. ఇంటర్నెట్ కంపెనీల పారదర్శకతను నిర్ధారించే యంత్రాంగాలపై నిర్దిష్ట చర్చ చోటు చేసుకుంది. సమాచార హక్కును సమర్థించడంలోనూ, అధికారంలో ఉన్నవారిని జవాబుదారీగా ఉంచడంలోనూ స్వేచ్ఛాయుత, స్వతంత్ర పత్రికా యంత్రాంగం పోషించే కీలకపాత్రను ఈ స్వేచ్ఛా దినోత్సవం గుర్తు చేస్తుంది.

భారతీయ దృక్కోణం నుంచి ఈ దినోత్సవం రాజకీయ, కార్పొరేట్, మతపరమైన ఒత్తిళ్లతో సహా దేశ మీడియా రంగంలో కొనసాగుతున్న సవాళ్లను తెలియజేస్తుంది. స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యానికి భారత దేశం బలమైన రాజ్యాంగ రక్షణలు కల్పించింది. అయితే, దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనల మధ్య పత్రికా రంగం ఒడుదుడుకులకు లోనవుతూనే ఉంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలతో పాటు అజాద్ రేడియో, భాగ్యనగర్ రేడియో కీలక పాత్ర పోషించాయి. ప్రజల్లో చైతన్యం పెంచడానికి ఈ ప్రసార మాధ్యమాలు విశేష కృషి చేశాయి. భారత రాజ్యాంగంలో ఎన్నోరకాల అధికారాలు ఉన్నాయి.

### చారిత్రక నేపథ్యం:

యునెస్కో 1991 ఏప్రిల్ 29 నుంచి మే 3 వరకు నమీబియా రాజధాని విండ్హోక్లో 'ఆఫ్రికాలో పత్రికా స్వేచ్ఛ, స్వతంత్రం' అనే అంశంపై సెమినార్ నిర్వహించింది. మే 3న పత్రికల స్వేచ్ఛ కోసం కొన్ని సూత్రాలను ప్రతిపాదించారు. దాన్నే విండ్హోక్ డిక్లరేషన్గా పేర్కొంటారు. దీనికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఏటా మే 3న 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం'గా జరుపుకోవాలని 1993, డిసెంబరులో యూఎన్ఓ జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 1994 నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

**థీమ్:** 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం (మే 3) ఇతివృత్తం **"శాంతియుత భవిష్యత్తును తీర్చిదిద్దడం: మానవ హక్కులు, అభివృద్ధి మరియు భద్రత కోసం పత్రికా స్వేచ్ఛను ప్రోత్సహించడం".** జర్నలిజం, డిజిటల్ హక్కులు, శాంతిల మధ్య సంబంధంపై దృష్టి సారిస్తూ, 2026 ప్రపంచ సదస్సు మే 4-5 తేదీలలో జాంబియాలోని లుసాకాలో జరగనుంది. మనదేశ వర్తమాన సందర్భంలో ప్రజాస్వామ్య పరిరక్షణ రాజ్యాంగ పరిరక్షణ అత్యంత ఆవశ్యకం. ప్రసారమాధ్యమాల స్వేచ్ఛను కాపాడుకోవడం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం.

- జుగాష్విలి
m : 8309452998
e:desk.deccan@gmail.com

# కొమ్మాయిపల్లి గడీ విశిష్టత

**చరిత్ర:**

యాదాద్రి భువనగిరి జిల్లా, కొమ్మాయిపల్లిలో 20వ శతాబ్ది రెండవ దశకంలో కీ.శే. శ్రీ మొసలి బుచ్చిరెడ్డి (సతీమణి చెన్నమ్మ) గారి కుమారులు.. కీ.శే.లు రాజిరెడ్డి, రంగారెడ్డి, వెంకట్రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి మరియు పాపిరెడ్డి గార్లు, వారి నివాసగృహాల బాహ్య ప్రాకారాంతర్భాగంగా సంయుక్తంగా నిర్మించుకున్న ప్రవేశ ప్రాంగణం ఇది.

**నిర్మాణం:**

లోతైన పునాదులపై లేడిబండ (వీరాచలం సమీపాన) నుండి తరలించిన పెద్ద పెద్ద గ్రానైట్ పలకలతో, ఇసుక, సున్నం, కరక్కాయలు, బెల్లం, జనపనార కలుపగా తయారైన మోర్టార్‌తో ధృఢంగా రెండంతస్తులుగా కట్టబడింది.



శల్క భూముల్లో సేకరించిన సున్నపు రాళ్ళని బట్టీల్లో కాల్చి, పెద్ద పెద్ద గోలాల్లో కొన్ని రోజులు నానబెట్టి దంగులో మొదట నీళ్ళు, ఆపై ఇసుక, సున్నం తగుపాళ్లలో పోస్తూ జత ఎడ్లతో అనేక సార్లు 400 వందల కిలోల బరువున్న గుండ్రటి రాయిని దంగులో తిప్పి తిప్పి తీసిన మిశ్రమాన్ని మరికొన్ని రోజులు తడి ఆరకుండా కుప్పగా వేసి, మాగిన పిమ్మట కట్టడానికి వినియోగించేవారు. ఈ ప్రక్రియ ద్వారా, కట్టడానికి పటుత్వము, మన్నిక చేకూరుతాయి.

అలాగే ఎర్ర మట్టి జాగలలో అనేక ఇటుక బట్టీలు పెట్టించి కాల్చి తెప్పించిన ఇటుకలను గడీ మరియు గృహ సముదాయ నిర్మాణానికి వినియోగించారు.

ఇక ప్రాకారాన్ని మాత్రం పూర్తిగా మట్టితో, రాతి కట్టు పునాదుల మీద నిర్మించారు. బాగా తొక్కిన జిగురు మట్టి ముద్దలను అతికినట్లుగా దొంతరలు గా చేర్చి కట్టినరు. గోడ తలాపున వర్షానికి మట్టి జారికరిగి పోకుండా కుమ్మరి పెంకులను అమర్చారు. అందుకే వంద సంవత్సరాలు కాపు కాయ గల్గినవి. ఒక్కరిద్దరు మేస్త్రీలను దూర ప్రాంతాల నుండి పిలిపించినా, మిగతావారు అంతా స్థానిక వృత్తి పనివాళ్లే.

ఎత్తైన దారువు దర్వాజా కిరువైపుల పది వర్తులాకార నిలువెత్తు ముచ్చటైన స్తంభాలను కలుపుతూ 11 పాయింటెడ్ ట్రిఫోఇల్స్ ఆర్చ్‌లతో, పైన మధ్యలో ఎంబోస్డ్ ఆర్న్ మెంటల్ డిజైన్స్ తీర్చి దిద్దబడ్డాయి. ఎత్తైన పొడుగాటి అరుగుల వసారాతో, చక్కని ఆకర్షణీయమైన పై బాల్కనీతో హృద్యంగా గోచరిస్తుంది.

ప్రాంతీయ వనరులను చక్కగా ఉపయోగించుకొన్న తీరు, తెలుగు వెర్నాక్యులర్ ఆర్కిటెక్చర్‌గా చెప్పవచ్చు. ముఖ భాగంలో కొంత 16వ శతాబ్దపు గోతిక్ శైలి గోచరిస్తుంది. ప్రధాన ద్వారం గుండా లోనికి ప్రవేశించగానే ఆహ్వానితులు ఆసీనులవడానికి రెండు వైపులా అరుగులను ఏర్పరచారు.

గడీ నేటి గేటెడ్ కమ్యూనిటీ ఎంట్రెన్స్ లాగా ఉంది. ప్రాకారం లోపల గల పెద్ద రాతి మెట్ల దిగుడు బావి వాటదార్ల, వలు చేద గిరికలతో తోట మరియు అందరి ఇండ్ల నీటి అవసరాలను తీర్చేది. నాడు తమ పంట ధాన్యాలను ఐదుగురు సోదరులు విడిగా సహజ పద్ధతుల్లో నిల్వ చేసుకోవడానికి అనువుగా అర్ధ భూగృహ గరిశెలు (అరలు) ఏర్పరచుకున్నారు.

ధాన్యాగారాల ద్వార బంధాలకు అనేక విడి చెక్క పలకలను క్రమ పద్ధతిలో చేర్చి తాళం వేసుకుని భద్రపరచుకునే వెసులుబాటు కూడా ఉంది. మొదటి కప్పు ఛత్తు పద్ధతిన, పైమేడ కప్పును వెదురు బద్దల పరాటా పైన తొక్కిన మట్టిని కూర్చి, ఎర్రగా కాల్చిన అర్ధ చంద్రాకార కుమ్మరి పెంకులను మూడు దొంతరలుగా ఏటవాలుగా, వర్షము, ఎండవేడిమి ఏమాత్రమూ పొడ చూపని విధంగా సర్దారు.

అనేక మద్ది, టేకు, తాటి కలప దూలాలు, వాసాలు ఇందుకు ఉపయోగించారు. లోపలి ఉష్ణోగ్రతల క్రమబద్దీకరణకు రెండున్నర అడుగుల దళసరి కుడ్యములు సహకరించినవి. లోపల నునుపైన సున్నపు కుడ్య తలములను రోహిణిలో తడిమినా కూడా చల్లదన అనుభూతే.

1979వ సంవత్సరం వరకు కూడా ఆనాటి నిర్మాణ ప్రక్రియల ఆనవాళ్లైన దంగు వర్తులం, నిలువెత్తు సున్నపు రాళ్ళు కాల్చే బట్టీల అవశేషాలు ఆ ప్రక్కనే కనబడేవి. మన్నిక, యుటిలిటీ, అందం జోడింపుతో శతాబ్దకాలంగా సహజ వాతావరణ

పరిస్థితులను తట్టుకొని ఠీవీగా నిలిచింది.

**అవశ్యకత:**

ఈ భవనం నాటి ఉమ్మడి కుటుంబాల అవసరాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, రక్షణ అంశాల నిర్వహణ నిమిత్తం నిర్మితమైంది.

గడీ వాకిలిలో ఏటా.. ముఖ్యంగా దసరా పండుగ నాడు జరిపే దుర్గామాత పూజ, కంకణధారణ, మహిషాసురుని సంహరణకు చిహ్నంగా బలి (సొరకాయ), ఆయుధపూజ, తర్వాత జమ్మి పూజకు గడీ నుండి గ్రామ జనులు కాగడాల వెలుగులో బయలు దేరే సందడి, సంబరం అంతా ఒక అద్భుత సన్నివేశమే.

సందర్భానుసారంగా జరిగే వివిధ ఉత్సవాలు, ఊరేగింపులు, నాటకాలు, భాగవతులు, గారడీలు, బుర్రకథలను.. మగవారు బంకుల్ల అరుగులపై కూర్చొని, మహిళలు, పిల్లలు విశాలమైన మొదటి అంతస్తు బాల్కనీ నుండి వీక్షించేవారు.



ఛత్తు పై నుంచి దూరం నుండి వచ్చే బంధువులను గమనించి, వెళ్ళి సాదరంగా ఆహ్వానించేవారు.

పెళ్ళి వేడుకలకు విడిదిగా, దేశగురువులకు గెస్ట్ హౌస్‌గా, పండుగలప్పుడు వచ్చిన బంధువులకు, స్నేహితులకు రెస్ట్ హౌంగా, ఇండోర్ ఆటస్థలంగా ఈ భవంతి ఉండింది.

పదకొండు రోజుల పెళ్లి వేడుకలప్పుడు అతిథులు మొదటి అంతస్తు హాల్‌లో గొప్ప ఆతిథ్యం పొందే వారు. వారి కొరకు జంపఖానాలు, పరుపులు, దిండులు, విసన కర్రలు, తువ్వాళ్ళు, చల్లని మంచి నీళ్ల సురాయిలు, ఖూజాలు, రంజాన్లతో అందించేవారు. రాత్రి పెట్రోమాక్స్ లైట్స్ కాంతులు విరజిమ్మేవి. సహాయకులు ఎల్ల వేళల అందుబాటులో ఉండే వారు.

ఉమ్మడి కుటుంబాల ఐకమత్యం, ఔన్నత్యమే మకుటంగా, గత శతాబ్ద కాలంగా ఉనికిని చాటుకుంది. సామాజిక బాధ్యతను, సంఘటిత కుటుంబ వ్యవస్థను, గంభీర జీవన శైలిని, కుటుంబాల భద్రతను పదిల పరిచింది. దశాబ్దాలుగా సుదూరప్రాంత బాటసారులకు ఆశ్రయం, ఆదరణ కల్పించింది.

పరగణా / పంచాయతీ నుండి గ్రామ సందర్శన నిమిత్తం వచ్చిన అధికార గణాలకు, విశిష్ట అతిథులకు, కళాకారులకు ప్రత్యేక మర్యాదలతో ఆతిథ్యాన్ని అందిస్తూ వచ్చింది.

దేవాలయం శంకుస్థాపన మరియు ప్రతిష్ఠాపన కార్యక్రమాల ఊరేగింపులు ఈ ప్రాంగణము నుండే సన్నాయి మేళంతో బయలు దేరినవి.

ఒకానొక సమయంలో (అది 1949..) కమ్యూనిస్టు భావ జాలురు కొందరు, స్థానిక ఈర్ష్యా పరులు అందించిన తప్పుడు సమాచారంతో ఈ మ్యాగ్నిఫిసియంట్ కట్టడాన్ని అర్ధ రాత్రి, నేల మట్టం కావించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది.

ఇతర ప్రాంత గడీల పాలకుల మాదిరి నియంతృత్వ పోకడలు, జాడలు ఇసుమంతైనా దరి చేరనీయని ఔన్నత్యాన్ని గ్రహించి మిన్నకున్నారు.

తూర్పు దిక్కున మొదట ఏర్పరచిన సోపాన మార్గం కాలక్రమంలో వీధి విస్తరణలో శిథిలమైంది. సమకాలీన, వింటెజ్ దాటి, ఆంటిక్ ఏజ్‌లో శతవత్సర మకుటంతో రాణిస్తున్న రాజసం దీని సొంతం.

**ముగింపు:**

అలాంటి ఒక అరుదైన, విశిష్ట గుర్తింపు పొందిన, విలువల అస్తిత్వ మూలాలున్న, పూర్వీకుల, వంశ గౌరవ చిహ్నంగా, దీని ఉనికిని కాపాడుతూ ముందు తరాలకు కానుకగా అందించాలి. చాలా ప్రాంతాలలో ఇలాంటి సాంస్కృతిక చిహ్నాలు కనుమరుగై పోవడం మనవెరుగుదుము. పరిణామ క్రమంలో జరిగిన నష్టాన్ని నివారించి, పరిరక్షించడం సదా ఆవశ్యకం?

– ఎం. మురళీధర్ రెడ్డి
m : 9441674890
e: murali781965@gmail.com

DECCAN దక్కన్ CHANNEL
సామాజిక, సాంస్కృతిక ఛానల్

# దేవాలయవాస్తులో అపురూపం నందికంది గుడి

**దేవాలయ అవతరణం:**

మధ్యయుగాల్లో అంటే 7వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం మధ్యకాలంలో తెలుగునాట ఆలయనిర్మాణం చాలా విస్తరించింది. ఆలయాల కొరకు బావులు, చెరువులు, తోటలు, భూములప్రదానం ప్రధానమైనది. స్థిరాస్తులను ఇవ్వడం కొత్త సంగతే. ఈ కాలం నిర్మించిన కొత్త గుడులు, మెరుగుపరచిన, పునరుద్ధరించిన ఆలయాలు ప్రజలు, పోషకుల శైవ, వైష్ణవ, శక్తి, జైన మతవిశ్వాసాల ప్రాధాన్యాతలను స్పష్టపరుస్తాయి.

దేవుండ్ల అవసరాలు కూడా సాధారణ ప్రజలు, రాజుల అవసరాలను పోలివుంటాయి. దేవుండ్లకు చేసే షోడశోపచారాలు అతిథులకు చేయాలని స్మృతులు చెప్పినటువంటివే. మధ్యయుగాలలో దేవాలయం స్వంతపాలనా సిబ్బంది, ఆస్తులు, సంప్రదాయాలతో రాజ్యంలో రాజ్యంగా ఉండేది. ఒక సాంస్కృతిక కేంద్రంగా ఏర్పడింది.




నందికంది రామలింగేశ్వరాలయం

"ఆలయం ఒక చిన్నగదిలో ఉపాసనా కేంద్రంగా మొదలైనట్లు కనిపిస్తుంది. దాని పరిసరాల్లో మరిన్ని నిర్మాణాలు, ఆ ఉపాసనావిధానం ఒక మతంగా పరిణమించి, రాజకీయాధికారప్రాపు లభించి, సంక్లిష్ట నిర్మాణాలకు దారితీసింది. దేవాలయం ప్రాబల్యం వహించింది. ఒక సామాజిక సంకేతంగా ఎన్నో మార్పులను చేర్చుకుంది."

*-రోమిలా థాపర్(1987)*

**భూమిజ దేవాలయాలు:**

తెలంగాణ దేవాలయాలలో సంగారెడ్డి జిల్లా నందికంది 'రామలింగేశ్వరాలయం (రామేశ్వరాలయం)' దేవాలయానికి ఎంతో ప్రాధాన్య ముంది. ఈ దేవాలయ వాస్తు, నిర్మాణాలు ప్రత్యేకం. వేర్వేరు కాలాలలో రెండు వేర్వేరు మతాలు ఈ గుడికి అనుబంధమైనవి.



నంది

ఈ గుడి నిర్మాణం 'భూమిజ' పద్ధతిలో ఉందని ఆలయ వాస్తువేత్తలెందరో ప్రశంసించారు. భూమిజ అనేది ఉత్తర భారతీయ దేవాలయ నిర్మాణ శైలులలో ఒక రకం. ఇది గర్భగృహం పైన ఉన్న శిఖరం (స్పైర్) నిర్మాణంలో తిరిగే చతురస్ర-వృత్త సూత్రాన్ని (rotating square-circle principle) ఎలా అన్వయించారో దాని ద్వారా గుర్తించ బడుతుంది.

చతురస్ర ప్లాన్‌ను విభజించకుండా, దాని కేంద్రం చుట్టూ తిప్పడం (rotate) భూమిజ శైలి యొక్క ప్రత్యేక లక్షణం. ఈ తిరుగుడును ఎత్తుగా పెరిగేకొద్దీ నిర్దిష్ట వ్యవధులలో ఆపేస్తారు. ఇందులోని ప్రతి అంతస్తును భూమి అంటారు.

శిల్పశాస్త్రాలలో సాధారణ నియమం ఏమిటంటే - భద్రాలు (bhadras) మరియు శాలలు (salas) గర్భగృహం (చతురస్రం)కు సమాంతరంగా ఉండాలి. ఈ నియమం శిఖరానికి అందాన్ని ఇస్తుంది. సులభంగా అనుసరించడానికి వీలు కల్పిస్తుంది. శాలాల ముఖాలను కూడా వృత్తానికి అనుగుణంగా కత్తిరించి సర్దుబాటు చేస్తారు. చతురస్రం మరియు వృత్త సూత్రాలను ఏకకాలంలో ఉపయోగించడం భూమిజ నిర్మాణ శైలి యొక్క విశిష్ట లక్షణం.

**భూమిజ శైలి రెండు విధాలు:**

- కేవలం శిఖరం(spire) మాత్రమే
- మొత్తం విమానం (vimana) లేదా దేవాలయ మంతట

రెండవ విధానం భూమిజను నాగర నిర్మాణ శైలి యొక్క ఉప-వర్గంగా చేస్తుంది. జగతి (ప్లాట్ ఫారం)తో కలిపినప్పుడు దేవాలయం భూమి నుండి బయటకు వస్తున్నట్లు కనిపిస్తుంది. దీనినే భూమిజ అంటారు.

నందికందిలో ఈ దేవాలయం రెండవ


ద్వారశాఖపై కాలాముఖులు


బ్రహ్మ


గజాసురసంహారమూర్తి


చాముండి


సూర్య


వరాహమూర్తి

విధానానికి చెందిన గుడి.

భూమిజ శైలి గురించి 11వ శతాబ్దానికి చెందిన వాస్తుగ్రంథం సమరాంగణసూత్రధారలోని 65వ అధ్యాయంలో 16 రకాల భూమిజ వైవిధ్యాలు వివరించబడ్డాయి. ఉత్తర భారతీయ నాగరదేవాలయ నిర్మాణ శైలులలోని 14 శైలులలో ఒకటిగా అపరాజితపృచ్ఛలో (12వ శ.) భూమిజశైలిలోని వైవిధ్యాలను వివరిస్తుంది: వట్ట (వృత్తాకార), నవాంగ, చతురస్ర, అష్టసాల మొదలైనవి.

డాక్టర్ డొనాల్డ్ స్టాడ్నర్ 1980లలో మధ్యప్రదేశ్ తూర్పుభాగాలలో పర్యటించి 7-8వ శతాబ్దాలకు చెందిన ప్రోటో-భూమిజ దేవాలయాల ఉదాహరణలను ప్రచురించారు. ఈ స్టెల్లేట్ (నక్షత్రాకార) ప్లాన్‌ను మాల్వాలో 9-10వ శతాబ్దాలలో పరిపూర్ణం చేశారు.

ఈ శైలి 10వ శతాబ్దంలో మాల్వాప్రాంతంలో (పశ్చిమ మధ్యప్రదేశ్, ఆగ్నేయ రాజస్థాన్) పరమార రాజవంశం పాలనలో ఆవిష్కరించబడింది. ఇది హిందూ మరియు జైన దేవాలయాలలో కనిపిస్తుంది. ఈ రూపకల్పన గుజరాత్, రాజస్థాన్, దక్షిణ, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రధాన హిందూ దేవాలయ సముదాయాలలో కనిపిస్తుంది.

గలతేశ్వర మహాదేవ దేవాలయం-సర్నాల్, గుజరాత్, సూర్య దేవాలయం - రాణక్‌పూర్, రాజస్థాన్, రామప్ప దేవాలయం-తెలంగాణ, ఏరకేశ్వర దేవాలయం-పిల్లలమర్రి, భండ్ దేవుల్-అరంగ్ (జైన దేవాలయాలు), ఛత్తీస్‌గఢ్-మహావీర దేవాలయం, సేవారి, రాజస్థాన్, మాన్కేశ్వర దేవాలయం- జోడాగే, నాసిక్, చెన్నకేశవ దేవాలయం-బేలూర్


జైన స్తంభ శాసనం

**నందికందిగుడి భూమిజ శైలి దేవాలయం:**

నందికంది రామేశ్వరాలయం భూమినుంచి 16కోణాల నక్షత్రకారంలో విమానందాక కొనసాగుతుంది.

(CAADRIA 2025-Tokyoలో సమర్పించిన) 'Reconstructing Bhumija Temple Architecture: Computational Model Based on the Samargaa Stradhra,' అనే పరిశోధనాపత్రంలో కంప్యూటేషనల్ మోడల్స్‌ను తెలంగాణలోని నందికంది రామలింగేశ్వర దేవాలయం ఫోటోగ్రామెట్రీ సర్వే ద్వారా ధృవీకరించారు. 11,000 చిత్రాల నుండి ఒక డెన్స్ పాయింట్ క్లౌడ్‌ను రూపొందించి, ఖచ్చితమైన డిజిటల్ పునర్నిర్మాణం చేశారు. జనరేటివ్ మోడల్స్‌తో పోల్చినప్పుడు, ఈ గుడి 'కుముద (Kumuda) టైపాలజీ'తో సరిపోలింది. కాని, నిజానికిది ప్రణాళికాపరంగా 16కోణాల నక్షత్రాకారం, భద్రాలతో ఉండాలి. ఈ గుడిలో భద్రాలు లోపించడంవల్ల 'కమలాకృతి' కాకుండా 'కుముద'మయింది. ఈ రామలింగేశ్వరాలయం త్రిభూమి నిర్మితి. గుడి ఎలివేషన్ వరండికల నుండి కాక జంఘు(గోడలు)ల నుంచి మొదలైంది. 3వ భూమి సాంప్రదాయిక అంతస్తుల పద్ధతిని అనుసరించలేదు. అది 'ఘంట'లో విలీనమవుతున్నది. బహుళన్తరాల కిరీటాన్నిదాల్చినట్లుంది. రామలింగేశ్వరాలయం వేదిబంధ, జంఘ, వరండిక, 1వ భూమి, 2వ భూమి, 3వ భూమి, కపోతలి, ఘంట(కింది నుంచి పైకి)లతో షోడశకోణ కుముద నిర్మాణమైనది.

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నందికందిలోని రామలింగేశ్వరాలయం ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడిన దేవాలయం. శాసనాలలో ఈ గుడిపేరు రామేశ్వరాలయం. పలుకుబడిలో మార్పు వచ్చింది.

**గుడిలోపల:**

గర్భగుడిలో వేదిభద్రపీఠం మీద సమతల శిరోవర్తనంతో కాకతీయశైలి శివలింగం అమరివున్నది. ద్వారంపైన లెంటల్ మీద ఆసీనమూర్తులైన బ్రహ్మ, శివుడు, విష్ణువుల శిల్పాలు, వారి గణాలున్నాయి. గర్భాలయ ప్రవేశద్వారం మీద లలాటబింబంగా


వీరగల్లులు


బ్రాహ్మి


సరస్వతి


షోడశకోణం నక్షత్రాకారం

గజలక్ష్మి, పంచశాఖ ద్వారబంధం తామరపూరేకులు, లతలతో అలంకృతమైవున్నది. రెండువైపుల పెద్దస్తంభికలు, వాటిమీద ఇద్దరు చామరధారిణులు, వారికి లోపలివైపు రెండుపక్కల దండధారులై నిల్చున్న కాలాముఖులున్నారు. కుడివైపు ద్వారశాఖమీద కనిపించే కాలాముఖుడు 'లాంగ్ కోట్ వంటి తోలు అంగారఖా' ధరించాడు. ఎడమవైపునున్న కాలాముఖుడు కూడా లాంగ్ కోట్ తోనే కనిపిస్తున్నాడు.

ద్వారశాఖమీద లతలలో వీరులు చెక్కబడ్డారు. ద్వారం కడపముందు శంఖలతాతోరణం చెక్కివుంది. ఈ తోరణం గుడి ప్రవేశద్వారం వద్ద కూడా మరొకటి ఉన్నది.

**ఆలయ స్తంభ శిల్పాలు:**

ఈ గుడి మంటపంలోని స్తంభాలు దాదాపుగా అన్నీ రాష్ట్రకూటశైలికి చెందినవే. ఈ శిల్పిత మంటపస్తంభాలను పోలినవి అల్లాదుర్గం హన్మంతుని గుడిలో, బేతాళునిగుడిలో అగుపిస్తాయి. మంటపంలోని నవరంగమంటపంలో నిలిపిన నాలుగు స్తంభాల శిల్పాలు అపురూపమైనవి. ఈ స్తంభాలపైన హిరణ్యకశ్యపవధ, భైరవి, బ్రహ్మ, సదాశివ, చాముండి, చెంచులక్ష్మి-నరసింహ, వరాహమూర్తి, గజసంహారమూర్తి, కంకాళమూర్తి, వీణాధరమూర్తి, భైరవుడు, నటరాజు, సరస్వతి, నాట్యగణపతి, కీర్తిముఖం, మాతృకలు, అలసకన్యలు, నదీదేవత, విద్యాధరులు, కిన్నరులు, బేతాళుడు, దిక్పాలురు, యోగినులు, కుడులలో దేవతామూర్తులు, నాట్యగత్తెలు, పీఠాధిపతి, వీరులు, ఇంకా అగణిత శిల్పాకృతులున్నాయి.

మంటపంలో ఆధారపీఠం మీద రాష్ట్రకూటశైలి నంది ఉన్నది. నంది ముందర లఘుశాసనం చెక్కబడివుంది. గుడి ప్రవేశద్వారానికి ఇరువైపుల ఏనుగులతో కటాంజానాలున్నాయి. కడపముందర శంఖలతాతోరణం ఉన్నది.

ఈ దేవాలయ శిల్పాలు, మంటపస్తంభశిల్పాలు చాలా ప్రత్యేకం. ఇన్ని వైవిధ్యభరితమైన శిల్పాలను ఒకేగుడిలో చూసింది అరుదు.

**నందికంది ఏకకూటం:**

ఈ గుడి ఏకకూటం. తొలుత లేని మంటపం, శిల్పాలన్నీ పునరుద్ధరణలో చేర్చినట్లుంది. ఈ గుడివంటి భూమిజ దేవాలయాలు ఆదిలాబాద్ లో అక్కడక్కడ ఏకకూటాలుగా వున్నాయి. వాటికి కూడా మంటపాలు సమకూర్చబడ్డాయి.

గుడికి మంటపప్రవేశానికి మూడువైపుల ద్వారాలున్నాయి. మంటపంపైన అందమైన శుకనాసి వుంది. దానిలో అడ్డంగా


గుడి స్తంభాలు


వాక్కాణదేవర శాసనం


గుడి స్తంభాలు


మాత్రిక


గర్భాలయద్వారం





శుకనాసి

నందికంది తోరణద్వారం ద్విముఖశిల్పం

పగులు కనిపిస్తుంది. దేవాలయ తోరణద్వారానికి వేలాడే తామరమొగ్గల పై రంధ్రాల నుంచి 6 రుతువులలో సూర్యకిరణాలు ఈ పగులు ద్వారా శివలింగం మీద పడతాయని ప్రచారం ఉన్నది. అది నిజం కాదు.

**నందికంది తోరణద్వారం:**

తెలంగాణాలో ప్రసిద్ధమైన తోరణద్వారాలలో ఒకటి నందికంది గుడి తోరణద్వారం. ఈ ద్వారం మీద రెండువైపుల చెక్కిన ద్విముఖ శిల్పముంది. తూర్పువైపు సంధ్యాతాండవమూర్తి అత్యంత అద్భుతంగా చెక్కిన శిల్పం, వెనక వైపు గజలక్ష్మి శిల్పం కూడా అందమైనదే.

గుడి వెలువల ఉన్న విడి శిల్పాలలో వీరగల్లులు, నాగశిలలు, నందులు, తోరణాలు, జైనధర్మాలకు సంబంధించిన చామరధారుడు, సరస్వతి శిల్పాలున్నాయి.

**దత్తాత్రేయుడైన బ్రాహ్మీశిల్పం:**

గ్రామంలో ఒక విశ్వకర్మ ఇంటిముందు మూడుతలల స్త్రీదేవతను చూసాం పుష్కరం కింద. అది సప్తమాతృకలలో ఒకటైన బ్రాహ్మీ శిల్పం. ఇటీవల ఆ శిల్పాన్ని దత్తాత్రేయుడని కొత్త గుడిని కట్టారట.

**నందికంది శాసనాలు:**

నందికందిలో లభించిన శాసనాలలో మొదటి శాసనం కళ్యాణీచాళుక్య వంశస్థాపకుడు ఆహవమల్ల, 2వ తైలపుడు నందికందిలో జైనబసదిని కట్టించి, జైనస్తంభాన్ని నిలిపినందుకు సామంతుడైన సోమన్నపాలున్ని ప్రశంసించాడని పేర్కొంటున్నది. కాని, జైనబసది అవశేషాలు తప్ప జైనాలయం ఇపుడు అగుపించడంలేదు. ఇక్కడ దొరికిన పార్శ్వనాథునిశిల్పం హైద్రాబాద్ స్టేట్ మ్యూజియానికి చేర్చబడ్డదంటారు.

రెండవ శాసనం కళ్యాణీచాళుక్య పాలకుడు 5వ విక్రమాదిత్యునికాలంలో అతని సామంతుడు పంపపెర్మానడిగల్ కిఱియకంది వాక్కాణ దేవర పాదాలు కడిగి సర్వాభ్యన్తరసిద్ధిగా కోవూరు నామేశ్వర దేవాలయానికి చేసిన దానాన్ని ప్రభువులు బయ్యనయ్య, మారజయ్యలు, మరొక దానాన్ని ముక్కణయ్య నిర్వహించారని వివరిస్తున్నది.



వాక్కాణదేవర శాసనం

శాసనం పైభాగంలో లకులీశుడు,శిష్యులతో, కిందిభాగంలో వ్యాఖ్యానదేవర (కాలాముఖ గురువు) కాళ్ళుకడుగుతున్న రాజదంపతుల శిల్పం చెక్కివున్నాయి.

3,4 శాసనాలు వీరగల్లులకు సంబంధించినవి.

3వది నంది పీఠంపై శాసనంలో భటారర్ చండిసెట్టి కొడుకు బసవనాయక స్వర్గస్తుడైనాడని వుంది.

4వది సోమేశ్వరుని గుడిలో అళియ నావసెట్టి కొడుకు కుమార్న స్వర్గస్తుడైనాడని పేర్కొనబడ్డది.

కాని, సోమేశ్వరాలయం ప్రస్తుతం కనిపించదు.

5వ శాసనంలో నంది శిల్పాన్ని చేయించింది దివిత పండితుడు, బేతోజు కొడుకు చెక్కాడని ఉన్నది.

ఊరిబయట పొలాల్లో మరోశాసనముందంటారు జాడ తెలియలేదు.

ఊరిలో మరో శివాలయముంది. చిన్న, చిన్న గుడు లున్నాయి. రామలింగేశ్వరాలయ ప్రాంగణంలో కూడా చిన్న గుడులున్నాయి. దాదాపు 7, 8శతాబ్దాల నుంచి 16, 17శతాబ్దాల దాక గుడుల నిర్మాణాలు, పునరుద్ధరణలు జరిగిన సాంస్కృతిక ప్రదేశం నందికంది.

**ధన్యవాదాలు:**

పుష్కరం కింద నందికంది సందర్శనలో నాతోటి సహయాత్రికుడు వేముగంటి మురళీకృష్ణకు, ఈ గుడి భూమిజ నిర్మాణం గురించి విపులంగా చెప్పిన డా. ఈమని శివనాగిరెడ్డి గారికి, ఆత్మీయచర్చ చేసే సుపర్ణమహికి.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

ప్రకృతి గమనం! 7 ప్రకృతి ధర్మం!!

# భూగోళానికి తగ్గుతున్న సూర్యకాంతి!

సౌరకుటుంబంలో కేవలం భూమిపైననే జీవం ఏర్పడడానికి ప్రధాన కారణం సూర్యరశ్మి యొక్క తీవ్రతస్థాయే! అంటే అత్యంత ఎక్కువగాని, అత్యంత తక్కువగాని లేక, జీవులు మనుగడ (భూమిపై, నీటిలో, గాలిలో, భూమి పై పొరలలో) సాగించడానికి అనుకూలంగా వుండే సూర్యకాంతి ప్రసరించడమే! కాని, భూమికి ముందున్న రెండు గ్రహాలు (బుధుడు, శుక్రుడు) అత్యంత తీవ్ర సూర్యకాంతిని పొందగా, భూమి తర్వాత వున్న అయిదు గ్రహాలకు (అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్) క్రమానుగతంగా సూర్యకాంతి ప్రసరణ తగ్గుతూ వుంటుంది. అనగా సూర్యుడికి దగ్గరగా వున్న గ్రహాలు అత్యధిక సూర్యకాంతిని పొందుతే, దూరంగా వున్న గ్రహాలకు తక్కువస్థాయి సూర్యకాంతి అందుతుంది. భూమికి అటు ఎక్కువగా కాకుండా, ఇటు తక్కువగా కాకుండా జీవుల మనుగడకు, పెరుగుదలకు, అభివృద్ధికి దోహదపడేలా వుంటుంది. కాబట్టే సౌరకుటుంబంలోని ఎనిమిది గ్రహాల్లో కేవలం భూమిపై మాత్రమే జీవం ఏర్పడి పురుడు పోసుకున్నది. అయితే, ఈ సూర్యకాంతి భూమి ఏర్పడిన (4.56 బిలియన్ సం॥) నుంచి నేటికి ఏకరీతిన భూమికి చేరడం లేదు. దీనికి గల కారణాలు అనేక అంశాలపై ఆధారపడి వుంటాయి. వున్నాయి.




సూర్యకాంతి భూమిపై చూపే ప్రభావం, మొదటగా సూర్యుడిలో జనించే తీవ్రమైన ఉష్ణోగ్రతస్థాయి. అయితే సూర్యుడి ఉష్ణోగ్రతల స్థాయి బిలియన్ సంవత్సరాల క్రితం ఎంత వుండేదో మిలియన్ సంవత్సరాల కాలంలో మారిన ఉష్ణోగ్రత (హెచ్చు/తగ్గులు)లగూర్చి ఇప్పటికి విశ్లేషణలు జరగలేదు. నిజానికి సూర్యుడి ఆవిర్భావంకు సంబంధించిన అధ్యయనాలు ఇంకా పుంజుకోలేదు. భవిష్యత్తులో ఇవి తేలవచ్చు! సూర్యుడి ఆవిర్భావం తర్వాత సౌరకుంటుంబంలోని అష్టగ్రహాల ఆవిర్భావం కూడా ఏకకాలంలో జరగలేదు. ఒక్కో గ్రహానిది ఒక్కో ఆవిర్భావ చరిత్ర. ఈ సుదీర్ఘ మిలియన్ సంవత్సరాల చరిత్రలో భూమి ఆవిర్భవించడం, జీవం ఏర్పడడం, ఎదగడం, వృక్షజాతిగా, జంతుజాతిగా మారిపోవడం, అభివృద్ధికరమైన పరిణామం చెందడం, కనుమరుగు కావడం తెలిసిందే! ఇదో నిరంతర ప్రక్రియ. అయితే, భూమిపై ప్రసరించే సౌరకాంతి భూగోళమంతా ఏకరీతిన వుండదనేది కూడా తెలిసిందే! కారణం భూగోళం చూడడానికి గోళంగా ఉన్నా, భూమిపై వుండే భూభాగాలు విభిన్న రీతులలో వుండడమే. అత్యంత ఎత్తు భూభాగాలు పర్వతాలు అయితే, అత్యంత లోతట్టు ప్రాంతాలు సముద్రాలు. అందుకే భూభాగాల ఎత్తుకు సముద్ర మట్టాలతో పోల్చి కొలుస్తారు. అనగా సముద్ర తీరప్రాంతాల్లో (బీచ్‌లలో) భూభాగం ఎత్తు సున్నా (అడుగులు)గా వుంటే, తీరం నుంచి భూభాగం పైకి వచ్చిన కొద్దీ ఎత్తు పెరుగుతుంది. హిమాలయపర్వతాల ఎత్తును అక్కన్నుంచి ప్రారంభమైన నదులు కలిసే సముద్రప్రాంతంతో కొలుస్తారు. అనగా, భారత భూభాగాలు అత్యధికంగా బంగాళఖాతంతో పోల్చి కొలవబడగా, పశ్చిమ ప్రాంత భూభాగాలు, ముఖ్యంగా కేరళ నుంచి రాజస్థాన్ దాకా అరేబియా సముద్రంతో పోల్చి నిర్ణయిస్తారు. కాబట్టి భూభాగాలు లోతట్టుగా, మైదానాలుగా, పీఠభూములుగా, కొండలుగా, లోయలుగా, పర్వతాలుగా విభజించబడతాయి. ఈ భూభాగాల్లో సూర్యకాంతి తీవ్రత హెచ్చుతగ్గులుగా వుంటుంది. అనగా భౌగోళిక పరిస్థితులపై సూర్యకాంతి ఆధారపడుతుంది.

ప్రకృతి, వాతావరణ పరిస్థితులు కూడా భూమిపై సూర్యరశ్మి తీవ్రవతను ప్రభావితం చేస్తాయి. అన్నింటికి మించి వాతావరణంలోని ధూళికణాలు, నీటి బిందువులు, కాలుష్యం తదితర భూఉపరితల అంశాలు సూర్యరశ్మి తీవ్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అలాగే, కాలానుగుణంగా, రుతువుల ప్రభావం కూడా సూర్యరశ్మిని నియంత్రించడం జరుగుతుంది. గాలిలో తేమశాతం అధికంగా వున్నా, శీతాకాలంలో పొగమంచు ఎక్కువైనా, వర్షం కురిసినా సూర్యరశ్మి తీవ్రత తగ్గిపోతుంది. ఇవన్నీ సాధారణ అంశాలు. సూర్యరశ్మి ప్రభావాన్నిబట్టి జీవుల జీవన విధానం, మనుగడ, ఆరోగ్య సంబంధ సమస్యలు ఆధారపడి వుంటాయి. ఇక స్వయంపోషకాలైన ఆకుపచ్చ వృక్షజాతి, గడ్డి, పొదలు, మహావృక్షాలు, ఆహార పంటలు, ఫలసంపదలు, పూలజాతి తదితర వాటికి సూర్యరశ్మితో విడదీయరాని అనుబంధం వుంటుంది. ఈ విధంగా జీవరాశిలో సూర్యరశ్మిని తట్టుకొని జీవించేవి, తట్టుకోక తనువును చాలించేవి, పంటలు బాగా పండేవి, కొన్ని రకాలు ఎండిపోయేవి వుంటాయి. అంటే, భూగోళం విభిన్న వాతావరణ పరిస్థితుల్ని కలిగి వున్నట్లుగానే, సూర్యరశ్మి ప్రభావితానికి అనుగుణంగా, ఆవాసప్రాంతాలు, జీవరాశులు, వృక్షసంపద, నీటి ఆవాసాలు, సముద్రాలుమనుగడ సాగించడమే భౌగోళిక ప్రత్యేకత, విశిష్టత! సౌరకుంటుంబంలో ఏ ఇతర గ్రహానికి లేని అత్యున్నతస్థాయి పరిస్థితి కేవలం భూగోళానికే వుండడం సృష్టిలో ఓ వైవిధ్యం!

### వైవిధ్య భూగోళానికి సూర్యరశ్మి ఎందుకు తగ్గుతోంది...

సాధారణంగా పర్యావరణం గూర్చి మాట్లాడినప్పుడు. పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతల గూర్చి, సముద్రాలు వేడెక్కుతున్న వైనాల గూర్చి మాట్లాడుతాం. కాని, ఇప్పుడో కొత్త సమస్య భూగోళానికి

రాబోతున్నది. ప్రస్తుతం ప్రపంచవ్యాపితంగా ఎల్‌నినో (El-Nino) గూర్చి, రాబోయే వర్షాభావస్థితి గూర్చి చర్చ జరుగుతున్నది. ఇది గతంలో వున్నదేగా అని అనుకుంటే, గత ఎల్‌నినోకు, ఈసారి ఎల్‌నినోకు చాలా వ్యత్యాసం వున్నది. దీనికి కారణం పసిఫిక్ మహాసముద్ర జలాలు అత్యధికంగా (సాధారణం కంటే, 1-1.5°c) వేడెక్కడం కాగా, సూర్యరశ్మి భూమిని చేరకుండా చేస్తున్న వైనం మరోకటి.

ఈ విషయంగా 1988 నుంచి 2018 వరకు మూడు దశాబ్దాలపాటు సేకరించిన వాతావరణ అంశాలు, భూగోళంపై సూర్యరశ్మి తగ్గుదలను సూచించే సంఘటనలు భూగోళానికి పొంచివున్న ప్రమాదాల్ని. విపత్తుల్ని సూచిస్తున్నాయి. గతంలో ఎన్నడు లేనంత వర్షపాతాన్ని భారతదేశంతో పాటుగా, ప్రపంచం గత సంవత్సరం చవిచూసింది. దీంతో, దాదాపు అత్యధిక గంటలు, రోజులు సూర్యుడు లేడా అన్నంతగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో కూడా భూగోళం చవిచూడవచ్చు! పోతే, అత్యధిక వర్షపాతంతో పాటుగా, అతిస్వల్ప వర్షపాతాన్ని కూడా ఈ వర్షాకాలం చూడబోతున్నట్లు, వాతావరణ పరిశోధనా కేంద్రాలు (IMD) తెలుపుతున్నాయి.




పై మూడు దశాబ్దాల కాలంలో సూర్యరశ్మి ప్రభావంపై బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెట్రాలాజి (IITM), పుణె. మరియు ఇండియన్ మెట్రాలాజికల్ డిపార్ట్‌మెంట్ (IMD)లు సంయుక్తంగా చేపట్టిన ప్రాజెక్టు భారతదేశ వ్యాపితంగా తొమ్మిది ప్రాంతాల్లో గల 20 వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన గణాంకాల్ని పొందుపరిచి విశ్లేషించడం జరిగింది. ఈ నివేదికను నేచర్స్ సైంటిఫిక్ రిపోర్ట్సు (NSR)లో గత సంవత్సరం అక్టోబర్‌లో ప్రచురించడం జరిగింది. ఈ సంస్థల శాస్త్రజ్ఞులు పరిశీలించిన అంశాలు ఈ కింది విధంగా వున్నాయి. సాధారణంగా సూర్యరశ్మి నేలపై పడే తీవ్రత నిర్దిష్టస్థాయి కంటే ఎక్కువగా వుండే సమయాన్ని కొలిచి నమోదు చేస్తారు (120 W/m). ఈ సమయం సంవత్సరం మొత్తంలో ఎన్నిగంటలుంటుందో లెక్కించి, దీన్ని వార్షిక సూర్యకాంతి గంటలుగా గుర్తిస్తారు. దీంతో ఈ కింది ప్రాంతాల్లో తగ్గిన సూర్యరశ్మి ఈ విధంగా వుంది.

| | |
|---|---|
| తూర్పు తీరప్రాంతం | - 4.9 గంటలు |
| దక్కన్ పీఠభూమి | - 3.1 గంటలు |
| పశ్చిమ తీరప్రాంతం | - 8.6 గంటలు |
| ఉత్తర భారత మైదానాలు | - 13. 1 గంటలు |
| మధ్యభారతం | - 4.7 గంటలు |

సూర్యరశ్మి తీవ్రత జూన్ నుంచి సెప్టెంబర్ (వర్షరుతువు) వరకు తగ్గుతున్నదని, అక్టోబర్ నుంచి మే వరకు మామూలుగా, కొంత మేర తీవ్రంగా వుంటున్నట్లుగా బనారస్ హిందూ విశ్వవిద్యాలయం శాస్త్రజ్ఞుడు మనోజ్ కె శ్రీ వాస్తవ్ తెలిపాడు.

**సూర్యరశ్మి తగ్గుదలకు గల కారణాలు:**

గాలిలో పేరుకపోతున్న ఏరోసోల్స్ (ఘన, ద్రవ బిందువులు) సాంద్రత మామూలు స్థాయికంటే పెరిగిపోవడం ప్రధాన కారణంగా పరిశోధనలు తెలిపాయి. ఇవే కాకుండా పొగమంచు, కర్మాగారాలు వెలువరించే ఉద్గారాలు, వాహక కాలుష్యాలు, పదార్థాలను మండిచడం ద్వారా వెలువడే తీవ్రస్థాయి కార్బన్‌డయాక్సైడ్, ఇతర వాయువులు, విమానాల ఉద్గారాలు ఏరోసోల్స్‌ను మరింతగా బంధింప చేయడంతో ఏరోపోల్స్ మందం పెరిగిపోతున్నది. ఈ పెరుగుదల, సాధారణంగా వర్షించే మేఘాల్ని వర్షించకుండా చేస్తాయి. దీంతో వర్షాభావస్థితి ఏర్పడడంతోపాటు, సాధారణ సూర్యరశ్మి నేలకు చేరకుండా జరుగుతుంది.

**సూర్యరశ్మి తరుగుదల ప్రభావం ఎలా వుంటుంది:**

సూర్యరశ్మి తరుగుదల ప్రధానంగా వ్యవసాయ రంగంపై ప్రభావాన్ని చూపుతుంది. పంటల దిగుబడి తగ్గడమే కాకుండా, చీడ, కీటకాల బెడద పెరుగుతుంది. మనుషులకే కాకుండా, జీవరాశికి కూడా తీవ్ర ఆహారకొరత ఎదురైతుంది. అన్నింటికిమించి, కిరణజన్య సంయోగ క్రియలో అనూహ్య మార్పులు జరిగి, ఆకుపచ్చ వృక్షజాతి ఆహారాన్ని తయారు చేసుకోలేని స్థితి ఏర్పడి, ఎండిపోయి, అడవులు ఎడారులుగా మారుతాయి. ఇదో కొత్తరకమైన ప్రకృతి విపత్తుగా మారుతుంది.

**సూర్యకాంతి తగ్గుదల (తరుగు) అంటే..**

సూర్యుని నుంచి వెలువడే సూర్యకాంతి నేరుగా గ్రహాలన్నింటికి చేరదు. రోదశిలో (బాహ్యాంతర) వుండే కారకాల కారణాలు ఈ సూర్యకాంతిని అడ్డుకోవడం, వెనక్కి తిరిగి పంపించడం జరుగుతుంది. కొంతమేర భూమి ఉపరితలం నుంచి కూడా వెనక్కి మరలడం (వికీరణం) జరుగుతుంది. నిజానికి భూ ఉష్ణోగ్రతను నియంత్రించడంలో ఇవి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి.

కాని, మానవుడి మస్తిష్క అభివృద్ధి నమూనాలు, ఇతర సాధనాలు, కాలుష్య కారకాలు, వాహనాలు, ఉపగ్రహాలు విడుదలచేసే ఉద్గారాలు, కార్బన్‌డయాక్సైడ్ సంబంధిత హరితవాయువులు, గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా పోతున్నప్పుడు లేచే ధూళికణాలు, నీటి బిందువులు, పొగ, పొగమంచు తదితర అనేక అంశాలు సూర్యకాంతిని తిరిగి వెనక్కి మళ్ళించడం, వడపోయడం లేదా పూర్తిగా అడ్డుకోవడం చేస్తాయి.

నిజానికి, ఈ ప్రక్రియలన్నీ భూమిని ఎండతీవ్రత నుంచి రక్షిస్తాయి. కాని భూమికి కావల్సిన సూర్యకాంతి అందకుండా పోతున్నది. ఫలితంగా భూమికి కావల్సిన సూర్యకాంతి లభించడం లేదు.

**పరిష్కారాలేంటి..?**

ప్రకృతి విపత్తులకు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు కొన్ని పరిష్కారాలున్నాయి. కాని సూర్యకాంతి తరుగుదలకు, మానవుడి చేతుల్లో దాదాపు ఏమిలేదనే చెప్పాల్సి వస్తుంది. ఉంటే, అవి అభివృద్ధి నిరోధకంగా కనపడతాయి. ముందుగా, విమానయానాన్ని పూర్తిగా నియంత్రించగలగాలి. విచ్చలవిడిగా ప్రయోగిస్తున్న ఉపగ్రహాల్ని అదుపు చేయాలి. మొత్తంగా యుద్ధాల్ని ఆపివేయాలి. భూమిపై వాహనాల నియంత్రణ జరగాలి. కర్మాగారాల పొగగొట్టాలు మూసుకపోవాలి. శిలాజ ఇంధనాలను దహించడం నిషేధించాలి. మానవుడి అభివృద్ధికి బంధనాలను వేసుకోవాలన్నమాట! ఇవి జరిగేపనులు కావు కాబట్టి, సూర్యకాంతి భూమికి చేరడం భవిష్యత్‌లో మరింతగా తగ్గిపోవచ్చు!

ఇదే జరిగితే, ఓ బిలియన్ సంవత్సరాల మనుగడగా అంచనా వేస్తున్న మానవ మనుగడ మరింత ముందుగానే ముగియవచ్చు. కాని ఇది జరగకూడదని ఆశిఆద్దాం!

**కృత్రిమ సూర్యరశ్మి పరిష్కారమా..?**

ప్రపంచ వ్యాపితంగా నిత్యం పంపబడే ఉపగ్రహాల గ్లాసు ప్యానల్స్ భూ ఉపరితలంకు పోయిన తర్వాత సూర్యకాంతితో అనుసంధానమై విభిన్న దిశలకు సూర్యకాంతిని పరావర్తనం చెందిస్తాయి. దీన్ని గుర్తించిన శాస్త్రజ్ఞులు ఈ సూర్యకాంతిని రాత్రుల్లో వాడుకోవచ్చు అని గుర్తించారు. కాని, దీనిపై భిన్న అభిప్రాయాలున్నాయి.




సాధారణంగా సోలార్ ప్యానల్స్ (Solar Farming) పగలంతా (సూర్యరశ్మి వున్నంతకాలం) పనిచేస్తాయి. రాత్రి అవి నిద్రావస్థలోకి వెళ్ళుతాయి. ఈ కృత్రిమ సూర్యకాంతి ద్వారా, సోలార్ ప్యానల్స్‌కు రాత్రుల్లో కూడా సూర్యరశ్మిని ప్రసరింపచేస్తారు. అంటే, భూమిచుట్టూ తిరిగే ఉపగ్రహాలకు దాదాపు నిరంతరం సూర్యరశ్మి అందుతుంది. అలా పొందే సూర్యరశ్మిని వాటికుండే గ్లాస్ ప్యానల్స్ గ్రహించడం, సూర్యకాంతిని పరావర్తనం చెందించడం ద్వారా రాత్రుల్లో కూడా ఈ సోలార్ ప్యానల్స్ సూర్యకాంతిని పొందేలా చేస్తారు. దీంతో సోలార్ ప్యానల్స్ 24 గంటలు పని చేసేలా చూడాలనేది ఈ ఆలోచన. ఈ ఆలోచనతో 2026లో 18 మీటర్ల పొడవుగల ఎరెండిల్-1 (Earendil-1) ఉపగ్రహాన్ని ప్రయోగించాలని చూస్తున్నారు. 2030 నాటికి ఇలాంటి నాల్గువేల ఉపగ్రహాల్ని ప్రయోగించాలనేది దీని ప్రణాళిక. ఇలా ప్రయోగించబడే ఉపగ్రహం భూమి నుండి 625 కి.మీ. ఎత్తులో వుంటుంది. ప్రతి ఉపగ్రహానికి వెడల్పుగా వుండే గ్లాస్ ప్యానల్స్‌ను అమరుస్తారు. ఈ ఉపగ్రహం సుమారు 7 కి.మీ. పరిధిలో సూర్యకాంతిని ప్రసరింపచేస్తుంది. అయితే, ఈ సూర్యకాంతి స్వభావసిద్ధంగా వుండే పగటి సూర్యకాంతిలో 15,000 రెట్లు తక్కువగా (కాంతి హీనంగా) వుంటుందనేది అంచనా! అయినా ఈ కాంతి పూర్ణచంద్రుడి కాంతికన్నా ప్రభావితంగా వుంటుంది.

**సూర్యకాంతి తగ్గుదలకు ఇతర కారకాలు**

- 1815లో ఇండోనేసియాలోని తాంబోరాం (Tambora) 1991లో పిలిప్పిన్స్‌లోని పినాటుబో (Pinatubo) లాంటి అగ్నిపర్వతాలు పేలడంతో కొన్ని సంవత్సరాలు సూర్యకాంతి తగ్గింది.
- సూర్యకాంతిని పైరానోమీటర్ (Pyranometer)తో కొలుస్తారు. ఒక చదరపు మీటర్ ప్రాంతంలో ప్రసరించే సూర్యకాంతిని కొలిచి నిర్ధారిస్తారు.
- సోలార్ రేడియేషన్‌ను 1950 నుంచి గుర్తించడం మొదలైంది. 1960-1990 వరకు సరాసరి 4 నుంచి 6 శాతం సూర్యకాంతి తరుగుదలను గుర్తించారు.
- దక్షిణార్ధగోళం కన్నా, ఉత్తరార్ధ గోళంలో సూర్యకాంతి తగ్గుదల ఎక్కువగా వుంది. కారణం, యూరప్ దేశాల పారిశ్రామికీకరణే దీనికి కారణం.

పోతే, ఈ విధానం విజయవంతమైతుందా, అవసరమా అనే ప్రశ్నలు వున్నాయి. అభివృద్ధి అంటే లాభసాటిగా భావించే వ్యవస్థలో, వీటి ద్వారా జరిగే ప్రతికూల అంశాల్ని పట్టించుకోకపోవచ్చు. ఈ ప్రణాళిక నిజంగా ముందుకు వస్తే, భవిష్యత్తులో ఇలాంటి ఉపగ్రహాల్ని సుమారుగా 2,50,000లను రోదసిలోకి (భూమి చుట్టూ) పంపాల్సి వుంటుంది. అప్పుడు భూమిపై నిరంతర సూర్యరశ్మి ప్రసరించే పరిస్థితి ఏర్పడుతుంది.

**ప్రతికూలతలు:**

ఈ ఆలోచనలు పెరుగుతున్న క్రమంలో రోదసి పరిశోధనలు చేసే ఆస్ట్రానమర్స్ అభ్యంతరాలు చెపుతున్నారు. ఈ కృత్రిమ సూర్యకాంతిలో చంద్రుడి ఉనికిని సరిగా గుర్తించలేమని, ఇతర గ్రహాలకు గుర్తించడం కష్టమని భావిస్తున్నారు. అలాగే, కాంతి కాలుష్యం అధికమయ్యే ప్రమాదం కూడా వుంటుంది. ఈ నిరంతర సూర్యకాంతి, నిశాచర (nocturnal) జీవుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అన్నింటికి మించి ఇది అత్యధిక వ్యయంతో కూడుకున్న వ్యవహారం కాగా, భూగోళం యొక్క ఉనికికే ప్రమాదకారిగా మారవచ్చు. ఏదైనా వినాశకాలే విపరీతబుద్ధిగా ఈ ఆలోచనలు వుండేలా వున్నాయి.

- డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com

# నవకల్పనే సాంకేతిక స్వావలంబన!



ఎడ్లబండి నుండి విమానం వరకు, ఉత్తరాల నుండి వీడియో కాల్ వరకు మనుషుల మధ్య దూరాన్ని తగ్గించింది ఖచ్చితంగా టెక్నాలజీ అనడంలో అతిశయోక్తి లేదు. కానీ ఈ టెక్నాలజీని మంచి విషయాలకు వాడకుండా చెడు వాటికి వాడితే అది ఖచ్చితంగా బాధాకరం. దేశ ప్రజలు ఈ టెక్నాలజీలో మరింత వృద్ధి చెందాలని, ఎన్నో సమస్యలను పరిష్కరించాలని కోరుకుందాం.

*మార్పు మాత్రమే కీలక నిర్ణాయక శక్తి. అది కొత్త ఆలోచనలను తీసుకొస్తుంది. కొత్త ఆలోచనలు అంటే నవకల్పనలే. అవి నవీకరణ సాధనకు, నవ్య కార్యాచరణకు దారితీస్తాయి.*

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తిదాయక పలుకులివి. 2047కల్లా వికసిత భారత్‌ను సాధించడానికి అవి తారక మంత్రాలుగా నిలుస్తున్నాయి. 1998, మే 11న అప్పటి ప్రధాని వాజ్‌పాయ్ నాయకత్వంలో డాక్టర్ కలాం సారథ్యంలో అణు పరీక్షలు జరిగాయి. ఏటా అదే తేదీన జాతీయ సాంకేతిక విజ్ఞాన దినోత్సవం జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా ముందు మనం ఎదుర్కోబోయే సవాళ్లను, అందిపుచ్చుకోవాల్సిన మార్పులను అవలోకించడం అవసరం.

గడచిన రెండు దశాబ్దాలలో భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణనీయంగా పురోగమించింది. అణు, అంతరిక్ష రంగాలతో పాటు రక్షణ వ్యవస్థలూ, సమాచార, సాంకేతిక, బయో టెక్నాలజీ రంగాల్లో అపూర్వ ప్రగతి సాధించింది. రక్షణ రంగంలో క్షిపణులు, శత్రు క్షిపణుల నిరోధక వ్యవస్థలు, బ్రహ్మోస్, ఎల్‌సీఏ యుద్ధ విమానం తయారీ భారత్ ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లు, చంద్రయాన్, మంగళయాన్ యాత్రలు అంతరిక్షంలో మహత్తర విజయాలుగా భాసిల్లుతున్నాయి. మన చంద్రయాన్, మంగళ్‌యాన్‌లు సాంకేతికంగా అద్భుతమైనవే కాదు, అత్యంత తక్కువ ఖర్చుతో అపార ఫలితాలు సాధించినవి కూడా!

### స్వావలంబనకు పెద్దపీట

అణుశక్తి రంగంలో కొత్త శిఖరాలకు దూసుకుపోవడానికి భారత్ సిద్ధంగా ఉంది. అధిక జనాభా కలిగిన మన దేశంలో విద్యుత్ అవసరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కర్బన ఉద్గారాలకు స్వస్తి చెప్పి సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులకు మళ్లాలని భారత్ లక్షిస్తోంది. 2047కల్లా అణు రియాక్టర్ల ద్వారా 100 గిగావాట్ల విద్యుదుత్పత్తికి పథకాలు అమలు చేస్తోంది. దార్శనికుడు డాక్టర్ హోమీ జె భాభా వేసిన పునాదిపై భారత అణు కార్యక్రమం దినదిన ప్రవర్ధమానమవుతోంది. విఖ్యాత గణిత, భౌతిక శాస్త్రవేత్త పాల్ డిరాక్ శిష్యుడే భాభా. అణు విద్యుచ్ఛక్తిని పుష్కలంగా తయారుచేసుకున్న రోజున భారత్ ఇంధన దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుందని భాభా ఉద్ఘాటించారు. ఆయన కలను సాకారంచేసే క్రమంలో భారత ప్రభుత్వం న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌ను చేపట్టింది. 2033కల్లా

అయిదు స్వదేశీ ఎస్ఎంఆర్‌లు పనిచేయడం ఆరంభిస్తాయని అంచనా. వీటికి అవసరమైన సాంకేతికతలను స్వయంగా రూపొందించుకుంటున్నాం. హోమీ భాభాతోపాటు డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ప్రొఫెసర్ సతీశ్ ధవన్, డాక్టర్ అబ్దుల్ కలాం నాయకత్వంలో భారతదేశం రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాల్లో గొప్ప విజయాలను సొంతం చేసుకుంది. రాడార్లు, సోనార్లు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థల తయారీలో స్వావలంబన సాధించింది.

### సమన్వయంతో ఆవిష్కరణలు

కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్, లేజర్, జలాంతర్గత సాంకేతికతలూ... ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్వయంచాలిత వాహనాల వంటి రంగాల్లో ప్రపంచంలోనే అగ్రగాములకు దీటుగా నిలవడానికి భారత్ నడుంకట్టింది. ఈ ధ్యేయం నెరవేరాలంటే అత్యాధునిక సాంకేతికతల్లో ఉత్కృష్ట సాధన కేంద్రాలను నెలకొల్పాలి. వాటికి నిధులతో పాటు నిపుణులనూ కేటాయించాలి. ప్రయోగశాలల్లో రూపొందిన కొత్త సాంకేతికతలను వెంటనే ఉత్పత్తులు, సేవల రూపంలోకి మార్చాలి. 2050 కల్లా భారతదేశ సాంకేతిక రూపు రేఖలను మార్చడం కోసం కేంద్రం ఇండియా ఏఐ మిషన్, జాతీయ క్వాంటమ్ మిషన్, సూపర్ కంప్యూటింగ్ మిషన్, వాతావరణ మార్పుల మిషన్, 6జీ పైలట్ ప్రాజెక్టులు చేపట్టింది. విశ్వ విద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా సంస్థల సమన్వయంతో అన్ని రంగాల్లో అద్భుత ఆవిష్కరణలు సాధించడానికి 'అనుసంధాన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్'ను స్థాపించింది. డీప్‌టెక్ అంకురాలనూ కేంద్రం పెద్దయెత్తున ప్రోత్సహించనుంది. వర్ధమాన దేశాల్లో పాలన, సమ్మిళిత అభివృద్ధి, పౌర సేవలకు డిజిటల్ పౌర మౌలిక వసతులను (డీపీఐ) నెలకొల్పడానికి భారత్ చేయూతనిస్తోంది. ఆధార్, యూపీఐ, జాతీయ డిజిటల్ హెల్త్ మిషన్ డీపీఐకి ప్రతీకలు. డిజిటల్ ఇండియా అమలులో తాను సాధించిన అనుభవ, పరిజ్ఞానాలను వర్ధమాన దేశాలతో పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉంది.



### నాయకత్వ స్థాయికి...

వివిధ రంగాల్లో నవీన పరిశ్రమలను విస్తరించడం, వాటి ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడం ద్వారా పౌర, రక్షణ రంగాల్లో అంతర్జాతీయంగా పోటీపడే స్థాయిని భారత్ అందుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అంతర్జాతీయ పారిశ్రామిక ఉత్పత్తిలో భారత్ వాటా 2.8 శాతమే. దీన్ని మరింతగా పెంచుకోవడానికి అధునాతన సాంకేతికతలను ఉపయోగించుకోవాలి. జీడీపీలో 16 శాతంగా ఉన్న పారిశ్రామిక రంగం వాటాను రానున్న అయిదేళ్లలో 25శాతానికి పైగా పెంచాలి. ఈ లక్ష్య సాధనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కీలకమవుతాయి. వీటికి ప్రభుత్వం, ప్రైవేటు రంగంలోని భారీ పరిశ్రమలు చేయూతనిస్తే భారతదేశం ప్రధాన పారిశ్రామిక వస్తూత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించ గలుగుతుంది. స్వదేశీ, విదేశీ పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలను ప్రవహింపజేస్తే భారత్‌లో పారిశ్రామికోత్పత్తి, ఎగుమతులు పెరుగుతాయి. తద్వారా అధిక ఆర్థికాభివృద్ధి రేటు సాధ్యమవుతుంది. ఇందుకు కావాల్సింది- దృఢ సంకల్పం. మన యువశక్తినీ, మేధాశక్తినీ, నైపుణ్యాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటే 'వికసిత భారత్' సాధన వేగవంతమవుతుంది. ఔత్సాహిక వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి కేంద్రం పలు చర్యలు తీసుకుంది. స్టార్టప్ ఇండియా పథకం ద్వారా అంకుర సంస్థలకు దన్ను ఇస్తోంది. ఈ ప్రయత్నాలు క్రమంగా ఫలిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా మూడు శాతం. వచ్చే దశాబ్దంలో ఇది మరింత పెరగనుంది. 'భారత్‌లో తయారీ' కోసం ప్రవేశపెట్టిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం మంచి ఫలితాలను ఇస్తోంది. కాబట్టి అత్యాధునిక సాంకేతికతల పునాదిపై ప్రపంచ నాయకత్వానికి ఎదగడం భారత్‌కు సాధ్యమే.

1998 మే 11వ తేదీన మనదేశం పోఖ్రాన్‌లో విజయవంతంగా అణుపరీక్షను నిర్వహించింది. 1998లో మే 11వ తేదీన భారత దేశంలో శక్తి-1 అణుక్షిపణిని రాజస్తాన్ లోని పోఖ్రాన్ ఆర్మీ టెస్ట్ రేంజ్‌లో మన శాస్త్రవేత్తలు పరీక్షించారు. రెండు రోజుల తర్వాత మరో రెండు పరీక్షలు చేసి అణుశక్తి గల దేశాల్లో మనదేశాన్ని కూడా చేర్చారు.

ఇదే రోజున హంస-3ని కూడా శాస్త్రవేత్తలు రూపొందించారు. నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏఎల్), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్)లు సంయుక్తంగా దీన్ని రూపొందించాయి.

1988 సంవత్సరంలో మే 11వ తేదీన డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) త్రిశూల్ మిస్సైల్ చివరి పరీక్షను పూర్తి చేసింది.

1999 నుంచి ప్రతీ యేటా ఈరోజున (మే 11వ తేదీ) టెక్నాలజీ డెవలప్ మెంట్ బోర్డు(టీడీబీ) జాతీయ టెక్నాలజీ దేగా జరుపుతుంది. మనదేశానికి సాంకేతిక పరమైన సేవలందించిన శాస్త్రవేత్తలకు అవార్డులను కూడా అందిస్తారు.

*మే 11న జాతీయ 'టెక్నాలజీ' దినోత్సవంగా మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయ్ ప్రకటించారు.*

- కొత్వాల్ సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com

# నిర్మల్ గుట్టలపై రాగాలు పలికే రాళ్లు...

ప్రకృతిలో ఎన్నో అద్భుతాలు ఉంటాయి, ఎన్నో అందాలు ఉంటాయి. వాటి వెనుక కారణాలు ఏమున్నా, అవి ప్రత్యేకంగా నిలిచి ప్రజలచే ఆరాధించబడతాయి. వేల సంవత్సరాలుగా మానవుడు వాటి ప్రత్యేకతలను వింతగా చూస్తూనే ఉన్నాడు.

నిర్మల్ జిల్లా కేంద్రానికి ఉత్తరాన ఉన్న సయాద్రి పర్వత శ్రేణుల్లో ఎన్నో సహజ అందాలు, జలపాతాలు, వంకలు తిరిగిన కాలిబాటలు, దట్టమైన అరణ్యాలు, వేల సంవత్సరాలుగా కనువిందు చేస్తున్నాయి. నిర్మల్ పట్టణానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గండి రామన్న గుట్టలు ఎంతో ప్రసిద్ధి చెందినవి.



సముద్ర మట్టానికి సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉన్న పెద్ద పెద్ద రాళ్లు కుప్పలు కుప్పలుగా పేర్చినట్లు కనిపిస్తాయి. రాళ్లపై రాళ్లు చేరి ఉండటం వల్ల కింద సహజంగా అనేక గుహలు ఏర్పడ్డాయి. ఆది మానవులు ఈ ప్రాంతంలో సంచరించినట్లు, మధ్య శిలాయుగపు ప్రాచీన మానవుల ఆవాసాలను ఇక్కడ గుర్తించవచ్చు.

### గండి రామన్న ప్రాంత చారిత్రక ప్రాముఖ్యత

గండి రామన్న ప్రాంతం ఒకప్పుడు దట్టమైన అరణ్యంగా ఉండేది. జమీందారులు, రాజ కుటుంబాలకు చెందిన వారు ఈ ప్రాంతానికి వచ్చి పులులు, సింహాలను వేటాడేవారని చెబుతారు.

శ్రీరాముడు వనవాస సమయంలో దండకారణ్యంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ గోదావరి తీరం వెంబడి ప్రయాణించే క్రమంలో గండి రామన్న ప్రాంతంలోని గుహలో కొంతకాలం నివసించి, శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రతిరోజూ అర్చనలు చేసినట్లు స్థానికులు కథలుగా చెప్పుకుంటారు. అందుకే ఈ గుహలో శివలింగం, నంది, ఆంజనేయుడు విగ్రహాలతో పాటు ఒక వీరగల్లు కూడా ఉన్నాయి.

రాముడు ఈ ప్రాంతంలో సంచరించినందున ఈ ప్రాంతాన్ని “రామన్న గండి” అని పిలుస్తారు. గుహల్లో సుమారు అర కిలోమీటర్ వరకు ఒకదానికొకటి కలిసిన మార్గాలు ఉన్నాయి. లోతుగా ఉండటంతో ఇక్కడికి చేరుకోవడానికి స్థానికులు భయపడుతుంటారు.

### రాగాలు పలికే రాళ్లు:

గండి రామన్న రాతిగుట్టలోని గుహలో సుమారు ఐదు మీటర్ల లోపలికి వెళితే ఒక పెద్ద రాయి ఉంటుంది. మిగతా పెద్ద రాళ్లతో కలిసి గుహ ఏర్పడటానికి ఇది కారణమైంది.

గుహలోపల సుమారు 20 ఫీట్ల పొడవు, 10 ఫీట్ల వెడల్పు ఉంటుంది. గుహపై పేర్చిన సుమారు 10 టన్నుల బరువు గల పురాతన రాతి శిల ఉంది. ఈ శిలను మరొక రాయితో కొడితే కంచు మ్రోగినట్లు శ్రావ్యమైన శబ్దం వస్తుంది.

ఈ రాయిని ఎక్కడ కొట్టినా ఒకే విధమైన ఘనమైన శబ్దం వస్తుంది. కానీ మిగతా రాళ్లను కొడితే ఈ తరహా శబ్దం రాదు. ఈ రాతిగుట్టకు పశ్చిమ వైపున ఉన్న సాయిబాబా మందిరానికి వచ్చే భక్తులు ఈ గుహను సందర్శించి ఈ స్వరాలు పలికే రాయిని కొట్టి ఆశ్చర్యపోతారు.

ఇక్కడి నుండి సుమారు 150 ఫీట్లు పైకి వెళితే మరో శిల ఉంటుంది. అది కూడా రాగాలు పలుకుతుంది. కానీ అక్కడికి చేరుకోవడం ప్రమాదకరం. లోతైన రాళ్ల సందులు ఉండటం వల్ల లోయల్లో పడిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ఎక్కువ మంది అక్కడికి వెళ్లడానికి సాహసించరు.

### నిర్మల్ గుట్టలు మరియు కోటలు:

నిర్మల్ పట్టణం గుట్టలతో నిండి ఉంటుంది. కాలనీలు గుట్టల చుట్టూ ఏర్పడ్డాయి. రాతిగుట్టలపై రాజులు కోటలను నిర్మించారు.

బత్తిస్‌గడ్, శంఖగడ్, వెంకటేశ్వరగడ్, బసేరగడ్ వంటి కోటలు కొండలపై నిర్మించబడ్డ అద్భుత నిర్మాణాలు. వీటిలో ముఖ్యమైనది ఖిల్లా గుట్ట.

నిర్మల్ పట్టణం మధ్యలో ఉన్న ఈ గుట్టను పద్మనాయక వంశస్థులు అంతఃపురంగా, రాణివాసంగా ఉపయోగించారు. ఫ్రెంచ్ వారి సహకారంతో ఈ కోటలను అభివృద్ధి చేశారు.

ఖిల్లా గుట్ట తూర్పు దిశగా ముఖద్వారం కలిగి ఉంది. సముద్ర

మట్టానికి సుమారు 300 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ గుట్టపై నివాస భవనాలు, అక్కాచెల్లెల బావి, రహస్య సొరంగ మార్గాలు, సైనికుల గదులు, సుమారు 5000 లీటర్ల నీరు నిల్వ చేసే రాతి తొట్టె, ఫిరంగులు ఉన్నాయి.

ఈ కోట చుట్టూ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రాతి గోడ ఉంది. కోట పశ్చిమ వైపున “కంచు బండ”గా పిలిచే ఒక పెద్ద రాయి ఉంది. దీనిని కొడితే ఆలయ గంట మ్రోగినట్లు శబ్దం వస్తుంది. కానీ దీనిని చేరుకోవడం చాలా కష్టం.



**బాసరలో వేద శిల:**

నిర్మల్ జిల్లా కేంద్రానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాసరలో జ్ఞాన సరస్వతి ఆలయం ప్రసిద్ధి చెందింది.

ఆలయానికి సమీపంలో ఉన్న ఒక శిలను “వేదశిల” అని పిలుస్తారు. భక్తులు అక్కడికి వెళ్లి మొక్కులు చెల్లించి, రాయిని కొట్టి స్వరాలను ఆస్వాదిస్తారు.

సుమారు 10 ఫీట్ల ఎత్తు, 12 ఫీట్ల వెడల్పు కలిగిన ఈ శిలను సందర్శకులు సులభంగా చేరుకోవచ్చు. కొందరు భక్తులు దీనికి ప్రదక్షిణలు కూడా చేస్తారు.

**ఇవి ఎలా ఏర్పడుతాయి?:**

రాముని పాదస్పర్శతో అహల్య రాయి జీవించింది అనే పురాణ కథనం మనకు తెలిసిందే. రాళ్లతో అద్భుతమైన విగ్రహాలు చెక్కడం, ఆలయాలు నిర్మించడం -all these show the greatness of stone.

రాగాలు పలికే రాళ్లను “మ్యూజిక్ స్టోన్స్” లేదా “సింగింగ్ రాక్స్” అని పిలుస్తారు.

తెలంగాణలో సిద్ధిపేట జిల్లా, నల్గొండ జిల్లా, జనగామ ప్రాంతాల్లో కూడా ఇటువంటి రాళ్లు గుర్తించబడ్డాయి. విదేశాల్లో వీటిని “రింగింగ్ రాక్స్” అని పిలుస్తారు. అమెరికా, మెక్సికో, పశ్చిమ ఆస్ట్రేలియాలో కూడా ఇవి ఉన్నాయి.

భౌతిక శాస్త్రంలో వీటిని “సోనారస్ రాక్స్” లేదా “లిథోఫోనిక్ రాక్స్” అంటారు. భూగోళ శాస్త్ర ప్రకారం ఇవి సుమారు 20 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయని అంచనా.

బసాల్టిక్ లావా ఉపరితలంపైకి వచ్చి గట్టిపడినప్పుడు ఈ రాళ్లు ఏర్పడతాయి. రాళ్లలోని అంతర్గత ఒత్తిడి, అణు సాంద్రత, ఫెరిక్ ఆక్సైడ్ శాతం, నిర్మాణం ఇవన్నీ కలిసి శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి.

ఈ రాళ్లు నేలతో పూర్తిగా అంటుకుని ఉండవు; కొంచెం ఎత్తులో ఉండటం కూడా శబ్దానికి కారణం.

**సంరక్షణ అవసరం:**

- సింగింగ్ రాక్స్ ఒక అరుదైన సహజ సంపద. వీటిని కాపాడుకోవాలి.
- ప్రత్యేక రక్షిత ప్రాంతాలుగా గుర్తించాలి
- ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- క్వారీ పనులకు రాళ్లను ఉపయోగించరాదు
- పగలగొట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పర్యాటక మరియు పురావస్తు శాఖలు అభివృద్ధి చేయాలి
- సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి
- భవిష్యత్తులో ఇవి భూభౌతిక వారసత్వ సంపదగా నిలవాలి.

డా॥ తుమ్మల దేవరావ్
m : 8985742274
e:thummaladrdevarao@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# సి.పి. బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన కృషి

తెలుగు భాషా సాహిత్య అభివృద్ధికి అపారమైన సేవలు చేసిన విదేశీయుల్లో ప్రముఖుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఆయన 1798 నవంబర్ 10న ఇంగ్లాండ్‌లో జన్మించాడు. ఆయన తండ్రి రెవరెండ్ డేవిడ్ బ్రౌన్. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి కలిగిన బ్రౌన్ తూర్పు దేశాల భాషలపై కూడా ఆకర్షితుడయ్యాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ సేవలో భాగంగా 1817 ప్రాంతంలో భారత్‌కు వచ్చి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉద్యోగం ప్రారంభించాడు. ఉద్యోగ కారణంగా తెలుగు ప్రాంతాల్లో పనిచేసే అవకాశం రావడంతో ఆయనకు తెలుగు భాషపై ప్రత్యేక ఆసక్తి పెరిగింది. విదేశీయుడైనా తెలుగు నేర్చుకోవాలని సంకల్పించి స్థానిక పండితులను సంప్రదించి చదువుకున్నాడు.



ఆ కాలంలో తెలుగు భాషకు సరైన ప్రాధాన్యం లేకపోవడం, ప్రాచీన గ్రంథాలు చెదిరిపోతూఉండడం ఆయనను కలచివేసింది. తెలుగు సాహిత్యాన్ని సంరక్షించాలి అనే సంకల్పంతో ఆయన కృషి ప్రారంభించాడు. తాను పనిచేసిన కడప, రాజమండ్రి, మచిలీపట్నం ప్రాంతాల్లో పండితులను కలుసుకొని పాత గ్రంథాలను సేకరించాడు. ఆ గ్రంథాలు ఎక్కువగా తాళపత్రాలపై ఉండేవి. అవి కాలగర్భంలో కలిసిపోకుండా వాటిని కాపీ చేయించి, తప్పులను సరిచేసి, ముద్రణలోకి తీసుకువచ్చాడు. ఈ కృషి వల్ల ఎన్నో ప్రాచీన రచనలు మనకు అందుబాటులోకి వచ్చాయి.

1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయ్యింది. అయితే తెలుగు నేర్చుకోడానికి సులభమైన, శాస్త్రీయమైన విధానం లేకపోవడం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడంలోని ఈ ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారితీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైనచోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాసమేర్పరచుకొన్నాడు. అక్కడ ఒక బంగళా కొని, సొంత డబ్బుతో పండితులను నియమించి, అందులో తన సాహితీ వ్యాసంగాన్ని కొనసాగించాడు. అయోధ్యాపురం కృష్ణారెడ్డి అనే ఆయన ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తూ ఉండేవాడు.

కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉచితంగా భోజనవసతి కూడా కల్పించాడు. దానధర్మాలు విరివిగా చేసేవాడు. వికలాంగులకు సాయం చేసేవాడు. నెలనెలా పండితులకిచ్చే జీతాలు, దానధర్మాలు, పుస్తక ప్రచురణ ఖర్చుల కారణంగా బ్రౌను ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. అప్పులు కూడా చేసాడు. 1834లో ఉద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాదకుడిగా ఇండియా వచ్చాడు. బ్రౌను మానవతావాది. 1832-33లో వచ్చిన గుంటూరు కరువు లేదా డొక్కల కరువు లేదా నందన కరువు సమయంలో ప్రజలకు బ్రౌను చేసిన సేవలు ప్రశంసలందుకున్నాయి. ఆ సమయంలో కరువును కరువుగా కాక కొరతగా రాయాలని అధికారులు చెప్పినా, కరువుగానే పేర్కొనడంతో వారి అసంతృప్తిని ఎదుర్కొన్నాడు. పందొమ్మిదో శతాబ్ది తొలిపాదం చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలుపెట్టేనాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్పుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకులాడుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టిపోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించిపోతూ ఉండడం నా కళ్ళబడింది. నేను 30 ఏళ్ళు కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ఠ చేశాన'న్నాడు బ్రౌన్. నిరలంకారంగా మాట్లాడ్డం బ్రౌన్ శైలి. ఈ మాటల్లో కూడా అందుకే అతిశయోక్తులు కనిపించవు. 1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రాసినప్పటికీ, ఆయనకి మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఇందులో దాదాపు ఏడొందల పద్యాలకి ఆంగ్లానువాదాలతోపాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల మేరకి విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశారు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు. బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్ లో అవివాహితునిగానే మరణించాడు. ఈయనను కెన్సెల్ గ్రీన్

శ్మశానంలో సమాధి చేశారు

సి.పి. బ్రౌన్ తెలుగు సాహిత్యంలో చేసిన అత్యంత ముఖ్యమైన సేవల్లో వేమన పద్యాల ప్రచురణ ప్రధానమైనది. వేమన పద్యాలు ప్రజల్లో విస్తృతంగా తెలియని సమయంలో ఆయన వాటిని సేకరించి శుద్ధి చేసి ప్రచురించాడు. దీని వల్ల వేమన తత్వం ప్రపంచానికి తెలిసింది. అలాగే పోతన భాగవతం, నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ మహాభారత భాగాలు, వివిధ శతకాలు, పూరాణ గ్రంథాలు వంటి అనేక రచనలు సేకరించి ప్రచురించాడు. ఈ విధంగా తెలుగు సాహిత్య సంపదను సంరక్షించాడు.




- తెలుగు భాష అభివృద్ధికి ఆయన నిఘంటువులు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆయన రచించిన ముఖ్యమైన గ్రంథాలు:
- A Grammar of the Telugu Language (1829) – తెలుగు వ్యాకరణాన్ని వివరించిన గ్రంథం
- Telugu-English Dictionary (1852) – తెలుగు పదాలకు ఇంగ్లీషు అర్థాలు తెలిపిన నిఘంటువు
- English-Telugu Dictionary (1854) – ఇంగ్లీషు పదాలకు తెలుగు అర్థాలు తెలిపిన గ్రంథం
- A Dictionary of Mixed Dialects and Foreign Words used in Telugu – తెలుగు భాషలోని మిశ్ర పదాలను వివరించిన గ్రంథం
- Vemana Satakam (సంపాదకత్వం) – వేమన పద్యాల సేకరణ
- Telugu Reader – తెలుగు నేర్చుకునే వారికి రూపొందించిన పాఠ్య గ్రంథం
- Andhra Mahabharatamu (సంపాదకత్వం) – మహాభారత భాగాల ప్రచురణ
- Pothana Bhagavatam (సంపాదకత్వం) – పోతన భాగవతం ప్రచురణ



ఈ గ్రంథాలు తెలుగు నేర్చుకునే వారికి మార్గదర్శకంగా నిలిచాయి. తెలుగు వ్యాకరణాన్ని శాస్త్రీయంగా వివరించడం ద్వారా ఆయన భాషకు వ్యవస్థీకృత రూపాన్ని ఇచ్చాడు. విదేశీయులు కూడా తెలుగు నేర్చుకునేలా సరళమైన పద్ధతులు రూపొందించాడు.

సి.పి. బ్రౌన్ తెలుగు పండితులను ప్రోత్సహించడం కూడా ఒక గొప్ప సేవ. పండితులకు వేతనాలు ఇచ్చి గ్రంథాల ప్రతులు సిద్ధం చేయించాడు. ముద్రణా విధానాన్ని ప్రోత్సహించి తెలుగు గ్రంథాలను ప్రచురించాడు. అప్పటివరకు చేతిరాత ప్రతులుగా ఉన్న గ్రంథాలు ఆయన వల్ల ముద్రిత రూపంలో ప్రజలకు చేరాయి. ఆయన తన స్వంత ధనాన్ని కూడా ఈ కార్యక్రమాలకు వినియోగించాడు.

తెలుగు భాషను పాశ్చాత్యులకు పరిచయం చేయడంలో కూడా ఆయన పాత్ర గొప్పది. ఆయన నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు విదేశీయులకు తెలుగు నేర్చుకోవడానికి ఉపయోగపడ్డాయి. భాషా సంస్కృతిపై ఆయన చూపిన గౌరవం తెలుగు ప్రజల అభిమానాన్ని పొందింది.

సి.పి. బ్రౌన్ 1884 డిసెంబర్ 12న మరణించాడు. కానీ ఆయన చేసిన సేవలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. ఒకసారి మనం ఆలోచిస్తే.. ఆయన లేకపోతే ఎన్నో ప్రాచీన గ్రంథాలు నశించి ఉండేవి. వేమన పద్యాలు, శతకాలు, పూరాణాలు ఈరోజు మనకు అందుబాటులో ఉండేవా అన్న ప్రశ్న కలుగుతుంది. ఈ దృష్టితో చూస్తే ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు అమూల్యమైనవి.

మొత్తంగా చూస్తే సి.పి. బ్రౌన్ కేవలం ఒక విదేశీయ అధికారి మాత్రమే కాదు; తెలుగు భాషా సంరక్షకుడు, సాహిత్య సేవకుడు, సంస్కృతి పరిరక్షకుడు. తెలుగు భాషా చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

–ఆమంచ లోకేష్
m : 6304006470
e: lokeshamacha@gmail.com

# శిథిలాల నుండి పంటకోత వరకు



10 నుండి 70 అడుగుల లోతు ఉన్న ఈ లోయలు, ప్రతి వర్షాకాలానికి క్రమంగా కోతకు గురిచేస్తూ, నేటికీ విస్తరిస్తూనే ఉన్నాయి.



లోయలలో నాటడం కోసం మొక్కలను తీసుకువెళ్తున్న గ్రామస్థులు

వినాశకరమైన వరదల వలన గుజరాత్ రాష్ట్రంలోని గ్రామాలు కోల్పోయిన వ్యవసాయ భూములు 50 ఏళ్ల తర్వాత తిరిగి జీవం పోసుకున్నాయి.

సంవత్సరాల తరబడి జరిగిన కోత మరియు నష్టం తరువాత, మహినది వెంబడి ఉన్న గ్రామ నివాసులు లోయల తాకిడికి గురైన ఉమ్మడి భూములను పునరుద్ధరించడానికి, వ్యవసాయ క్షేత్రాలను మరియు జీవనోపాధులను తిరిగి తీసుకురావడానికి దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు.

**సారాంశం:**

- 1973లో గుజరాత్‌లోని మహి నది పరివాహక ప్రాంతంలో సంభవించిన వరదలు, విస్తారమైన వ్యవసాయ భూములను మరియు గ్రామ ఉమ్మడి భూములను కొట్టుకుపోయాయి.
- దశాబ్దాలుగా ఏర్పడిన లోతైన లోయల వల్ల వేలాది హెక్టార్ల భూమి నాశనమై, సాగుకు పనికిరాకుండా పోయింది.
- ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల మద్దతుతో గ్రామస్థులు నేల, నీటి సంరక్షణ ద్వారా భూమిని పునరుద్ధరించడానికి సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు.
- ఒకప్పుడు శాశ్వతంగా కోల్పోయామని భావించిన భూములను ప్రజలు తిరిగి స్వాధీనం చేసుకుంటుండటంతో, నేడు వ్యవసాయం, జీవనోపాధులు పునరుజ్జీవిస్తున్నాయి.

1973లో వరదలు తమ కుటుంబ వ్యవసాయ భూమిని కొట్టుకుపోయినప్పుడు, హరేష్‌భాయ్ సోలంకి తాను మళ్లీ దానిలో వ్యవసాయం చేయలేనని అనుకున్నారు. ఐదు దశాబ్దాల తర్వాత, గుజరాత్‌లోని రుస్తంపురా గ్రామంలో ఆయన తన మొదటి పంటను కోశారు. దశాబ్దాలుగా బీడుగా పడి ఉన్న పొలాల నుండి ఈ 33 ఏళ్ల యువకుడు కొన్ని రోజులు పొగాకును కోస్తూ గడిపారు.

అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే, ఈ పంట ద్వారా రూ. 2.5-3 లక్షలు లభించవచ్చు. దీంతో తన 1.6 హెక్టార్ల పొలం నుండి అతనికి సుమారు రూ. 1 లక్ష లాభం మిగులుతుంది.

సోలంకికి, ఈ పంట కేవలం దాని ద్రవ్య విలువకు మించిన ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఎందుకంటే అతని కుటుంబం ఈ పొలాలను చివరిసారిగా 1973లో సాగు చేసింది. ఖేడా జిల్లాలోని థాస్రా తాలూకాలో కురిసిన అపూర్వమైన వర్షాలు, ఆ ప్రాంతంలో సంభవించిన అత్యంత విస్తృతమైన మరియు వినాశకరమైన వరద సంఘటనలలో ఒకటిగా నిలిచాయి. ఆ వరదలలో సోలంకి తాత, విఠల్‌భాయ్, తమ వ్యవసాయ భూమిని కోల్పోయారు.

"ఐదు దశాబ్దాల క్రితం, భారీ వర్షాలు కేవలం ఒక వారంలోనే మా వ్యవసాయ భూమిని కొట్టుకుపోయాయి" అని అతను తెలిపాడు. "వర్షాలు తగ్గిన తర్వాత మేము తిరిగి వెళ్లి చూసేసరికి, అక్కడ ఏమీ మిగల్లేదు."

**విపత్తు భూమి స్వరూపాన్ని మార్చివేసింది.**

ఆగస్టు 26 నుండి సెప్టెంబర్ 9 మధ్య కురిసిన భారీ వర్షాల కారణంగా గుజరాత్‌లోని మాహి నది పరివాహక ప్రాంతంలో 1973లో సంభవించిన వినాశకరమైన వరదలలో ఈ విధ్వంసం కూడా ఒక భాగం. విస్తారమైన వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయి. సోలంకి కుటుంబంతో సహా అనేక కుటుంబాలు తమ భూములను కోల్పోయాయి.

నది తీరాన ఉన్న గ్రామాలు కూడా పశువుల మేతకు, వంటచెరుకు సేకరణకు, ఇతర దైనందిన అవసరాలకు ఉపయోగించే విశాలమైన ఉమ్మడి భూములను కోల్పోయాయి.

సెప్టెంబర్ 2023లో ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ (FES) వారు 'కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ద్వారా లోయల


లోయల సమీపంలో సాగునీటి కోసం వ్యవసాయ చెరువు


కోతను నివారించడానికి నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించడం

పునరుద్ధరణ' అనే పేరుతో విడుదల చేసిన ఒక నివేదిక, మాహి నదీ పరివాహక ప్రాంతంలోని గ్రామాలలో విస్తృతంగా భూమి క్షీణించిందని పేర్కొంది. ఈ నది దక్షిణ రాజస్థాన్‌లో ఉద్భవించి, పంచమహల్స్, మహిసాగర్, వడోదర, ఖేడా మరియు ఆనంద్ వంటి జిల్లాల గుండా ప్రవహించి, ఖంభట్ గల్ఫ్ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది.

మహిసాగర్ జిల్లాలోని వనక్‌బోరి, ఆనంద్ జిల్లాలోని ధువరన్ మధ్య 120 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతంలో, 106 గ్రామాలలో FES నిర్వహించిన ప్రాథమిక సర్వేలో 17,992 హెక్టార్లకు పైగా ఉన్న ఉమ్మడి, ప్రైవేట్ భూములు లోయల వల్ల ప్రభావిత మయ్యాయని తేలింది.

ఇసుకతో కూడిన సారవంతమైన నేల, వృక్షసంపద లేకపోవడం, పదేపదే కురిసిన భారీ వర్షాలు కలిసి తీవ్రమైన కోతకు దారితీశాయి. కాలక్రమేణా, లోతైన, నిరంతర లోయలు ఏర్పడ్డాయి.

నేడు 10 నుండి 70 అడుగుల లోతు ఉండే ఈ లోయలు, ప్రతి వర్షాకాలంతో వ్యవసాయ భూములను, ప్రజా భూములను భారీగా కోసుకుంటూ విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ ప్రాంతంలో లోయల విస్తరణ స్థాయి ఇప్పుడు చంబల్ నదీ పరీవాహక ప్రాంతం తర్వాత రెండవ స్థానంలో ఉందని భావిస్తున్నారు. ఇది అడ్డంగా మరియు నిలువుగా కూడా భారీ స్థాయిలో విస్తరిస్తోంది.

ఖేడా జిల్లా బ్లాక్ టీమ్ కోఆర్డినేటర్ దేవభాయ్ ఘుంభాల్య, దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉందని అంటున్నారు. "ఈ ఉమ్మడి భూములే గ్రామ జీవనానికి వెన్నెముకగా ఉండేవి" అని ఆయన వివరిస్తున్నారు. "ఈ లోయలు పశువుల మేతకు ఆటంకం కలిగిస్తాయి. నేల కోతను వేగవంతం చేస్తాయి. అంతేకాకుండా వనరులను పంచుకోవడానికి ఉపయోగపడే గ్రామాల మధ్య సాంప్రదాయ మార్గాలను కూడా మూసివేస్తాయి."

2019లో ఒక రాత్రి కురిసిన దాదాపు 11 అంగుళాల భారీ వర్షం కారణంగా ఆ ప్రాంతంలోని కొన్ని భాగాలలో 10 అడుగుల వరకు సారవంతమైన పైపొర మట్టి కొట్టుకుపోయిందని అతను గుర్తుచేసుకున్నాడు.

### భూమిని పునరుద్ధరించడం

అయినప్పటికీ నేడు, సామాజిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వేతర సంస్థల సహాయం మరియు కార్పొరేట్ నిధుల మద్దతుతో ఈ గ్రామాలు క్షీణించిన భూమిని పునరుద్ధరించడానికి కలిసికట్టుగా పనిచేస్తున్నాయి.

1990ల నుండి ఈ భూములను పునరుద్ధరించడానికి పలు స్థాయిలలో ప్రయత్నాలు జరుగుతున్నాయని సోలంకి చెప్పారు. "మా తాతగారి కాలం తర్వాత 60 ఏళ్లలో ఈ భూమిలో పొగాకు పండించడం ఇదే మొదటిసారి" అని ఆయన అన్నారు.

సార్నాల్ జిల్లాలోని సుఖిని మువాడ్ గ్రామానికి చెందిన 62 ఏళ్ల గిరీష్ చావడా, వరదల సమయంలో తమ గ్రామానికి చెందిన దాదాపు 140 హెక్టార్ల ఉమ్మడి భూమి కోతకు గురైందని గుర్తుచేసుకున్నారు. "ఆ విపత్తు తర్వాత, సహకార సంఘాల ద్వారా భారతదేశ పాడి రంగాన్ని మార్చివేసిన వర్గీస్ కురియన్ మా గ్రామాన్ని సందర్శించారు" అని ఆయన చెప్పారు.

1987లో జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (NDDB) సభ్యులు గ్రామాన్ని సందర్శించినప్పుడు, కురియన్ స్వయంగా గ్రామస్తులకు మార్గదర్శనం చేశారు. "ఒక సమాజంగా ఏకమై, భూమిని పునరుద్ధరించే బాధ్యతను తీసుకోవాలని ఆయన మమ్మల్ని ప్రోత్సహించారు. మేమందరం అంగీకరించాము," అని సోలంకి చెప్పారు.

NDDB మరియు కార్పొరేట్ నిధుల మద్దతుతో లాభాపేక్ష లేని ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ (FES), పునరుద్ధరణ ప్రయత్నాలపై గ్రామస్థులతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. 2014-15 నుండి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) ద్వారా చాలా మంది గ్రామస్థులు ఉపాధి కూడా పొందారు. ఇందులో సుమారు 80 శాతం కుటుంబాలు పాల్గొన్నాయి.

### నీటి వేగాన్ని తగ్గించడం

ఈ కార్యక్రమాలు క్షీణించిన భూమిని పునరుద్ధరించడానికి, అవసరమైన నేల మరియు నీటి సంరక్షణ పద్ధతుల గురించి గ్రామస్థులు జ్ఞానాన్ని పొందడానికి సహాయపడ్డాయి.



నేలను పునరుద్ధరించడానికి గుంతలు పెడుతున్న గ్రామస్థులు



పునరుద్ధరణ కోసం లోయలపై కట్టిన మట్టి కట్టలు

సుఖిని మువాడి గ్రామానికి చెందిన కిరిత్‌భాయ్ గణపత్‌శ్రీ ఈ శిక్షణ ఒక సరళమైన సూత్రాన్ని అనుసరించి జరిగిందని చెప్పారు. "నీరు వేగంగా ప్రవహించి నేలను కోతకు గురిచేసే చోట, దాని ప్రవాహాన్ని తగ్గించాలి. అది నిలకడగా ప్రవహించే చోట, నీటిని నిలిపి ఉంచి, భూగర్భ జలాలను పునరుజ్జీవింప జేయడానికి భూమిలోకి ఇంకనివ్వాలి" అని ఆయన వివరించారు. ఈ విధానం కోతకు గురైన ప్రాంతాలలో పూడిక పేరుకుపోవడానికి సహాయపడిందన్నారు.

MGNREGA మరియు FES నేతృత్వంలోని సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల కింద, నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించి, నేల కోతను తగ్గించడానికి గ్రామస్థులు గాబియన్ గోడలు, చెరువులు, చిన్న కాలువల వంటి నిర్మాణాలను చేపట్టారని గణపత్‌శ్రీ తెలిపారు.

"నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించడం వల్ల, నేల కోతకు గురైన ప్రాంతాలలో పూడిక పేరుకుపోవడానికి కూడా వీలు కలిగింది. వ్యవసాయ క్షేత్రాలలో, ఎత్తును సృష్టించి నీటిని నిలుపుకునేందుకు నిర్మాణాలు చేపట్టారు. తద్వారా నీటిపారుదల కోసం చిన్న చెరువులు ఏర్పడ్డాయి" అని ఆయన తెలిపారు.

పచ్చదనాన్ని పెంచే ప్రయత్నాలకు ఎన్‌డిడిబి కూడా మద్దతు ఇచ్చింది. నీటి నిలుపుదల సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి, నేల కోతను నివారించడానికి పొదలు, తీగలు, చెట్లను నాటారు.

### జీవనోపాధి తిరిగి వస్తుంది

లిండోరా గ్రామానికి చెందిన 33 ఏళ్ల జ్యోస్నాబెన్ చావడా ప్రారంభంలో జరిగిన మెరుగుదలలు గ్రామస్తులలో విశ్వాసాన్ని పెంచడానికి సహాయపడ్డాయని చెప్పారు. "చెట్లు పెరగడంతో, మహిళలు తోటల నుండి వంటచెరుకును సేకరించడం ప్రారంభించారు. మేము మళ్లీ పశువులను మేపగలిగాము" అని ఆమె అన్నారు. "గతంలో మేము వీటిని మార్కెట్ నుండి కొనవలసి వచ్చేది. దీనికోసం నెలకు సుమారు రూ. 2,000 ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చు తగ్గింది."

కాలక్రమేణా, ఈ ప్రయత్నాలను గ్రామాలంతటా పునరావృతం చేయడం జరిగింది. దీని ఫలితంగా భూమి క్రమంగా పునరుద్ధరించబడింది. 65 గ్రామాలలో, కోత వలన దాదాపు 18,000 హెక్టార్ల భూమి క్షీణించగా, అందులో ఇప్పుడు సుమారు 4,800 హెక్టార్లు పునరుద్ధరించబడ్డాయి.

తన గ్రామంలో ప్రభావితమైన 140 హెక్టార్లలో సుమారు 34 హెక్టార్లను పునరుద్ధరించినట్లు చావడా చెప్పారు. పశుగ్రాసం లభ్యత మెరుగుపడటంతో, గ్రామస్తులు పశుపోషణపై పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు.

"మొదట్లో మా గ్రామం రోజుకు సుమారు 200 లీటర్ల పాలు ఉత్పత్తి చేసేది. ఇప్పుడు అది దాదాపు 800 లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తూ ఎన్‌డిడిబికి అందిస్తోంది. దీనివల్ల మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది" అని ఆయన అన్నారు.

ఈ ఆర్థిక ప్రయోజనాల వల్ల వలసలు తగ్గాయి. ఫలితంగా చాలా మంది గ్రామస్తులు రోజువారీ కూలీ పనులను వదిలి సాంప్రదాయ వ్యవసాయానికి తిరిగి వస్తున్నారు.

ఇటాడా గ్రామానికి చెందిన 51 ఏళ్ల మణిలాల్ పర్మార్‌కు ఐదు హెక్టార్ల భూమి ఉంది. 2023లో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాల వల్ల మరింత నష్టం జరిగిందని ఆయన అంటున్నారు.

"నా పొగాకు పంటను కోల్పోయి దాదాపు రూ. 3 లక్షల నష్టాన్ని చవిచూశాను. నా జీవితంలో ఇదే అత్యంత దారుణమైన నష్టం" అని అతను అంటున్నాడు.

పునరుద్ధరణ ప్రయత్నాల తర్వాత, అతను గత ఏడాది పొగాకు పంటపై రూ. 1.5 లక్షల లాభం సంపాదించాడు. అయితే, ఇంకా మరింత అవగాహన, కృషి అవసరమని పర్మార్ తెలిపారు.

"సమాజ సభ్యులుగా ఈ లోయ భూములపై.. మాకు స్పష్టమైన యాజమాన్య హక్కులు లేవు. ఉమ్మడి భూమిని పునరుద్ధరించడానికి పెట్టుబడి పెట్టడంపై చాలా మందికి పెద్దగా ఆసక్తి లేదనిపిస్తోంది. దీనివల్ల భూమి క్షీణత కొనసాగుతోంది" అని ఆయన అన్నారు. "గ్రామస్తులు ఉమ్మడి వనరులను పరిరక్షించడం యొక్క విలువను గుర్తించి, దీర్ఘకాలికంగా నిలదొక్కుకునే శక్తిని పెంపొందించుకోవాలి."

–హిమాంశు నిట్నవారే

*(ఈ రిపోర్టర్, కామన్స్ ప్రాముఖ్యత మరియు దాని కమ్యూనిటీ స్టీవార్డ్‌షిప్ పై ప్రామిస్ ఆఫ్ కామన్స్ మీడియా ఫెలోషిప్ 2024 గ్రహీత).*

ఫోటోలు: ఎఫ్‌ఈఎస్

'డౌన్ టు ఎర్త్' సౌజన్యంతో..



బాల **చెలిమి**

పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300




### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300




### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850







పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - April 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

VOL 14వ వసంతంలో
165 ISSUES నూట అరవై ఐదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



దక్కన్ ల్యాండ్

**పదమూడు వసంతాల ప్రస్థానం...**

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 మే సంచికతో 165 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar